


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 270 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శుక్రవారం 7 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 270 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD FRI 7 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## బస్‌డిపో కోసం గాజులరామారం దగ్గర 100 ఎకరాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** జగద్గిరిగుట్ట వద్ద బస్ డిపో నిర్మాణం కోసం టీజీఎస్ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారం వద్ద 100 ఎకరాలు కేటాయించినట్లు కేంద్ర రహదారి, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ అంశంపై గురువారం రాష్ట్ర ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్‌లు లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు ఆయన ఈమేరకు సమాధానం ఇచ్చారు. "గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోకి వచ్చే జగద్గిరిగుట్ట గుండా 28 జిల్లా బస్సులు, 47 సిటీ బస్సులు రోజూ 404 ట్రిప్పులు తిరుగుతాయి. బస్ డిపో,

- మిగతా 2లో

## తెల్ల రేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఖరారు

### ఆగస్టు 15న రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ

- సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- అన్ని నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమం
- డెబిట్ కార్డు సైజులో బార్‌కోడ్‌తో రానున్న కొత్త కార్డులు



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆగస్టు 15న కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించనుంది. సంగారెడ్డి వేదికగా జరగనున్న రాష్ట్రస్థాయి కార్యక్రమంలో

- మిగతా 2లో

## ట్రైయినీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసులో కొత్త ట్విస్టులు..

### దర్యాప్తులో వెలుగుచూస్తున్న సంచలన అంశాలు..!

- ప్రతిష్ఠాత్మక కెరీర్‌పై వివాదాల ముసురు, దర్యాప్తులో వెలుగులోకి కొత్త ఆధారాలు..?
- సోదాల్లో లభ్యమైన కత్తి, ప్రేమలేఖలు వివాహితతో సంబంధాలపై పోలీసుల ఆరా..!
- లివ్-ఇన్ ప్రతిపాదనపై విచారణలో వెలుగుచూసిన వివరాలు..




మహిళా ట్రైయినీ ఐపీఎస్ ఫిర్యాదు తర్వాత మలుపు తిరిగిన కేసు, బలవంతంగా గదిలోకి ప్రవేశించాడనే ఆరోపణలు, శిక్షణ సమయంలో ప్రవర్తనపై సహచరుల వాంగ్మూలాలు ఇప్పటివరకు 20 మందికి పైగా సాక్షులను విచారించిన, పోలీసు దర్యాప్తు దిశను నిర్ణయించనున్న డిజిటల్ ఆధారాలు.. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఐపీఎస్ సేవల్లో అడుగుపెట్టిన ట్రైయినీ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి, వ్యక్తిగత ప్రవర్తనకు సంబంధించిన ఆరోపణలతో తీవ్ర వివాదాల్లో చిక్కుకున్నారు. మహిళా ట్రైయినీ ఐపీఎస్ అధికారిణి ఫిర్యాదు నేపథ్యంలో సాగుతున్న దర్యాప్తులో కొత్త విషయాలు వెలుగులోకి రావడం కేసుకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది..

పెన్ పవర్ ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్ ఆగస్టు 6:

- మిగతా 2లో



## అన్ని రోడ్ నెట్‌వర్క్‌లను ఒకే వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** హెచ్ఎండీఏ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ మహానగర భవిష్యత్తు రోడ్ల విస్తరణ, అభివృద్ధి పైనే ఆధారపడి ఉందని సీఎం అన్నారు. అవసరమైన భూ సేకరణ పనులను వేగవంతం చేయాలని, ఇందులో అలసత్వం చూపరాదని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "నగరంలోని అన్ని రోడ్ నెట్‌వర్క్‌లను ఒకే వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలి. భూసేకరణ, రుణాలు, రోడ్ల నిర్వహణ..

- మిగతా 2లో




తెలంగాణ సిద్ధాంతకర్త, ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా నివాళి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో పాటు బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఆయన ఉద్యమ సేవలను స్మరించుకున్నారు. పలు ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు జయశంకర్ చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

హైదరాబాద్ పెన్ పవర్:

- జయశంకర్ జయంతి వేళ రాష్ట్రవ్యాప్తంగా నివాళులు
- ఆయన సేవలను కొనియాడిన సీఎం రేవంత్
- ఉద్యమానికి దిక్సూచి అన్న కేటీఆర్
- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ప్రత్యేక కార్యక్రమం
- జయశంకర్ సేవలను గుర్తుచేసిన బండి సంజయ్
- సరూర్‌నగర్‌లో తెలంగాణ రక్షణ సేన సభ



### కేటీఆర్ నివాళి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జయశంకర్‌కు ఘన నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనే ఆయన జీవిత లక్ష్యమని పేర్కొన్నారు. ఉద్యమానికి బలమైన సిద్ధాంతపరమైన దిశ చూపిన మహనీయుడిగా అభివర్ణించారు.



### బండి సంజయ్ నివాళి

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలంగాణ కోసం జయశంకర్ తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ఆయన సేవలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

- మిగతా 2లో



డేటా సెంటర్ల హబ్‌గా హైదరాబాద్..

## విశాఖపై ప్రపంచ దిగ్గజాల చూపు

- విశాఖపై పెరుగుతున్న పెట్టుబడిదారుల ఆసక్తి
- నైట్ ఫ్రాంక్ నివేదికలో ముంబయికి ప్రపంచ టాప్-15లో చోటు
- హైదరాబాద్‌కు భారీ ప్రాజెక్టుల వరుస
- విశాఖలో గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుల అవకాశాలు
- క్లౌడ్, ఏఐతో పెరుగుతున్న డిమాండ్
- భారత్‌కు బలపడుతున్న గ్లోబల్ గుర్తింపు

- మిగతా 2లో

## పోలవరం-బనకచర్లకు కేంద్రం బ్రేక్.. ఏపీ ప్రతిపాదన వెనక్కి

- పర్యావరణ ప్రతిపాదనను వెనక్కి పంపిన కేంద్రం
- ఈఏసీ నివేదికల ఆధారంగా నిర్ణయం
- ట్రిబ్యునల్ తీర్పుపై అభ్యంతరాలు
- పొరుగు రాష్ట్రాల ఆందోళనలను గుర్తుచేసిన కేంద్రం
- సీడబ్ల్యూసీ అనుమతులు తప్పనిసరని సూచన
- వివాదాల తర్వాతే కొత్త దరఖాస్తు పంపాలని హితవు

- మిగతా 2లో



## రైతుల కోసం కేంద్రం రూ.23,731 కోట్ల 'గోబర్ధన్' పథకం

- పథకానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- పశువుల పేడ, వ్యవసాయ వ్యర్థాలకు పెరగనున్న డిమాండ్
- సీబీజీ ఉత్పత్తిని పది రెట్లు పెంచే లక్ష్యం
- సీబీజీకి ప్రభుత్వం మద్దతుతో స్థిర ధర
- కొత్త బయోగ్యాస్ ప్లాంట్లకు రూ.2 కోట్ల వరకు సాయం
- గ్రామీణ ఉపాధి, పెట్టుబడులకు ఊతం

- మిగతా 2లో





హైదరాబాద్ వాసులకు చల్లని కబురు..

## శనివారం వరకు వర్షాలు

- హైదరాబాద్‌లో శనివారం వరకు ఉరుములతో కూడిన వర్షాలు
- ప్రస్తుతం 12 శాతంగా ఉన్న వర్షపాతం లోటు తగ్గే అవకాశం
- తెలంగాణ వ్యాప్తంగా సాధారణ స్థాయిలోనే వర్షపాతం నమోదు
- కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా అదనపు వర్షపాతం

- మిగతా 2లో

## యూపీఐపై ఛార్జీలకు లోక్‌సభ గ్రీన్ సిగ్నల్..

- యూపీఐ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- వాయిస్ ఓటుతో చర్చ లేకుండానే బిల్లు పాస్
- యూపీఐపై ఛార్జీలకు చట్టపరమైన మార్గం
- ఎండీఆర్ మినహాయింపు నిబంధన తొలగింపు
- పెద్ద వ్యాపారులకే ఛార్జీలు వర్తించే అవకాశం
- సాధారణ వినియోగదారులకు ప్రభావం ఉండదని సంకేతాలు

- మిగతా 2లో




**పెన్ పవర్ డెస్క్:** డిజిటల్ చెల్లింపులకు సంబంధించి కీలక మార్పులకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. యూ పీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే అవకాశానికి మార్గం సుగమం చేసే 'పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ (సవరణ) బిల్లు-2026'ను లోక్‌సభ గురువారం మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఎలాంటి చర్చ లేకుండానే బిల్లు పాస్ అయింది.ప్రస్తుతం




## డీప్‌ఫేక్‌లపై కేంద్రం ఉక్కుపాదం.. 3 గంటల్లో తొలగించాల్సిందే

- డీప్‌ఫేక్‌లపై కేంద్రం కఠిన నిబంధనలు
- సున్నితమైన ఫిర్యాదుల పరిష్కారానికి 2 గంటలే
- ఏఐ కంటెంట్‌కు గుర్తింపు వివరాలు తప్పనిసరి
- ఆటోమేటెడ్ వ్యవస్థలతో పర్యవేక్షణ
- డీప్‌ఫేక్ గుర్తింపునకు ఐఐటీల సాంకేతికత
- ఫిర్యాదుల కోసం అప్పీల్ వ్యవస్థ, 'సహయోగ్' పోర్టల్

**పెన్ పవర్ డెస్క్:** సోషల్ మీడియాలో కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో రూపొందుతున్న డీప్‌ఫేక్ వీడియోలు, ఆడియోలు, ఫొటోలకు అడ్డుకట్ట వేసేందుకు

- మిగతా 2లో

## కొత్త ఉద్యమానికి కాక్రోచ్ పార్టీ శ్రీకారం.. దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్?'

- సెప్టెంబర్ నుంచి 'క్యా బోల్తీ పబ్లిక్?' ప్రచారం
- దేశవ్యాప్తంగా ప్రజలతో నేరుగా సంభాషణ
- విద్య వ్యాణిజ్యీకరణపై సీజేపీ విమర్శలు
- ఫీజుల భారం తగ్గించాలని డిమాండ్
- నిరుద్యోగాన్ని ప్రధాన సమస్యగా ప్రస్తావన
- ఎన్నికలకు దూరంగా ఉంటామని స్పష్టీకరణ

**పెన్ పవర్ డెస్క్:** జంతర్‌మంతర్‌లో నీట్ ప్రశ్నాపత్రం లీక్‌లపై చేపట్టిన ఆందోళనల తర్వాత దేశవ్యాప్తంగా ప్రజల్లోకి వెళ్లాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్ణయించింది. సెప్టెంబర్ నుంచి 'క్యా బోల్తీ పబ్లిక్?'



- మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## రైతుల కోసం కేంద్రం రూ.23,731 కోట్ల 'గోబర్ధన్' పథకం

వ్యవసాయ అవశేషాలు, పశువుల వ్యర్థాలతో అదనపు ఆదాయం పొందేలా రైతులకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక అవకాశం కల్పించింది. బయోగ్యాస్ రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా రూ.23,731 కోట్ల వ్యయంతో 'గోబర్ధన్' జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకానికి కేంద్ర క్యాబినెట్ గురువారం ఆమోదం తెలిపింది.2026-27 నుంచి 2035-36 వరకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. దేశీయంగా 'కంప్రెస్డ్ బయోగ్యాస్' (సీబీజీ) ఉత్పత్తిని దాదాపు పది రెట్లు పెంచడమే ప్రధాన లక్ష్యంగా కేంద్రం నిర్ణయించింది. రైతుల నుంచి సేకరించే పశువుల పేడ, వ్యవసాయ వ్యర్థాలకు డిమాండ్ పెరగడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా విస్తరించనున్నాయి.సీబీజీ ఉత్పత్తిదారులకు స్థిరమైన మార్కెట్ కల్పించేందుకు ప్రత్యేక కొనుగోలు విధానాన్ని కేంద్రం తీసుకొచ్చింది. అలాగే సీబీజీకి ప్రతి ఎంఎంబీటీయూకు రూ.2,110 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించింది. దీనివల్ల ఉత్పత్తిదారులకు దీర్ఘకాలిక ఆదాయ భరోసా లభించనుంది.

కొత్తగా ఏర్పాటు చేసే సీబీజీ ప్లాంట్లకు రోజుకు ఒక టన్ను ఉత్పత్తి సామర్థ్యానికి గరిష్ఠంగా రూ.2 కోట్ల వరకు మూలధన సాయం అందించనున్నారు. ఇప్పటికే ఉన్న ప్లాంట్ల విస్తరణకు కూడా ఈ సాయం వర్తిస్తుంది. ముడి పదార్థాల సేకరణ, సేంద్రియ ఎరువుల తయారీ, విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధికి కూడా ప్రోత్సాహం లభించనుంది.సీబీజీ ప్లాంట్లను గ్యాస్ పైప్‌లైన్లతో అనుసంధానించేందుకు అవసరమైన మౌలిక వసతులకు మద్దతు ఇవ్వనున్నారు. ఎంఎస్ఎంఈ ఆధారిత ప్రాజెక్టులకు రుణ హామీ పథకం కూడా అమలు చేయనున్నారు. దీంతో పెట్టుబడులు పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని కేంద్రం భావిస్తోంది.

## కొత్త ఉద్యమానికి కాక్రోచ్ పార్టీ శ్రీకారం.. దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్?'

- మొదటి పేజి తరువాయి
పేరుతో దేశవ్యాప్త ప్రచార కార్యక్రమం చేపడుతున్నట్లు పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దిప్కే ప్రకటించారు.ఛత్రపతి శంభాజీనగర్‌లో జరిగిన రెండు రోజుల జాతీయ కోర్ కమిటీ సమావేశం ముగిసిన తర్వాత దిప్కే మీడియాతో మాట్లాడారు. విద్యార్థులు, యువత, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకొని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు.దేశంలో విద్య పూర్తిగా వ్యాపారంగా మారిందని దిప్కే విమర్శించారు. మొదటి తరగతి ప్రవేశానికే రూ.లక్షల ఫీజులు, భారీ విరాళాలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మధ్యతరగతి, ఉద్యోగ కుటుంబాలు పిల్లలను చదివించడం భారంగా మారిందన్నారు. ఉన్నత విద్య, కోచింగ్ పేరుతో తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్య ప్రతి ఒక్కరి హక్కని, అది అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నీట్ అక్రమాలపై జరిగిన ఆందోళనల్లో నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారని దిప్కే గుర్తుచేశారు. దేశంలో నిరుద్యోగం కూడా అత్యంత కీలక సమస్యగా మారిందన్నారు. న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘంపై ప్రజల్లో విశ్వాసం దెబ్బతింటోందని వ్యాఖ్యానించారు. అధికారాన్ని ప్రశ్నించే స్వతంత్ర పాత్రను మీడియా పోషించాలని కోరారు.సీజేపీ ఎన్నికల్లో పోటీ చేయదని, ప్రజల హక్కుల పరిరక్షణ, పాలనలో సంస్కరణల కోసం ఒత్తిడి తెచ్చే శక్తిగా పనిచేస్తుందని దిప్కే స్పష్టం చేశారు.

## డేటా సెంటర్ల హబ్‌గా హైదరాబాద్.. విశాఖపై ప్రపంచ దిగ్గజాల చూపు

భారత్ డేటా సెంటర్ రంగంలో వేగంగా దూసుకెళ్తోంది. ఇప్పటికే హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న డేటా సెంటర్ కేంద్రాల్లో ఒకటిగా నిలిచింది. విశాఖపట్నం భారీ స్థాయి కొత్త డేటా సెంటర్ ప్రాజెక్టులకు ఆకర్షణీయ గమ్యంగా మారుతోంది. ఈ విషయాలు నైట్ ఫ్రాంక్ విడుదల చేసిన తాజా నివేదికలో వెల్లడయ్యాయి.ప్రపంచంలోని 36 ప్రధాన డేటా సెంటర్ మార్కెట్లపై నిర్వహించిన అధ్యయనంలో ముంబయి ఆపరేషనల్ సామర్థ్యం పరంగా 15వ స్థానంలో నిలిచింది. అభివృద్ధి దశలో ఉన్న ప్రాజెక్టుల జాబితాలో 11వ స్థానాన్ని దక్కించుకుంది. హైదరాబాద్ ప్రస్తుతం 151 మెగావాట్ల సామర్థ్యంతో 27వ స్థానంలో ఉన్నా, 2.2 గిగావాట్లకు పైగా అభివృద్ధి ప్రణాళికలతో 19వ స్థానంలో నిలిచి వేగంగా విస్తరిస్తున్న కేంద్రంగా గుర్తింపు పొందింది.చెన్నై ఆగ్నేయాసియా ఇంటర్నెట్ ట్రాఫిక్‌కు కీలక కేంద్రంగా బలపడుతుండగా, బెంగళూరు గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు, పరిశోధన సంస్థల పెట్టుబడులను ఆకర్షిస్తోంది.మరోవైపు పూణె, ఢిల్లీ ఎన్‌సీటీ ప్రాంతంలో కూడా డేటా సెంటర్ల సామర్థ్యం పెరుగుతోంది. రెండో శ్రేణి నగరాల్లో విశాఖపట్నం, జామ్‌నగర్ భారీ గ్రీన్‌ఫీల్డ్ డేటా సెంటర్ ప్రాజెక్టులకు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని నివేదిక పేర్కొంది. ప్రభుత్వ ప్రోత్సాహక విధానాలు, సముద్రగర్భ కేబుల్ కనెక్టివిటీ ప్రణాళికలు ఇందుకు దోహదపడుతున్నాయని వెల్లడించింది.క్లౌడ్ సేవల వినియోగం పెరగడం, కృత్రిమ మేధ వినియోగం విస్తరించడం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా ఎదగడం వల్ల భారత్‌లో డేటా సెంటర్లకు డిమాండ్ మరింత పెరుగుతోందని నైట్ ఫ్రాంక్ ఇండియా అభిప్రాయపడింది. విద్యుత్ సరఫరా, మౌలిక వసతుల విస్తరణ, వేగవంతమైన అనుమతులు ఉంటే రానున్న దశాబ్దంలో భారత్ ప్రపంచంలోనే కీలక డేటా సెంటర్ల కేంద్రంగా ఎదిగే అవకాశముందని పేర్కొంది.

## యూపీఐపై ఛార్జీలకు లోక్‌సభ గ్రీన్ సిగ్నల్..

- మొదటి పేజి తరువాయి
యూపీఐ సహా కొన్ని డిజిటల్ చెల్లింపులపై బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండీఆర్) వసూలు చేయకుండా చట్టపరమైన నిబంధన ఉంది. తాజా సవరణతో ఆ నిబంధన తొలగనుంది. దీంతో భవిష్యత్‌లో బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే అవకాశం ఏర్పడింది.ప్రస్తుతం ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ లావాదేవీలపై సేవా రుసుములు అమల్లో ఉండగా, యూపీఐకి మాత్రం మినహాయింపు ఉంది. కొత్త బిల్లుతో ఆ పరిస్థితి మారనుంది.అయితే ఈ ఛార్జీలు సాధారణ వినియోగదారులపై కాదు. నిర్దిష్ట పరిమితికి మించిన యూపీఐ లావాదేవీలు చేసే పెద్ద వ్యాపారులు, వ్యాపార సంస్థలకే వర్తించే అవకాశం ఉందని సమాచారం. డిజిటల్ చెల్లింపు వ్యవస్థను నిర్వహిస్తున్న బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు, మౌలిక సదుపాయాల సంస్థలకు ఆదాయం సమకూర్చడమే ఈ మార్పుల ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది.ఛార్జీల శాతం, ఏ స్థాయి లావాదేవీలకు వర్తిస్తాయనే అంశాలపై కేంద్ర ప్రభుత్వం, నియంత్రణ సంస్థలు తర్వాత స్పష్టత ఇవ్వనున్నాయి.

## డీప్‌ఫేక్‌లపై కేంద్రం ఉక్కుపాదం.. 3 గంటల్లో తొలగించాల్సిందే

- మొదటి పేజి తరువాయి
కేంద్ర ప్రభుత్వం నిబంధనలను మరింత కఠినతరం చేసింది. అక్రమ కంటెంట్‌పై ఫిర్యాదు అందిన మూడు గంటల్లోనే తొలగించాలని మధ్యవర్తి వేదికలకు (ఇంటర్మీడియరీలు) ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఈ గడువు 36 గంటలు ఉండేది.

లోక్‌సభలో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద ఈ వివరాలు వెల్లడించారు. డీప్‌ఫేక్‌లు, ఏఐతో రూపొందించిన తప్పుడు సమాచారం పెరుగుతున్న నేపథ్యంలో ఐటీ నిబంధనలను బలోపేతం చేసినట్లు చెప్పారు.నగ్న చిత్రాలు, వ్యక్తుల వేషధారణను అనుకరించడం, అశ్లీల కంటెంట్ వంటి సున్నితమైన అంశాలపై వచ్చే ఫిర్యాదులను ఇకపై రెండు గంటల్లోనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. గతంలో ఇందుకు 24 గంటల గడువు ఉండేది.ఏఐతో రూపొందించిన కంటెంట్‌కు స్పష్టమైన గుర్తింపు, సోర్స్ వివరాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియా వేదికలను కేంద్రం ఆదేశించింది. దీంతో వినియోగదారులు అది నిజమైనదా, కృత్రిమంగా రూపొందించిందా అనేది సులభంగా గుర్తించే అవకాశం ఉంటుంది.చట్టాలను ఉల్లంఘించే డీప్‌ఫేక్ కంటెంట్ తయారీ, ప్రచారాన్ని అడ్డుకునేందుకు ఆటోమేటెడ్ సాంకేతిక వ్యవస్థలను వినియోగించాలని కూడా సూచించింది. బాలల లైంగిక దోపిడీ, అనుమతి లేకుండా వ్యక్తిగత చిత్రాల ప్రచారం, వేషధారణ మోసాల వంటి కంటెంట్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.డీప్‌ఫేక్‌లను గుర్తించేందుకు ఐఐటీ జోధ్‌పూర్, ఐఐటీ మద్రాస్, ఐఐటీ ఖరగ్‌పూర్ అభివృద్ధి చేసిన ప్రత్యేక వ్యవస్థలను కూడా కేంద్రం ప్రస్తావించింది. అలాగే ఫిర్యాదుల పరిష్కారం కోసం గ్రీవెన్స్ అధికారుల నియామకం, కేంద్ర స్థాయిలో అప్పీల్ వ్యవస్థ, 'సహయోగ్' పోర్టల్‌ను కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపింది.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసులో కొత్త ట్విస్టులు..



### శిక్షణ సమయంలో ప్రవర్తనపై వాంగ్మూలాలు..

దర్యాప్తులో మరో ముఖ్యమైన అంశంగా శిక్షణ సమయంలో ఉదయ్ ప్రవర్తన నిలిచింది. అతని ఆగ్రహ స్వభావం, సహచరులతో వ్యవహరించిన తీరు కారణంగా కొంతమంది ట్రైనీలు మానసిక ఒత్తిడికి గురైనట్లు వాంగ్మూలాల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ వివరాలను కూడా దర్యాప్తు బృందం నమోదు చేసింది.

### కేసు దర్యాకోణం పైలో వరుస మలుపులు..

మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై వేధింపుల ఆరోపణల కేసులో అరెస్టయిన ఉదయ్ కృష్ణారెడ్డిపై నగర మహిళా భద్రతా విభాగం అధికారులు సమగ్ర దర్యాప్తు కొనసాగిస్తున్నారు. డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ నేతృత్వంలో జరుగుతున్న విచారణలో డిజిటల్ ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, స్వాధీనం చేసుకున్న వస్తువుల పరిశీలనకు ప్రాధాన్యం ఇస్తున్నారు..

### గదిలో సోదాలు.. కీలక వస్తువుల స్వాధీనం..!

దర్యాప్తులో భాగంగా అశోక్‌నగర్‌లోని ఉదయ్ కృష్ణారెడ్డి నివాసంలో పోలీసులు సీన్ రీకన్‌స్ట్రక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, ఒక కత్తి, అలాగే వేర్వేరు చేతిరాతల్లో ఉన్న రెండు ప్రేమలేఖలను స్వాధీనం చేసుకున్నట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఈ వస్తువులను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపినట్లు సమాచారం..

### వివాహితతో పరిచయంపై దర్యాప్తు..

పోలీసుల దర్యాప్తులో మరో కోణం కూడా బయటపడింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ వివాహితతో ఉదయ్‌కు సన్నిహిత పరిచయం ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. 2014లో వివాహమైన ఆ మహిళ 2023 నుంచి భర్తకు దూరంగా ఉంటున్న సమయంలో ఉదయ్‌తో పరిచయం ఏర్పడినట్లు విచారణలో తేలినట్లు తెలుస్తోంది. దర్యాప్తు సమాచారం ప్రకారం, ఉదయ్ సూచనల మేరకు ఆమె తన పాత ఉద్యోగాన్ని వదిలి అశోక్‌నగర్‌లోని ఒక ఐఏఎస్ కోచింగ్ సంస్థలో చేరినట్లు కూడా విచారణలో గుర్తించినట్లు తెలుస్తోంది.

- మొదటి పేజి తరువాయి
కఠినమైన పోటీని అధిగమించి భారత పోలీసు సేవ (ఐపీఎస్)లో స్థానం సంపాదించడం ప్రతి అభ్యర్థి కల. అలాంటి ప్రతిష్ఠాత్మక సేవల్లోకి అడుగుపెట్టిన ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఇప్పుడు వ్యక్తిగత ప్రవర్తనకు సంబంధించిన ఆరోపణలతో తీవ్ర వివాదాల్లో చిక్కుకోవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఒక మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఫిర్యాదుతో ప్రారంభమైన కేసు, ప్రస్తుతం పలు కోణాల్లో దర్యాప్తుకు దారితీస్తూ కొత్త అంశాలను వెలుగులోకి తీసుకొస్తోంది.

### లివ్-ఇన్ ప్రతిపాదన అంశం..!

విచారణలో భాగంగా, ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగిన తర్వాత లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉండాలని ఉదయ్ ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే చట్టబద్ధంగా విడాకులు రాకపోవడంతో ఆ మహిళ అందుకు అంగీకరించలేదని దర్యాప్తు వర్గాలు చెబుతున్నాయి. ఈ అంశంపై కూడా పోలీసులు వాంగ్మూలాలు నమోదు చేస్తున్నట్లు తెలుస్తోంది.

### మహిళా ట్రైనీ ఐపీఎస్ పాత్రతో కేసుకు మలుపు..

ఈ ఏడాది ఫిబ్రవరిలో బాధితురాలైన మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి, సదరు వివాహితను కలిసి తనపై జరిగిన వేధింపులు, దాడులకు సంబంధించిన వివరాలు వెల్లడించినట్లు దర్యాప్తులో తేలినట్లు సమాచారం. అనంతరం ఉదయ్ ప్రవర్తనపై పూర్తి అవగాహనకు వచ్చిన ఆ మహిళ అతనికి దూరంగా ఉన్నట్లు విచారణలో వెల్లడైనట్లు అధికారులు గుర్తించారు.

### 20 మందికి పైగా సాక్షుల విచారణ..

కేసుకు సంబంధించిన పూర్తి చిత్రాన్ని సేకరించేందుకు పోలీసులు ఇప్పటివరకు సుమారు 20 మందికి పైగా వ్యక్తుల నుంచి వాంగ్మూలాలు నమోదు చేసినట్లు సమాచారం. డిజిటల్ పరికరాల విశ్లేషణ, ఫోరెన్సిక్ నివేదికలు, సాక్షుల వాంగ్మూలాలు, ఇతర ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది..

### దర్యాప్తు ముగిసే వరకు ఆరోపణలే..

ప్రస్తుతం వెలుగులోకి వస్తున్న అంశాలు పోలీసుల దర్యాప్తు పరిధిలో ఉన్న వివరాలు మాత్రమే. కేసుపై తుది నిర్ణయం సంబంధిత న్యాయస్థానాల విచారణ, సమర్పించబడే ఆధారాలు, న్యాయ ప్రక్రియ అనంతరమే వెలువడుతుంది. దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో అధికారికంగా నిర్ధారిత విషయాలు మరియు ఆరోపణల మధ్య తేడాను గుర్తించడం అవసరం.

**బలవంతంగా గదిలోకి ప్రవేశించాడనే ఆరోపణ.?**
బాధితురాలి గదిలోకి ఉదయ్ బలవంతంగా ప్రవేశించి, ఆమె సెల్‌ఫోన్‌ను లాక్కున్నాడనే ఆరోపణలపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది. ఈ అంశానికి సంబంధించి సాంకేతిక ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలను పోలీసులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

## ప్రొఫెసర్ జయశంకర్ జయంతి.. ఆయన సేవలను స్మరించుకున్న రాజకీయ నేతలు!

- మొదటి పేజి తరువాయి
ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జయశంకర్ జీవితాంతం నిరంతరం శ్రమించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. తెలంగాణ ప్రజలు ఆయన సేవలను ఎప్పటికీ మరువరని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని పక్కా గణాంకాలతో దేశం ముందు ఉంచి, ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ ఉద్యమాన్ని సజీవంగా నిలిపారని చెప్పారు. ఆయన చూపిన మార్గం, అందించిన స్ఫూర్తి చిరస్మరణీయమని, జయశంకర్ ఆశయాల సాధనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

**ఉద్యమానికి దిశ చూపిన మహనీయుడు..**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా జయశంకర్‌కు ఘన నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనే ఆయన జీవిత లక్ష్యమని పేర్కొన్నారు. ఉద్యమ నాయకుడు కేసీఆర్‌కు జయశంకర్ గురువుతో సమానమని చెప్పారు. తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ఉద్యమానికి బలమైన దిశ చూపిన మహనీయుడని అభివర్ణించారు. ఆయన సేవలకు గుర్తింపుగా గత ప్రభుత్వం భూపాలపల్లి జిల్లాకు, వ్యవసాయ విశ్వవిద్యాలయానికి జయశంకర్ పేరు పెట్టి గౌరవించిందని గుర్తు చేశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి నివాళులర్పించారు.

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కూడా జయశంకర్‌ను స్మరించుకుంటూ, తెలంగాణ కోసం ఆయన తన జీవితాన్ని పూర్తిగా
అంకితం చేశారని కొనియాడారు. మరోవైపు కవిత నాయకత్వంలోని 'తెలంగాణ రక్షణ సేన' ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. జయశంకర్‌కు నివాళులు అర్పించడంతో పాటు రాష్ట్రంలో సామాజిక న్యాయం పక్కాగా అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## తెల్ల రేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఖరారు

- మొదటి పేజి తరువాయి
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పంపిణీని లాంఛనంగా ప్రారంభించనున్నారు.ఈ కార్యక్రమం వివరాలను నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ముఖ్యమంత్రి ఇప్పటికే ఆమోదించారని ఆయన తెలిపారు. ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల మధ్య రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో కార్డుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుంది. జిల్లా యంత్రాంగం, పౌర సరఫరాల శాఖల సమన్వయంతో రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవోలు) ఈ పంపిణీని పర్యవేక్షిస్తారు. లబ్ధిదారుల తుది జాబితాలను సిద్ధం చేసి, పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.నూతనంగా రూపకల్పన చేసిన ఈ రేషన్ కార్డులు లామినేషన్‌తో డెబిట్ కార్డు తరహాలో సౌకర్యవంతంగా ఉంటాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న కార్డుల్లా కాకుండా, వీటిపై కుటుంబ సభ్యుల ఫొటోలు, పేర్లకు బదులుగా ఒక విశిష్ట సంఖ్య, బార్‌కోడ్ మాత్రమే ఉంటాయి. ఈ బార్‌కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా లబ్ధిదారులకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో పొందవచ్చు. నూతనంగా అర్హత పొందిన కుటుంబాలకు సంపూర్ణ ఆహార భద్రత కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.

## పోలవరం-బనకచర్లకు కేంద్రం బ్రేక్.. ఏపీ ప్రతిపాదన వెనక్కి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతిపాదించిన పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతుల ప్రతిపాదనను కేంద్ర పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ వెనక్కి పంపింది. ఈ విషయాన్ని కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ లిఖితపూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశారు.

కేంద్ర పర్యావరణ శాఖలోని ఎన్విరాన్‌మెంట్ అసెస్‌మెంట్ కమిటీ (ఈఏసీ) నివేదికల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. 1980 గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ తీర్పుకు ఈ ప్రాజెక్టు రూపకల్పన, నీటి వినియోగ ప్రతిపాదనలు విరుద్ధంగా ఉన్నాయనే అభ్యంతరాలు వచ్చినట్లు వెల్లడించారు. అలాగే తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రయోజనాలపై ప్రభావం పడే అవకాశం ఉందనే అంశాన్ని కూడా ఈఏసీ పరిగణనలోకి తీసుకుంది.ప్రాజెక్టుకు ముందు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ద్వారా వరద జలాల లభ్యతపై సమగ్ర అధ్యయనం చేయించాలని కేంద్రం సూచించింది. అంతర్రాష్ట్ర
వివాదాలు పరిష్కరించిన తర్వాతే పర్యావరణ అనుమతుల కోసం మళ్లీ దరఖాస్తు చేయాలని స్పష్టం చేసింది.

రూ.81,900 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి నుంచి 200 టీఎంసీల వరద జలాలను రాయలసీమకు తరలించాలని ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల సుమారు 80 లక్షల మందికి తాగునీరు, 3 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే కేంద్రం తొలి దశలోనే ప్రతిపాదనను వెనక్కి పంపడంతో ప్రాజెక్టు ముందడుగు తాత్కాలికంగా నిలిచిపోయింది.

## అన్ని రోడ్ నెట్‌వర్క్‌లను ఒకే వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలి

- మొదటి పేజి తరువాయి
ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లకు ఒకటే వ్యవస్థ ఉండాలి. ఓఆర్ఆర్‌పై ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు గుత్తేదారు నిర్లక్ష్యంగా ఉన్నాడు. ఓఆర్ఆర్ నిర్వహణను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షణ చేయాలి. ప్రభుత్వం సేకరించిన భూములకు మాత్రమే టీడీఆర్ అమలు చేయాలి. ఈ ప్రక్రియను మొత్తం ఆన్‌లైన్ చేయాలి. రేడియల్ రోడ్ల నిర్మాణం వేగవంతం చేయాలి. కొంగరకలాన్ – ఫ్యూచర్‌సిటీ రేడియల్ రోడ్డు డిసెంబర్ 9లోపు పూర్తి చేయాలి. ల్యాండ్ పూలింగ్‌లో మధ్యవర్తుల జోక్యాన్ని సహించవద్దు" అని అన్నారు. సమావేశంలో హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

## బస్‌డిపో కోసం గాజులరామారం దగ్గర 100 ఎకరాలు

- మొదటి పేజి తరువాయి
టెర్మినల్ నిర్మాణం కోసం టీజీఎస్ఆర్టీసీ 99 ఏళ్లకు లీజుకు తీసుకోవడానికి హెచ్ఎంటీకి చెందిన 10 ఎకరాల స్థలాన్ని గుర్తించింది. అయితే అంత సుదీర్ఘకాలం లీజుకు ఇవ్వలేమని, 5 ఏళ్లకోసారి చొప్పున గరిష్ఠంగా 20 ఏళ్లకు మాత్రమే ఇస్తామని హెచ్ఎంటీ అధికారులు స్పష్టం చేశారు. అందుకు ఏటా రూ.6 కోట్ల లైసెన్స్ ఫీజు చెల్లించాలని చెప్పారు. అయితే ఆ ప్రతిపాదనకు టీజీఎస్ఆర్టీసీ అంగీకరించలేదు. ఆ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం గాజులరామారం దగ్గర హెచ్ఎంటీ భూములకు సమీపంలోనే 100 ఎకరాలు కేటాయించింది" అని కేంద్రమంత్రి వివరించారు.

## హైదరాబాద్ వాసులకు చల్లని కబురు.. శనివారం వరకు వర్షాలు

హైదరాబాద్‌వాసులకు భారత వాతావరణ శాఖ ఊరటనిచ్చే వార్త అందించింది. శనివారం వరకు హైదరాబాద్ సహా పరిసర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలుల వీస్తూ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ వర్షాలతో నగరంలో ప్రస్తుతం నెలకొన్న వర్షపాతం లోటు తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.ప్రస్తుత నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు హైదరాబాద్‌లో సాధారణంగా 313.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. కానీ, కేవలం 277.3 మి.మీ. మేర మాత్రమే కురిసింది. దీనివల్ల సుమారు 12 శాతం వర్షపాతం లోటు ఏర్పడింది. రాబోయే వర్షాలతో ఈ లోటు భర్తీ కావడంతో పాటు, రాష్ట్రంలోని జలాశయాల నీటి మట్టాలు కూడా పెరుగుతాయని భావిస్తున్నారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సొసైటీ గణాంకాల ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం దాదాపు సాధారణ స్థితిలోనే ఉంది. రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 402.1 మి.మీ. కాగా, ఇప్పటివరకు 379 మి.మీ. నమోదైంది. ముఖ్యంగా కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 581 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇక్కడ సాధారణ వర్షపాతం 442.6 మి.మీ. మాత్రమే. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోనూ సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిశాయి.రానున్న రోజుల్లో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తన తాజా బులెటిన్‌లో పేర్కొంది. వర్షం కురిసే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీయవచ్చని అధికారులు అంచనా వేశారు.



పెన్ పవర్ దినపత్రికలో ఆగస్టు 4న ప్రత్యేక కథనం..

- 'పెన్ పవర్' ప్రత్యేక కథనానికి వెంటనే స్పందించిన రెండు శాఖల అధికారులు..
- మొన్న మూడు అక్రమ బేస్‌మెంట్‌లు కూల్చివేసిన రెవెన్యూ..
- నిన్న 'టీజీహెచ్‌బీ-రెవెన్యూ' జాయింట్ సర్వేలో 21 ఎకరాలకు హద్దులు 'ఫిక్స్'..!
- త్వరలో హెచ్చరిక బోర్డులు, శాశ్వత ఫెన్సింగ్ పెడతామని వెల్లడి..
- ప్రభుత్వ భూమిలో ప్లాట్లు కొనొద్దని ప్రజలకు అధికారుల హెచ్చరిక..

# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్



పెన్ పవర్ వార్తపై స్పందించిన అధికారులు.. బేస్మంట్‌లు కూల్చివేత..

# బౌరంపేట్-472లో...
# జాయింట్ సర్వే

- టీజీహెచ్‌బీ-దుండిగల్ రెవెన్యూ సంయుక్త సర్వే నిర్వహణ..
- హద్దులు నిర్ధారించి.. బౌండరీ మార్కింగ్ పూర్తి..! 'బోర్డులు, ఫెన్సింగ్' పెండింగ్..!

పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్

మాధవ్ పత్తి..
మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 6:

తెలంగాణ హౌసింగ్ బోర్డ్‌కు కేటాయించిన బౌరంపేట్ సర్వే నెంబర్ 472, చెందిన 21 ఎకరాల ప్రభుత్వ స్థలం కబ్జాకు అధికారులు చెక్ పెట్టారు.. ఏకంగా లేఅవుట్‌లు వేసి, అమాయకులే లక్ష్యంగా ఎంచుకుని, ప్లాట్‌లు విక్రయిస్తున్న కబ్జాదారులకు అధికారులు కళ్ళెం వేశారు.."పెన్ పవర్ దినపత్రిక"లో వచ్చిన ప్రత్యేక కథనాలతో 'టిజిహెచ్‌బి-రెవెన్యూ' యంత్రాంగం అప్రమత్తం అయింది.. మొన్న 3 బేస్‌మెంట్‌లు కూల్చివేసిన అధికారులు, మరో కీలక నిర్ణయం తీసుకున్నారు.. టిజిహెచ్‌బికి చెందిన 21 ఎకరాలకు గురువారం సర్వే నిర్వహించి, హద్దులు నిర్ధారించారు.. నేడు(శుక్రవారం) హెచ్చరిక బోర్డులు, ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని టిజిహెచ్‌బి డీఈఈ వాణి 'పెన్ పవర్' ప్రతినిధితో ప్రస్తావించారు..


జాయింట్ సర్వేలో, తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి, టిజిహెచ్‌బి అధికారులు డీఈ, డీఈఈ..

-4లో


సర్వే నెం.472 జాయింట్ సర్వేలో పాల్గొన్న అధికారులు.. అసైనీలు..

### సర్వే నెం.472 ప్రభుత్వ భూమిని కాపాడినట్టేనా..?

బౌరంపేట్ గ్రామంలోని సర్వే నెం.472లో మొత్తం 31.34 ఎకరాల ప్రభుత్వ భూమి పూర్తిగా రక్షించినట్టేనా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. అందుకు కారణాలు లేకపోలేదు..గాగిల్లాపూర్‌లో కలెక్టర్ డి-నోటిఫికేషన్ చేసిన భూదాన్ భూములనే కబ్జాదారులకు వదిలేసిన ఘనత దుండిగల్ రెవెన్యూ అధికారులకే దక్కింది.. చర్యలు తీసుకున్న మరికొన్ని అక్రమ నిర్మాణాలు మళ్ళీ నిర్మించుకునేందుకు ఉదారత చాటిన రెవెన్యూ అధికారులపై ఈ మాత్రం ఆరోపణలు, అనుమానాలు వ్యక్త పరచడం తప్పేముందని పలువురు వ్యంగ్యారోపణలు చేస్తున్నారు..

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ నంబర్ 1
## పీఎంవో సమీక్షలో వెల్లడి

- 9 కీలక అంశాల ఆధారంగా కేంద్ర హోం శాఖ మూల్యాంకనం
- తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరుకు ప్రత్యేక ప్రశంసలు
- ఫిర్యాదుల కోసం 1930 నంబర్‌కు డయల్ చేయాలని ప్రజలకు సూచన

హైదరాబాద్ పెన్ పవర్:సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) 'ప్రగతి' సమీక్షలో భాగంగా దేశవ్యాప్తంగా నిర్వహించిన మూల్యాంకనంలో ఈ విషయం వెల్లడైంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దేశంలోని అన్ని రాష్ట్రాల సైబర్ సెక్యూరిటీ బ్యూరోల పనితీరును తొమ్మిది కీలక పారామితుల ఆధారంగా విశ్లేషించి ఈ ర్యాంకును ఖరారు చేసింది. స్టేట్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (S4C) ఏర్పాటు, ఇ-జీరో ఎఫ్ఐఆర్ అమలు, గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మాడ్యూల్ (GRM), బాధితులకు తిరిగి నగదు ఇప్పించేందుకు మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ (MRM) వినియోగం, సహ్యోగ్-సమన్వయ పోర్టల్ల వాడకం, సైబర్ క్రైమ్ హాట్‌స్పాట్‌ల పర్యవేక్షణ, సామర్థ్య పెంపుదల వంటి కార్యక్రమాల్లో కనబరిచిన అత్యుత్తమ పనితీరు ఆధారంగా తెలంగాణ ఈ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది.

-4లో

# రేవంత్ రెడ్డి ఒక్కసారి కూడా 'జై తెలంగాణ' అనలేదు

- తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉన్నారన్న హరీశ్
- కేసీఆర్ పోరాటం, జయశంకర్ సార్ ఆరాటం వల్లే తెలంగాణ వచ్చిందని వ్యాఖ్య
- గోదావరి జలాల హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపాటు



హైదరాబాద్ పెన్ పవర్:సిద్ధిపేటలో ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిద్ధిపేట ప్రాంతంతో జయశంకర్ కు ప్రత్యేక అనుబంధం ఉండేదని గుర్తుచేసుకున్న ఆయన... కేసీఆర్ పోరాటం, జయశంకర్ సార్ ఆరాటం వల్లే తెలంగాణ కల సాకారమైందని వ్యాఖ్యానించారు. నాడు ఉద్యమంలో ఏనాడూ పాల్గొనని వ్యక్తి ఈరోజు రాష్ట్రానికి

-4లో

# బౌరంపేట్-472లో.. జాయింట్ సర్వే..



రెవెన్యూ నుండి తహాశీల్దార్, ఆర్ఐ, సర్వేయర్, టిజిహెచ్‌బి డీఈ, డీఈఈ..



సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది..

- 3 పేజి తరువాయి

గండిమైసమ్మ-దుండిగల్ మండలం బౌరంపేట్ సర్వే నెంబర్ 472, ప్రభుత్వ భూముల పరిరక్షణకై 'పెన్ పవర్' దినపత్రిక ప్రచురించిన వరుస ప్రత్యేక కథనాలు మరోసారి అధికారులను కదిలింప చేసింది.. "ప్రభుత్వ భూములకు రక్షణేది..? కబ్జాదారులకు అడ్డేది..?" అన్న కథనం వెలువడిన వెంటనే దుండిగల్ రెవెన్యూ యంత్రాంగం స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు ప్రారంభించింది. ఇప్పటికే ప్రభుత్వ భూమిలో నిర్మించిన, మూడు బేస్‌మెంట్ లను కూల్చివేసిన రెవెన్యూ అధికారులు.. తాజాగా తెలంగాణ హౌసింగ్ బోర్డు (టీజీహెచ్‌బీ) అధికారులు, దుండిగల్ రెవెన్యూ అధికారులు, బౌరంపేట్ సర్వే నెం.472లో జాయింట్ సర్వే నిర్వహించి, ప్రభుత్వ భూమి హద్దులను ఖరారు చేశారు.. ఈ సందర్భంగా ప్రభుత్వ భూమి మొత్తం సరిహద్దులను గుర్తించి బౌండరీ రాళ్లు ఏర్పాటు చేశారు.. భవిష్యత్తులో ఎలాంటి ఆక్రమణలు జరగకుండా 472 భూములకు శాశ్వత రక్షణ కల్పించేందుకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు..



**బౌరంపేట్ 472 ప్రభుత్వ భూమి పరిరక్షణకై, టిజిహెచ్‌బి-రెవెన్యూ అధికారులు తీసుకున్న చర్యలను ఆకుల సతీష్ స్వాగతించారు. ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ, ఫెన్సింగ్ పూర్తయ్యే వరకు, అధికారులు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కోరారు. ప్రభుత్వ ఆస్తులను పూర్తిగా రక్షించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.. మరోవైపు హెచ్చరిక బోర్డుల ఏర్పాటు వ్యవహారంలో, వ్యవసాయం చేస్తున్న కొందరు అసైనీలు ఒకరోజు గడువు కోరినట్లు సమాచారం.. సర్వే నెంబర్ 472 పరిస్థితి ఇంతవరకు వచ్చినా..! తహశీల్దార్‌తో మాట్లాడు కుంటామని, అసైనీలు (వ్యవసాయం చేసేవారు) సమయం కోరడపై పలు అనుమానాలకు తావిస్తోంది..? కబ్జాదారునికి కట్టబెట్టేందుకు, బోర్డులు పెట్టకుండా, పథకం వేస్తున్నారా..? లేక రాజకీయ నాయకులతో సిఫార్సులు చేయించి, అసలు బోర్డులే పెట్టకుండా, పన్నాగం పన్నుతున్నారా, అన్న అనుమానాలను రేకెత్తిస్తుంది.. మరోవైపు తమ 21 ఎకరాలు తాము స్వాధీన పరుచుకోవడం పూర్తయిందని, మిగతా విషయం తమకు సంబంధం లేదని, తమ పరిధిలో, బోర్డులు, ఫెన్సింగ్, వెంటనే ఏర్పాటు చేస్తామని, టిజిహెచ్‌బి డీఈఈ వాణి స్పష్టం చేశారు..**



## హద్దులు నిర్ధారించి గెట్టు రాళ్ళు ఏర్పాటు..

జాయింట్ సర్వేలో అధికారులు ప్రభుత్వ భూమిలో హద్దులను గుర్తించి బౌండరీ మార్కింగ్ పూర్తి చేశారు. త్వరలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, మొత్తం భూమికి శాశ్వత ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ భూమి రక్షణకు ఇది కీలక చర్యగా అధికారులు పేర్కొన్నారు.. మరోవైపు బౌరంపేట్ సర్వే నెం.472లో ఎలాంటి ప్లాట్లనూ ప్రజలు ఎవరూ కొనుగోలు చేయవద్దని దుండిగల్ తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూమిలో జరిగే లావాదేవీలు చట్టబద్ధం కావని, అలాంటి ప్లాట్లు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని స్పష్టం చేశారు..



టిజిహెచ్‌బి నుండి ఫెన్సింగ్ కోసం ప్రీకాస్ట్ సిమెంట్ పలకలు దించుతున్న దృశ్యం..



హద్దులు నిర్ధారించి, హద్దు రాళ్ళు(పోల్స్) నిర్మాణం..

## లేఅవుట్-విక్రయాలపై ప్రశ్నలు..!

బౌరంపేట్ సర్వే నెం.472 ప్రభుత్వ భూమిలో, దాదాపు 21 ఎకరాలు గతంలో దిల్ నిర్మాణ సంస్థకు కేటాయించిందే.. దిల్ సంస్థ ప్రస్తుతం తెలంగాణ హౌసింగ్ బోర్డు (టీజీహెచ్‌బీ) ఆధీనంలోకి మారాయి.. అయితే ఈ భూమిని కొందరు అక్రమార్కులు అసైనీల నుంచి కొనుగోలు చేసినట్లు ప్రచారం జరుగుతుండగా..! సంబంధిత 472 ప్రభుత్వ భూమిలో, కొందరు కబ్జాదారులు లేఅవుట్ చేసి, నోటరీ పత్రాలతో అమాయక ప్రజలకు ప్లాట్లు విక్రయిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపాయి.. ఈ అక్రమాలపై 'పెన్ పవర్' వరుస కథనాలు ప్రచురించగా, సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ స్పందించి దుండిగల్ తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు.. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలని, ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, శాశ్వత ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.. ఫిర్యాదు, కథనాలను పరిశీలించిన తహశీల్దార్ వెంటనే స్పందించి ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న మూడు బేస్‌మెంట్‌లను కూల్చివేయించారు. అనంతరం టీజీహెచ్‌బీ అధికారులతో కలిసి, గురువారం జాయింట్ సర్వే నిర్వహించి హద్దులను ఖరారు చేశారు..

# సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ నంబర్ 1: పీఎంవో సమీక్షలో వెల్లడి

-3 పేజి తరువాయి

దేశంలోనే తొలిసారిగా ౹ా4జ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ పరిధిలోని కేంద్ర వేదికలను అత్యంత సమర్థవంతంగా వినియోగించుకుంటున్నందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (౧+జూదీ) ప్రత్యేక ప్రశంసలు అందుకుంది.

ప్రజలు ఎలాంటి సైబర్ మోసానికి గురైనా వెంటనే 1930 నంబర్‌కు డయల్ చేయాలని లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని టీజీసీఎస్‌బీ సూచించింది. ఫిర్యాదుల పరిష్కారం, నష్టపోయిన

డబ్బును తిరిగి పొందడంలో బాధితులకు సహాయం చేసేందుకు ప్రత్యేకంగా 87126 65600 అనే హెల్ప్‌లైన్ నంబర్‌ను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించింది. పోలీసింగ్‌లో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం, సైబర్ బాధితులకు వేగంగా అండగా నిలవడం వంటి నిరంతర చర్యలే తెలంగాణకు ఈ ఘనతను సాధించిపెట్టాయి.

# రేవంత్ రెడ్డి ఒక్కసారి కూడా 'జై తెలంగాణ' అనలేదు

-3 పేజి తరువాయి

ముఖ్యమంత్రిగా ఉన్నారని... రేవంత్ ఒక్కసారి కూడా 'జై తెలంగాణ' అని అనలేదని విమర్శించారు.గోదావరి నదీ జలాల హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా విఫలమైందని హరీశ్ రావు ఆరోపించారు. కేసీఆర్ హయాంలో 380 టీఎంసీల నీటిని హక్కుగా సాధిస్తే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఒక్క ప్రాజెక్టుకూ అనుమతి తీసుకురాకపోగా సాధించుకున్న అనుమతులను కూడా రద్దు చేసేలా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (+=వీదీ) అజెండా రూపొందుతోందని మండిపడ్డారు. దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా అనుమతులు వచ్చిన ప్రాజెక్టులను పునఃసమీక్షించి రద్దు చేయాలనే అంశం అజెండాలోకి రావడం దుర్మార్గమన్నారు. ఏపీ నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టుతో పాటు సమ్మక్క-సారక్క ప్రాజెక్టు 47 టీఎంసీల క్లియరెన్స్ విషయంలో రేవంత్ ప్రభుత్వం ఏపీ సర్కార్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకుందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి జీఆర్ఎంబీ అజెండాను మార్పించాలని, లేని పక్షంలో ఆ సమావేశాన్ని తక్షణమే బహిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

# దేశ సంపదను అంబానీ, ఆదానీలకు కట్టబెడుతున్న మోడీ

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశ ప్రధాని నరేంద్రమోదీ ప్రజల మధ్య మతవిద్వేషాలు రెచ్చగొడుతూ... దేశసంపదను అంబానీ , అదానీ లకు కట్టబెడుతున్నారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటీ నరసింహ ఆరోపించారు కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకు 9 రోజుల పాటు పాదయాత్ర కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. హైదరాబాద్ బషీర్ బాగ్ చౌరస్తాలోని బాబు జగ్జీవన్ రాం విగ్రహం నుండి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఈటీ నరసింహ మాట్లాడుతూ... కేంద్ర బిజెపి ప్రభుత్వం పరీక్షలను కూడా సమర్థవంతంగా నిర్వహించలేని దుస్థితిలో ఉందని విమర్శించారు. నీట్ పరీక్ష వైఫల్యానికి నిరసనగా విద్యార్థులు ఆందోళన చేపడితే వారిపై కూడా అక్రమ కేసులు పెట్టారని విమర్శించారు. గత 12 ఏళ్లుగా దేశంలో అన్ని వర్గాల ప్రజలను ప్రధాని మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ 9 రోజుల పాదయాత్రలో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ , వారిని చైతన్యం చేస్తామన్నారు. సెప్టెంబర్ 1న ఢిల్లీ లో వేలాది మందితో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఈటీ నరసింహ స్పష్టం చేశారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## రోడ్డు ప్రమాదంలో కాలేజ్ స్టూడెంట్ మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** రుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. లాల్ బజార్ టు డైరీ ఫారం రూట్ లో ఘటన చోటు చేసుకుంది. ఇద్దరు కాలేజ్ స్టూడెంట్స్ బైక్ పై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. మరో టూ వీలర్ ను ఓవర్టేక్ చేసే ప్రయత్నంలో ప్రమాదం జరిగింది. వేగం కారణంలో అపాచీ బైకు అదుపుతప్పి ట్రాన్స్ఫారం స్తంభానికి ఢీకొంది. ఇద్దరిలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందాడు. మరొకరికి తీవ్రగాయాలు కావడంతో హాస్పిటల్ కి తరలించారు. తిరుమలగిరి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు

## జయశంకర్ సార్ వర్ధంతి నివాళులర్పించిన కేటీఆర్

**హైదరాబాద్ పెన్ పవర్:** :తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా తెలంగాణ భవన్లోని అయన విగ్రహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పూల మాల వేసి నివాళు లర్పించారు.

ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్షనేత మధుసూధనాచారి, మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, మహమూద్ అలీ, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, సురభి వాణీదేవి, బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతా, గండ్ర వెంకటరమణ, బానోత్ శంకర్ నాయక్, కోరుకంటి చందర్, మెతుకు ఆనంద్, బిగాల గణేష్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ జడ్పీ చైర్మన్ తుల ఉమా, బీఆర్ఎస్ నాయకులు రాగిడి లక్ష్మా రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు

## అర్ధరాత్రి చంటిపాపతో ఆస్పత్రికి వచ్చిన తల్లికి జగ్గారెడ్డి అండ

**హైదరాబాద్ పెన్ పవర్:** నాలుగు నెలల చంటి బిడ్డకు ఫిట్స్ వచ్చి చలనం లేకపోవడంతో రాత్రి ఒంటి గంటకు ఆటోలో సంగారెడ్డి ఆస్పత్రికి ప్రవళిక అనే మహిళ వచ్చింది. అదే సమయంలో ఆస్పత్రికి ఆకస్మిక తనిఖీకి జగ్గారెడ్డి వచ్చారు. ఆస్పత్రి ప్రాంగణంలోని మహిళల వార్డు వద్ద చంటిపాపను ఎత్తుకొని నిల్చొని ఉన్న ప్రవళికను పలకరించారు. ఫిట్స్ వచ్చిన పాపలో చలనం లేకపోవడంతో ఒక్కదాన్నే ఆస్పత్రికి వచ్చానని ప్రవళిక చెప్పింది. దాంతో జగ్గారెడ్డి తన కారులో తల్లీబిడ్డను ఎక్కించుకొని ఎంసీహెచ్ వద్దకు తీసుకెళ్లి, .వైద్యులతో మాట్లాడి వెంటనే చికిత్స ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు.

## కోహెడ మార్కెట్ యార్డ్ లో మంత్రి పొన్నం పర్యటన

**హైదరాబాద్ పెన్ పవర్:**

కోహెడ మార్కెట్ కమిటీ లో 1,61 కోట్ల రూపాయలతో ఓపెన్ షెడ్ , ఫ్లాట్ ఫారం , మీటింగ్ హాల్ నిర్మాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేసారు. తరువాత మార్కెట్ యార్డు ఆవరణలో వన మహోత్సవం లో భాగంగా మొక్కలు నాటారు.।

ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ , మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మల జయరాజ్ ,వైస్ చైర్మన్ భీంరెడ్డి తిరుపతి రెడ్డి , సర్పంచ్ లు , ఉప సర్పంచ్ లు , ఇతర ముఖ్య నేతలు ,అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యమ స్ఫూర్తిని జనంలో రగిలించిన గొప్ప మేధావి జయశంకర్ సార్

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా జీవితం మొత్తం అంకితభావంతో పని చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొనియాడారు. జయశంకర్ సార్ జయంతి నేపధ్యంలో అయనకు నివాళు లర్పించారు.

కవిత మాట్లాడుతూ తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను నిరంతరం ప్రశ్నిస్తూ, తెలంగాణ రాష్ట్ర అవసరాన్ని నొక్కి చెప్పేవారు. తెలంగాణ ప్రజలు ఆత్మగౌరవంతో తమను తాము పాలించుకోవాలని పరితపించేవారు. ఆ క్రమంలోనే ఎల్లప్పుడూ ఉద్యమ స్ఫూర్తిని జనంలో రగిలించిన గొప్ప మేధావి ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళులని అన్నారు.

సాధించిన తెలంగాణలో అన్ని వర్గాలకు సమాన అవకాశాలు దక్కాలని, సామాజిక తెలంగాణ కావాలన్న వారి ఆశయాన్ని స్ఫూర్తిగా తీసుకొని, సామాజిక తెలంగాణ సాధనకై తెలంగాణ రక్షణ సేన నిరంతరం పోరాడుతుందని అన్నారు.

## గోల్కొండ కోటలో ఘనంగా ఏడవ వారం అమ్మవారి పూజలు

**హైదరాబాద్ పెన్ పవర్:** గోల్కొండ కోటలో ఏడవ వారం అమ్మవారి పూజలు గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ తమ మొక్కులు తీర్చుకున్నారు. ఏడవ వారం కావడంతో గత వారాలతో పోలిస్తే భక్తుల రద్దీ కొంత తగ్గినప్పటికీ, ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించగా, భక్తులు అమ్మవారి దర్శనం కోసం ప్రశాంతంగా బారులు తీరారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు, పోలీసులు అవసరమైన ఏర్పాట్లు చేసి భక్తులకు సౌకర్యాలు కల్పించారు. ఏడవ వారం పూజలు విజయవంతంగా ముగియడంతో గోల్కొండ కోటలో భక్తిపారవశ్యం వెల్లివిరిసింది.

# కేబినెట్ విస్తరణప కర్ణాటక ఎఫెక్ట్

**హైదరాబాద్, ఆగస్టు 6 పెన్ పవర్:**

పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు, ఆ తదుపరి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ కాంగ్రెస్ హైకమాండ్‌కు మాత్రమే కాకుండా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ఒక కీలకమైన పాఠాన్ని నేర్పుతోంది. ముఖ్యమంత్రిగా డి.కె. శివకుమార్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం చేపట్టిన కేబినెట్ విస్తరణలో కొత్తవారికి, యంగ్ లీడర్లకు అవకాశం కల్పిస్తూ 19 మందిని మంత్రివర్గంలోకి తీసుకున్నప్పటికీ, బెర్తులు దక్కని సీనియర్ ఎమ్మెల్యేలు రాజీనామా బాట పట్టడం కర్ణాటక కాంగ్రెస్‌లో తీవ్ర అలజడి సృష్టించింది. సీనియర్లు, మాజీ మంత్రులు బహిరంగంగా అసంతృప్తి వెళ్లగక్కడమే కాక, ఎమ్మెల్యే పదవులకూ వీడ్కోలు పలికే వరకు పరిస్థితి దాటిపోవడంతో.. వారిని చల్లార్చేందుకు నామినేటెడ్ పోస్టులు, కార్పొరేషన్ ఛైర్మన్ గిరీలతో సర్దుబాటు చేసేందుకు అధిష్ఠానం తీవ్ర కసరత్తు చేయాల్సి వస్తుంది. కర్ణాటక పరిణామాలను అత్యంత సమీపంగా పరిశీలించిన తర్వాత, తెలంగాణలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణ , రేవంత్ రెడ్డి +వఅ ౣ ఆశయాలకు అనుగుణంగా చేయాలనుకుంటున్న మార్పులపై అధిష్ఠానం ఆలోచనా విధానం పూర్తిగా మారింది. తెలంగాణలో ప్రస్తుతం కేబినెట్‌లో ఖాళీగా ఉన్న బెర్త్‌ల భర్తీతో పాటు, కొందరు మంత్రుల శాఖల మార్పు లేదా కుదింపుపై ప్రచారం జరుగుతున్న తరుణంలో.. కర్ణాటక తరహా అసమ్మతి సెగలు హైదరాబాద్‌లో రగులుకోకుండా ఉండేందుకు ముందుజాగ్రత్త చర్యలు అవసరమని రేవంత్ రెడ్డి గ్రహించారని అనుకోవచ్చు. తెలంగాణ కాంగ్రెస్‌లోనూ సీనియర్లు, సీనియర్ రీజినల్ లీడర్లు కేబినెట్ బెర్త్‌ల కోసం తీవ్రస్థాయిలో పోటీపడుతున్నారు. రెడ్డి, బిసి, ఎస్సీ, ఎస్టీ , మైనారిటీ సామాజిక వర్గాల నుంచి అనేకమంది ఆశావహులు ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ ముమ్మరం చేశారు. రేవంత్ రెడ్డి తన నిర్ణయాల్లో యువ ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నప్పటికీ, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న సీనియర్లను పూర్తిగా పక్కనబెడితే కర్ణాటకలో మాదిరిగానే ఎమ్మెల్యేల తిరుగుబాటు లేదా సహాయ నిరాకరణ పెరిగే ప్రమాదం ఉందన్న అభిప్రాయం వినిపిస?తంది. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి అండ్ టీమ్ సామాజిక సమతుల్యత ం కాంపెన్సేషన్ ప్యాకేజీ వ్యూహాన్ని తెరపైకి తెస్తున్నారు. కేవలం కేబినెట్ బెర్తులు ఇవ్వడమే కాకుండా, పదవులు రాని ముఖ్య నేతలకు ముందే స్పష్టత ఇచ్చి, వారికి పవర్ ఫుల్ నామినేటెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు, జిల్లా ఇన్‌ఛార్జ్ బాధ్యతలు, లేదా ప్రభుత్వ సలహాదారు పాత్రలను ఆఫర్ చేయడం ద్వారా ముందస్తుగానే అసంతృప్తికి చెక్ పెట్టాలని భావిస్తున్నారు. సర్దుబాటు ప్రక్రియ కేబినెట్ విస్తరణకు ముందే పూర్తయితే, ప్రమాణ స్వీకారం రోజున డ్రామాలు జరగకుండా నివారించవచ్చనేది కాంగ్రెస్ ప్లాన్. ం

అంతేకాకుండా, సామాజిక సమీకరణల పరంగా ఉమ్మడి జిల్లాల ప్రాతినిధ్యాన్ని దెబ్బతీయకుండా జాగ్రత్త పడుతున్నారు. ఉదాహరణకు ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల మధ్య కాంబినేషన్ దెబ్బతింటే అది ప్రభుత్వ స్థిరత్వంపై ప్రభావం చూపుతుంది.కర్ణాటకలో డి.కె. శివకుమార్ ఓపిక పడితే అవకాశాలు వస్తాయి అని సర్దిచెప్పాల్సి వచ్చిన పరిస్థితిని తెలంగాణలో రాకుండా చూడాలంటే.. విస్తరణ రోజునే ఎవరికి ఏ పదవి లభిస్తుందో స్పష్టమైన రోడ్‌మ్యాప్ ప్రకటించడం ఒక్కటే సరైన మార్గమని ఏఐసీసీ భావిస్తోంది. కర్ణాటక కేబినెట్ విస్తరణ గందరగోళం తెలంగాణ కాంగ్రెస్ పాలనకు ఒక ముందస్తు హెచ్చరిక లా పనిచేసింది. కేవలం కొత్తవారికి అవకాశాలు ఇవ్వడం మాత్రమే కాకుండా, పార్టీ పాతకాపులను గౌరవిస్తూ, రాజీనామాల వేడి తగ్గించే సమగ్ర ప్యాకేజీతోనే రేవంత్ రెడ్డి తన కేబినెట్ విస్తరణను పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.

# ఎయిర్ పోర్ట్ ఎఫెక్ట్... ఆ 30 గ్రామాలకు కనెక్టివిటీ కట్

**అదిలాబాద్, ఆగస్టు 6 పెన్ పవర్:** ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం భూసేకరణలో అనుకుంట ప్రధాన రహదారి కూడా చేరనుండటంతో 30 గ్రామాలకు కనెక్టివిటీ లేకుండా పోతుంది. దీంతో ప్రత్యామ్నాయంగా కచికంటి మీదుగా కొత్త బైపాస్ నిర్మించనున్నారు. 66 అడుగుల వెడల్పుతో రూపొందనున్న ఈ రహదారి కోసం ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది. బంగారుగూడ, కచికంటి మీదుగా జిల్లా కేంద్రానికి సులభంగా చేరుకునేలా ఈ మార్గాన్ని అభివృద్ధి చేయనున్నారు. విమానాశ్రయ నిర్మాణం కారణంగా రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపడుతున్నారు.ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత విమానాశ్రయ నిర్మాణంతో జిల్లాలో రహదారి వ్యవస్థలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. విమానాశ్రయం కోసం చేపట్టనున్న భూసేకరణలో ప్రస్తుతం వేలాది మంది వినియోగిస్తున్న అనుకుంట ప్రధాన రహదారి కూడా చేరనుండటంతో అధికారులు ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటుపై దృష్టి సారించారు. దాదాపు 30 గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా కొత్త బైపాస్ రహదారిని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ఆదిలాబాద్ పట్టణం నుంచి ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని కచికంటి గ్రామానికి వెళ్లేందుకు శ్రీరాంకాలనీ, కుమ్మరివాడ, విమానాశ్రయ స్థలానికి ఆనుకుని ఉన్న ప్రాంతం, ఇందిరమ్మ కాలనీ మీదుగా ప్రయాణిస్తున్నారు. విమానాశ్రయ నిర్మాణంతో ఈ మార్గం మూసివేయబడే అవకాశం ఉండటంతో కచికంటి నుంచి బంగారుగూడ ప్రధాన రహదారిని అనుసంధానించే కొత్త రహదారిని నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం కచికంటి గ్రామ సమీపంలో కొత్త బైపాస్ నిర్మించి, అక్కడ అవసరమైన భూసేకరణ చేపట్టనున్నారుకొత్త రహదారిని 66 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ మార్గం ద్వారా బంగారుగూడ, కచికంటి మీదుగా ఆదిలాబాద్ పట్టణానికి సులభంగా చేరుకునే అవకాశం కలుగుతుంది. దీంతో విమానాశ్రయ నిర్మాణం వల్ల కలిగే రవాణా ఇబ్బందులు తగ్గడంతో పాటు భవిష్యత్ ట్రాఫిక్ అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని ఈ రహదారిని రూపొందిస్తున్నారు. ఆదిలాబాద్ మండలంలోని యాపల్‌గూడ, రాముల్‌గూడ, కొత్తగూడ, యశ్వంత్‌గూడ, మత్తడిగూడ, బూర్నూర్, అడ్డగుట్ట, శివఘాట్, కుంభఝురి, టాక్లీ గ్రామాలతో పాటు సాత్నాల మండలంలోని రామాయి, జాముల్‌ధరి, న్యూరాంపూర్, సాత్నాల, సుందరగిరి, మాంగూర్ల, కాన్పమేడిగూడ, మేడిగూడ, జామ్ని, మారుగూడ, తోయగూడ, సైద్‌పూర్, సహేజ్, సాంగ్వి, జామ్డ గ్రామాల ప్రజలు నిత్యం ఈ దారినే వినియోగిస్తున్నారు. అదేవిధంగా గాదిగూడ మండలంలోని పరస్వాడ, లోకారి, గాదిగూడ గ్రామాల ప్రజలు కూడా జిల్లా కేంద్రానికి చేరుకోవడానికి ఈ మార్గంపైనే ఆధారపడుతున్నారు.ఇవే కాకుండా ఆదిలాబాద్ అర్బన్ పరిధిలోని బంగారుగూడ, అనుకుంట గ్రామాల ప్రజలకు కూడా ఇదే ప్రధాన రహదారి. నార్నూర్, గాదిగూడ మండలాల్లోని మరికొన్ని గ్రామాల వాసులు కూడా ఆదిలాబాద్‌కు రావడానికి ఈ దారినే ఎక్కువగా ఉపయోగిస్తుండటంతో రోజూ ఆటోలు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు, ద్విచక్ర వాహనాలతో ఈ మార్గం రద్దీగా ఉంటుంది. విమానాశ్రయ నిర్మాణంలో భాగంగా అనుకుంట ప్రాంతం చుట్టూ ఉన్న వ్యవసాయ భూములను ప్రభుత్వం సేకరించనుంది. దీంతో ఖానాపూర్ సమీపంలోని అనుకుంట మలుపు నుంచి అనుకుంట గ్రామం వరకు ఉన్న ప్రస్తుత రహదారి విమానాశ్రయ పరిధిలోకి వెళ్లనుంది. ఈ నేపథ్యంలో ప్రజలకు ప్రత్యామ్నాయ రాకపోకలు కల్పించేందుకు కొత్త రహదారి నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుంది.

# జీతాల కోతపై ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం ముందు నిరసనకు దిగిన కార్మికులు

**జీవోను వెంటనే రద్దు చేసి మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్**

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 6: పెన్ పవర్:**

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల జీతాలను తగ్గించే విధంగా తీసుకొచ్చిన జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కార్మికులు గురువారం విధులకు హాజరు కాకుండా మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ, కొత్తగా అమల్లోకి తీసుకొచ్చిన జీవో కారణంగా ఈ నెల తమ జీతాల్లో సుమారు రూ.4 వేల వరకు కోత విధించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించడం కష్టంగా మారిందని, ఇప్పుడు జీతాల్లో కోత విధించడం తమపై మరింత ఆర్థిక భారం మోపినట్లైందన్నారు.

ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ, వాన తేడా లేకుండా ప్రజలకు పారిశుద్ధ్య సేవలు అందిస్తున్నప్పటికీ తమ శ్రమకు తగిన గౌరవం, భద్రత లభించడం లేదని కార్మికులు వాపోయారు. తమను కాంట్రాక్ట్ కార్మికులుగా కాకుండా

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతి నెలా సమయానికి పూర్తి జీతం, ఈపీఎఫ్, ఈఎస్ఐ, వైద్య సదుపాయాలు, ఇతర ప్రభుత్వ సంక్షేమ ప్రయోజనాలు అందించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీతాల కోతకు సంబంధించిన జీవోను వెనక్కి తీసుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తమ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని మున్సిపల్ కార్మికులు కోరారు.

# గార్లపై ఆర్టీసీ నిర్లక్ష్యం


ఆర్టీసీ బస్సు

- ఏళ్లు గడుస్తున్నా ఒక్క బస్సు కేటాయించని వైనం
- ఖమ్మం డిపో బస్సులే దిక్కు
- వినతులు ఇచ్చినా హామీలకే పరిమితం
- బస్సుల కోసం ప్రజల నిరీక్షణ

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 6:** జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఖమ్మం జిల్లా నుంచి మహబూబాబాద్ జిల్లాలో చేరిన గార్ల మండలానికి ఆర్టీసీ బస్సుల విషయంలో మాత్రం నిర్లక్ష్యం వీడటం లేదు కొత్త జిల్లా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా మహబూబాబాద్ ఆర్టీసీ డిపో నుంచి గార్ల మండలానికి ఒక్క సాధారణ బస్సు కూడా కేటాయించకపోవడంపై మండల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**ఖమ్మం బస్సులే ఆధారం..**

ప్రస్తుతం గార్ల మీదుగా ఖమ్మం--మహబూబాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు ఖమ్మం డిపోకు చెందిన బస్సులే ఏళ్లుగా రాకపోకలు సాగిస్తున్నాయి. గార్ల ప్రాంతం నుంచి ఆర్టీసీకి గణనీయమైన టిక్కెట్టు ఆదాయం లభిస్తున్నప్పటికీ, మహబూబాబాద్ డిపో నుంచి బస్సులు నడపకపోవడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. జిల్లా పరిధిలో ఉన్న మండలానికి అదే జిల్లా డిపో నుంచి కనీస రవాణా సౌకర్యాలు కల్పించకపోవడం పట్ల సర్వత్రా ఆవేదన వ్యక్తమవుతోంది.

**హామీలకు కొదవలేదు అమలుకు దిక్కులేదు**

గతంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పలుమార్లు మహబూబాబాద్ డిపో అధికారులను కలిసి గార్ల మండలానికి బస్సులు కేటాయించాలని వినతిపత్రాలు అందజేశారు. అయితే ప్రతిసారీ 'త్వరలో బస్సులు ఏర్పాటు చేస్తాం' అనే హామీలు ఇవ్వడం తప్ప ఆచరణలో మాత్రం చర్యలు కనిపించడం లేదని మండలవాసులు అంటున్నారు.


ఈశ్వర్ లింగం

**అడ్డంకులు తొలగినా.. బస్సులు రావా?**

గతంలో గుంతలతో ఉన్న రహదారుల కారణంగా బస్సుల రాకపోకలకు కొంత ఇబ్బంది ఉండేది. ప్రస్తుతం ఆ సమస్యలు తొలగిపోవడంతో పాటు రహదారి సౌకర్యాలు కూడా మెరుగుపడ్డాయి. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ డిపో నుంచి గార్లకు సాధారణ, సర్వీసులతో పాటు ప్రయాణికుల అవసరాలను బట్టి మహబూబాబాద్ నుంచి గార్ల మీదుగా ఖమ్మం కు నేరుగా ఎక్స్ ప్రెస్ బస్సు సర్వీసులను ఏర్పాటు చేసేందుకు అవకాశముందని స్థానికులు పేర్కొంటున్నారు.

**ఏజెన్సీ ప్రల కష్టాలు పట్టవా?**

షెడ్యూల్డ్ ఏరియా (ఏజెన్సీ) పరిధిలో ఉన్న గార్ల మండలంలోని అనేక గ్రామాల ప్రజలు విద్య, వైద్యం, ఉద్యోగ, వ్యాపార అవసరాల కోసం నిత్యం వివిధ ప్రాంతాలకు ప్రయాణించాల్సి వస్తోంది. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, సామాన్య ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మహబూబాబాద్ డిపో నుంచి తగిన సంఖ్యలో బస్సులను కేటాయించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

**ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి: సోషల్ వర్కర్ శ్వర్ లింగం**

గార్ల మండలం మహబూబాబాద్ జిల్లాలో భాగమైనప్పుడు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో సేవలు మండల ప్రజలకు ఎందుకు అందడం లేదని సోషల్ వర్కర్ ఈశ్వర్ లింగం ఆరోపించారు. మండల ప్రజల తరఫున పలుమార్లు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఆశించిన స్పందన రావడంలేదని బస్టాండ్ వినియోగంలో లేకపోవడంతో రోజురోజుకు గార్ల బస్టాండ్ శిథిలావస్థకు చేరుతుందని కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. గార్ల మండలానికి అవసరమైన ఆర్టీసీ సర్వీసులను తీసుకురావడంలో స్థానిక ఎమ్మెల్యే, ఎంపీతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉందని ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే మహబూబాబాద్ డిపో నుండి బస్సు సర్వీసులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు లేని పక్షంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు.


నిరుపయోగంగా శిథిలావస్థకు చేరిన గార్ల బస్టాండ్

# గోపాలపురం-డాక్య తండా

**బీటీ రోడ్డును వెంటనే పూర్తి చేయాలి**

**4 ఏళ్లుగా అసంపూర్తిగా నిలిచిన పనులు**

**ప్రభుత్వం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణం: సీపీఐ**


బీటీ రోడ్డును పరిశీలిస్తున్న సిపిఐ నాయకులు శ్రీనివాస్

**గార్ల, పెన్ పవర్ ఆగస్టు 6:** గార్ల మండల పరిధిలోని గోపాలపురం క్రాస్ రోడ్ నుంచి డాక్య తండా వరకు నిర్మాణంలో నిలిచిపోయిన బీటీ రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ నాయకులతో కలిసి అసంపూర్తిగా ఉన్న రహదారిని పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరై నాలుగేళ్లు గడిచినా ఇప్పటికీ పనులు పూర్తి కాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. సంబంధిత అధికారులు పర్యవేక్షణలో విఫలమవడం, కాంట్రాక్టర్ తీవ్ర అలసత్వం ప్రదర్శించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.రోడ్డుపై కేవలం కంకర వేసి పనులను నిలిపివేయడంతో నిత్యం ద్విచక్ర వాహనదారులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారని, పలువురు తీవ్ర గాయాల పాలవుతున్నారని తెలిపారు. గ్రామస్థులు, విద్యార్థులు, రైతులు, అత్యవసర సేవలు వినియోగించుకునే ప్రజలతో పాటు మూగజీవాలు కూడా ఈ రహదారిపై ప్రయాణించలేని పరిస్థితి నెలకొన్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించి యుద్ధప్రాతిపదికన బీటీ రహదారి నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి సీపీఐ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, మేదరమెట్ల గిరిప్రసాద్, భూక్య హరినాయక్, గుగులోత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు

# ప్రొఫెసర్ జయశంకర్ ను ఆదర్శంగా తీసుకోవాలి


ప్రొఫెసర్ జయశంకర్ కు నివాళులర్పిస్తున్న బి.ఆర్.ఎస్ నాయకులు

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు6:** తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని తొలి ఉద్యమకారుడు బిఆర్ఎస్ పార్టీ నాయకులు అనంత రాములు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి పురస్కరించుకొని గురువారం గార్ల మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ సమీపంలోని జయశంకర్ విగ్రహం వద్ద బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి అన్యాయం జరుగుతుందని నినదిస్తూ తెలంగాణ ప్రజలకు ఉద్యమ స్ఫూర్తిని కలిగించి ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చేందుకు తుది శ్వాస వరకు పోరాడి తన జీవితాన్ని రాష్ట్ర ఏర్పాటుకు అంకితం చేసిన మహా యోధుడు తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ అని ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఎర్రబోయిన బిక్షమయ్య ఎండి ఖదీర్ బాబా వెంకట్ బండారి దేవేందర్ ముంగి రాములు వేణు సంగిశెట్టి ప్రభాకర్ చంద్రశేఖర్ పానుగంటి రాధాకృష్ణ ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు. ర్వతి నాయక్

# ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు భావితరాలకు ఆదర్శం



జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ రాజు

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 6:** తెలంగాణ రాష్ట్ర సాధనకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలు భావితరాలకు ఆదర్శప్రాయమని ప్రిన్సిపల్ డాక్టర్ డి రాజు అన్నారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత విద్యార్థులతో కలిసి ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూల మాలలు ఘనంగా నివాళులు అర్పించారు అనంతరం ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజు మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. విద్య, సమాజ అభివృద్ధి, తెలంగాణ ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామంలో లక్ష్మీ కాంతారావు మహాలక్ష్మి దంపతులకు 1934 ఆగస్టు 6న జన్మించి ఉపాధ్యాయుడిగా లెక్చలర్ గా యూనివర్సిటీ రిజిస్టార్ గా వైస్ చాన్స్ లర్ గా తెలంగాణ సిద్ధాంతకర్తగా తన సేవలను అందించారని కొనియాడారు. విద్యార్థులు ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నాగూర్, రామ్మోహన్ రావు, డాక్టర్ చార్లీ ,పున్నం చందర్ ,రాజేష్ ,డాక్టర్ సుందరయ్య, వీరన్న ,స్వరూప రాణి ,మేఘన ,లావణ్య వెంకటేశం, అనురాధ, సహన ,అధ్యాపకేతర సిబ్బంది వీరలక్ష్మి ,నాగేందర్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా ఆకాంక్షలే పరమావధిగా పాలన : మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**కూసుమంచి మండలంలో రూ.6.74 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**


శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ఖమ్మం, పెన్ పవర్, ఆగస్టు 6:** ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.తో కలిసి కూసుమంచి మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల పురోగతే లక్ష్యంగా రూ.6.74 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి శంకుస్థాపనలు చేశారు. రాజుపేట బజార్ గ్రామం వద్ద ఈశ్వరమాదారం నుంచి భద్రుతండా వరకు రూ. 1.76 కోట్లతో, తాళ్లగడ్డ తండా వరకు రూ.50 లక్షలతో బీటీ రోడ్ల నిర్మాణానికి మంత్రి గారు శ్రీకారం చుట్టారు. అనంతరం చౌటుపల్లి గ్రామంలో రూ. 3.20 కోట్లతో నిర్మించనున్న హైలెవెల్ వంతెనకు, లింగారం తండాలో రూ.1.28 కోట్లతో చేపట్టనున్న ఆర్అండ్‌బీ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గతంలో తాను ఎంపీగా ఉన్న సమయంలో చౌటుపల్లి గ్రామాన్ని దత్తత తీసుకుని అనేక అభివృద్ధి పనులు చేశానని, ఇప్పుడు మంత్రిగా గ్రామంలోని మిగిలిన అన్ని పనులనూ పూర్తి చేసే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లింగారం తండాలోనే రూ.5.45 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని, తండాలో వీధిదీపాల ఏర్పాటును తక్షణమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా తెలంగాణలోని ప్రతీ రేషన్ కార్డుదారునికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. గృహ నిర్మాణ రంగానికి ప్రాధాన్యమిస్తూ తొలి విడతలో 4.5 లక్షలు, మలి విడతలో 2.5 లక్షలు, హైదరాబాద్‌కు మరో లక్ష కలిపి మొత్తం 8 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని వెల్లడించారు. కొద్ది రోజుల్లోనే రెండో విడత ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా ప్రారంభిస్తామన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతు భరోసా నిధులను ఇప్పటికే జమ చేశామని, వరి కొనుగోళ్లలో సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తున్నామని పేర్కొన్నారు. పాలేరు నియోజకవర్గ పరిధిలో భూ రీ-సర్వే ప్రక్రియ వేగంగా జరుగుతోందని, త్వరలోనే నకిలీ పాస్‌పుస్తకాలను రద్దు చేసి, అర్హులైన ప్రతీ నిజమైన రైతుకూ న్యాయబద్ధమైన పట్టాదారు పాస్‌పుస్తకాలు అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం ముందడుగు వేస్తుందని అన్నారు. అభివృద్ధి పనుల పరిశీలన అనంతరం లింగారం తండాలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వయంగా పొలంలోకి దిగి ఎద్దుల అరక పట్టి దుక్కి దున్నారు. స్థానిక రైతులతో కలిసి ముచ్చటించి, వ్యవసాయ పరిస్థితులు, పంటల పురోగతిపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్‌రెడ్డి , డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి ఆర్అండ్‌బీ అధికారులు, ఆర్డీవో శ్రీనివాస్ తహసీల్దార్ సైదులు ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ర్ రాజు

# ఘనంగా ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు


ప్రొఫెసర్ జయశంకర్ సార్ కు నివాళులర్పిస్తున్న సర్పంచ్ పార్వతి నాయక్

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు6:** తెలంగాణ సిద్ధాంతకర్తగా, ఉద్యమ స్ఫూర్తి ప్రధాతగా తెలంగాణ ప్రజల గుండెల్లో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ శాశ్వతంగా నిలిచిపోయారని గార్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పార్వతీ నాయక్ పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని గురువారం గార్ల మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ సమీపంలోని జయశంకర్ విగ్రహం వద్ద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తాల్లపెల్లి కృష్ణ గౌడ్ సర్పంచ్ పార్వతీ నాయక్ లు జయశంకర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమకారుడి నుండి మహోపాధ్యాయుడి దాకా ఆయన తెలంగాణకు దిక్సూచిగా నిలిచారని తెలంగాణ భావజాల వ్యాప్తికి జీవితాంతం కృషి చేసిన ప్రొఫెసర్ జయశంకర్ సేవలను తెలంగాణ ప్రజలు, భవిష్యత్ తరాలు గుర్తుంచుకునే విధంగా వారి సంకల్ప బలం రాష్ట్ర సాధనకు చేసిన నిర్విరామ కృషి అంచ లంచలుగా ఆశయ ఆలోచనలకు పదును పెడుతూ, రాష్ట్ర సాధనకు ఆయువుపట్టు అయ్యి అందరి హృదయాలలో నిలిచారని ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు హతీరాం వార్డు సభ్యులు తోడేటి శ్రీనివాస్ ఇమ్రాన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ కే యాకుబ్ బాషా కోలకుమార్ రాజశేఖర్ దీకోండ రాము గులగట్టు బాబు సాగర్ అజ్మీర శంకర్ ఎర్రబోయిన వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్‌కు ప్రజా యుద్ధనౌక గద్దర్లకు నివాళులు..

- మానుకోట జిల్లా జేఏసీ ఉద్యమ కళాకారులు..
- మానుకోట జేఏసీ జిల్లా కన్వీనర్ కంబాలపల్లి సత్యనారాయణ..
- సెప్టెంబర్ 4న దాదాపు 2,000 మందితో మహా కళాకారుల సమ్మేళనం..



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళులు..

**మహబూబాబాద్, పెన్ పవర్, ఆగష్టు 6:**మానుకోట జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాల ఆవరణలో జిల్లా కళాకారుల జేఏసీ ఆధ్వర్యాన తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘనంగా నివాళులర్పించారు.. ముఖ్య అతిథిగా తెలంగాణ జేఏసీ జిల్లా చైర్మన్ డాక్టర్ డోలి సత్యనారాయణ పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్, ప్రజా యుద్ధనౌక గద్దర్ చిత్రపటాలకు పూలమాలలు సమర్పించారు. జిల్లా కళాకారుల జేఏసీ కన్వీనర్ కంబాలపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, జయశంకర్ ఆలోచనలు, గద్దర్ ఉద్యమ స్ఫూర్తిని కళాకారులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.. సెప్టెంబర్ 4న మానుకోటలో దాదాపు 2,000 మంది కళాకారులతో సకల కళల మహా సమ్మేళన ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించారు.. జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాకారులందరూ ఈ ర్యాలీలో పాల్గొనాలని కోరారు.. అదేవిధంగా ఉద్యమ కళాకారులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలని, మానుకోట ముద్దుబిడ్డ, సంగీత దర్శకుడు దివంగత చక్రి విగ్రహ ప్రతిష్ఠ కోసం కళాకారులందరూ ఏకమై కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.. ఈ కార్యక్రమంలో సీనియర్ కళాకారులు బుల్లెట్ వెంకన్న. కళాకారుల జేఏసీ కో కన్వీనర్ ఐలేష్. కోమిరే వెంకన్న జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు అక్కెర నాగేంద్ర చారి. మేరుగు రవీందర్ గౌడ్, గూడూరు ఉద్యమ గాయకులు పెరుమాండ్ల శ్రీనివాస్, నెల్లికుదురు కడారి ఉప్పలయ్య, ఇనుగుర్తి నాగెల్లి మురళి, కురవి బొల్లంపల్లి శ్రీనివాస్, కొత్తగూడ వాసం వెంకన్న, మేరుగు కనుకుల ఏకాంతం, దర్శనం యుగేందర్, బట్టు సురేందర్, జన్ను సారయ్య, మేరుగు మహేష్ బుర్ర శ్రీనివాస్. జమాండ్ల రాజశేఖర్. కీర్తి. అరేపెల్లి నరేష్, అడ్డూరి సుమలత, దేశెట్టి ప్రవీణ్ మేడ వెంకన్న. గుండె శ్రీనివాస్. మేడ వెంకన్న. నాగన బోయిన సింహాద్రి. తదితర ఉద్యమ కళాకారులు పాల్గొన్నారు..

# నాంపల్లి టూ లక్డీ కపూల్ వై ఆకారంలో బ్రిడ్జి

**హైదరాబాద్, ఆగస్టు 6, పెన్ పవర్:**
హైదరాబాద్ నడిబొడ్డున ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు మరో కీలక ఫ్లైఓవర్ నిర్మాణం కానుంది. నాంపల్లి–లక్డీకాపూల్ మార్గంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా వై ఆకారంలో కొత్త ఫ్లైఓవర్ నిర్మాణానికి హెచ్ఎండీఏ డీపీఆర్ రెడీ చేస్తోంది. 1.45 కిలోమీటర్ల పొడవుతో 3 లేన్ల వన్‌వే ఫ్లైఓవర్‌ను అసెంబ్లీ వెనుక నుంచి నిర్మించనుండగా.. లక్డీకాపూల్ వద్ద ఇది మాసబ్‌ట్యాంక్, ఖైరతాబాద్ వైపులకు విడిపోయేలా రూపకల్పన చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నగర కోర్ ఏరియాలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గే అవకాశం ఉందిహైదరాబాద్ నగరంలో అత్యంత రద్దీగా ఉండే నాంపల్లి–లక్డీకాపూల్ మార్గంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రణాళిక సిద్ధం చేస్తోంది. కోర్ సిటీలో వై ఆకారంలో కొత్త ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించిన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) తుది దశకు చేరుకుంది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) రూపొందిస్తున్న ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ఫ్లైఓవర్ నాంపల్లిలోని సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు యూనివర్సిటీ సమీపం నుంచి పబ్లిక్ గార్డెన్, అసెంబ్లీ వెనుక భాగం మీదుగా రైల్వే ట్రాక్ వెంట లక్డీకాపూల్ వరకు నిర్మించనున్నారు. మొత్తం 1.45 కిలోమీటర్ల పొడవుతో మూడు లేన్ల వన్‌వే ఫ్లైఓవర్‌గా దీన్ని డిజైన్ చేస్తున్నారు. లక్డీకాపూల్ చేరుకున్న తర్వాత ఫ్లైఓవర్ 2 మార్గాలుగా విడిపోయి వై ఆకారాన్ని సంతరించుకోనుంది. ఇందులో ఒక శాఖ దాదాపు 400 మీటర్ల మేర 2 లేన్లతో మాసబ్‌ట్యాంక్ వైపు ఇప్పటికే ఉన్న ఫ్లైఓవర్‌కు అనుసంధానం కానుండగా.. మరో శాఖ సుమారు 530 మీటర్ల మేర 2 లేన్లతో ఖైరతాబాద్ వైపు రోడ్డుకు కలుస్తుంది. దీంతో నాంపల్లి నుంచి వచ్చే వాహనాలు ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద ఆగకుండా నేరుగా తమ గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం నాంపల్లి–లక్డీకాపూల్ మార్గంలో 3 ప్రధాన ట్రాఫిక్ సిగ్నళ్లు ఉండటంతో రోజంతా తీవ్ర ట్రాఫిక్ నెలకొంటోంది. ముఖ్యంగా అసెంబ్లీ సమావేశాల సమయంలో ట్రాఫిక్ ఆంక్షల వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఫ్లైఓవర్ నిర్మాణం ట్రాఫిక్ ఒత్తిడిని గణనీయంగా తగ్గిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ట్రాఫిక్ అంచనాల కోసం ప్రత్యేక కన్సల్టెన్సీ సంస్థతో సర్వే నిర్వహించగా.. ప్రస్తుతం టోపోగ్రఫీ సర్వే తుది దశలో ఉంది. పిల్లర్ల నిర్మాణం, డౌన్ ర్యాంపులు, ప్రభుత్వ భూముల అవసరం, రైల్వే అనుమతులు, అంచనా వ్యయం వంటి అంశాలతో కూడిన డీపీఆర్‌ను త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నారు. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే నాంపల్లి, లక్డీకాపూల్, మాసబ్‌ట్యాంక్, ఖైరతాబాద్ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రయాణ సమయం కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# సిటలో 56 శాతమే పూర్తయిన డిజిటైజేషన్

**హైదరాబాద్, ఆగస్టు 6 పెన్ పవర్:** తెలంగాణలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల సవరణ ప్రక్రియ ా×= రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలానికి దారితీసింది. 2002 నాటి ఓటర్ల డేటాబేస్, జీహెచ్ఎంసీ డోర్ నంబర్లు, ఆధార్ ఆధారిత మ్యాపింగ్ ప్రక్రియలో చోటుచేసుకున్న వ్యత్యాసాల కారణంగా దాదాపు 10 శాతం మంది ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితా నుంచి గల్లంతయ్యే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లో ఫారమ్‌ల డిజిటైజేషన్ మందకొడిగా సాగుతుండటం, అసెంబ్లీ నియోజకవర్గాల వ్యాప్తంగా లక్షలాది మందికి బిఎల్వోల ద్వారా నోటీసులు రావడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఈ డేటా క్రోడీకరణ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చివరి క్షణంలో ఫ్యామిలీ సర్టిఫికెట్లు, వారసత్వ ధ్రువీకరణలను వేగంగా జారీ చేసే ప్రక్రియను ప్రారంభించింది. తెలంగాణ ఐటీ , రెవెన్యూ యంత్రాంగం ద్వారా మీ–సేవ కేంద్రాల్లో ఈ సర్టిఫికెట్లను అందుబాటులోకి తెచ్చినప్పటికీ, దరఖాస్తు చేసుకున్న ఓటర్లు ప్రాసెస్ పూర్తి కాక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ నగరంలో అత్యధికంగా ఓట్ల తొలగింపు నోటీసులు రావడం, డిజిటైజేషన్ నమోదు కేవలం 56 శాతానికే పరిమితం కావడం నగర జనాభాను తీవ్ర అయోమయంలోకి నెట్టిందిఈ తీవ్ర విమర్శలు మరియు క్షేత్రస్థాయి విఫలతలపై కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌లు బూత్ లెవెల్ ఏజెంట్లతో అత్యవసర సమావేశాలు నిర్వహించారు. ఓటర్ల ఓట్లను సక్రమంగా నమోదయ్యేలా చూడటంలో పర్యవేక్షణ లోపించిందని, ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటర్ల హక్కులకు భంగం కలగడం సరికాదని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు , నాయకుల పనితీరుపై హైకమాండ్ క్లాస్ తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌తో పాటు కొన్ని కీలక నియోజకవర్గాల్లో పక్కా వ్యూహంతో కుట్రలు జరుగుతున్నాయని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ బలమున్న సాంప్రదాయ ఓటర్లను, బహుజన, మైనారిటీ , నిరుపేద ఓటర్లను లక్ష్యంగా చేసుకుని విపక్షాలు, కొన్ని వర్గాలు కుట్రపూరితంగా పేర్లు తొలగించేలా బిఎల్వోల స్థాయిలోనే తప్పుడు రికార్డులు క్రియేట్ చేస్తున్నారని రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. కొడంగల్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు అలర్ట్‌గా ఉండాలని, ఏ ఒక్క అర్హత కలిగిన ఓటు కూడా పోకుండా కాపాడుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ ప్రత్యేక పరిస్థితులు, హైదరాబాద్ నగరంలో నత్తనడకన సాగుతున్న ప్రాసెస్, క్షేత్రస్థాయి ఫిర్యాదులతో కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. తెలంగాణలో సర్ ఎన్యూమరేషన్ ఫారమ్‌ల సేకరణ డెడ్‌లైన్‌ను ఆగస్టు 10వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రత్యేక షెడ్యూల్‌ను సవరించింది. కేంద్ర సీఈవో కార్యదర్శి నవీన్ కుమార్ స్వయంగా హైదరాబాద్ వచ్చి డోర్–టు–డోర్ సర్వేను, నియోజకవర్గాల వారీ డేటాను రీ–వెరిఫై చేయాల్సిందిగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# ఒక బిడ్డ 18 ఏళ్ల ఖర్చు 1.89 కోట్లా...

**హైదరాబాద్, ఆగస్టు 6, పెన్ పవర్:**
ప్రస్తుతం దేశంలో ప్రతీ ఒక్కటి ఖర్చులు పెరిగిపోయాయి. దీంతో యువత పెళ్లిళ్లు అంటేనే ఆమడ దూరం పారిపోతున్నారు. ఇక పెళ్లిళ్లు చేసుకున్న వారు పిల్లలను కనాలంటేనే ఖర్చులు లెక్కేస్తున్నారు. ఒక్కరు ముద్దు, అసలే వద్దు అంటూ పిల్లల విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ వీడియో ఇప్పుడు సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. భారత్‌లో ఒక బిడ్డను 18 ఏళ్ల వరకు పెంచాలంటే ఎంత ఖర్చు అవుతుందనే అంశంపై కంటెంట్ క్రియేటర్ విఖ్యాత్ సింగ్ చేసిన ఓ ఇన్‌స్టాగ్రామ్ వీడియో ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఒక మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి.. పిల్లలు పుట్టి, 18 ఏళ్లు వచ్చే వరకు వారికి అయ్యే ఖర్చులను లెక్కించాడు. ఒక కుటుంబం ఒక్కో బిడ్డకు సుమారు రూ.1.39 కోట్లు వెచ్చించాల్సి వస్తుందని విఖ్యాత్ సింగ్ అంచనా వేశారు. ద్రవ్యోల్బణం, ఉన్నత విద్య ఖర్చులు, పెట్టుబడులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటే ఈ మొత్తం కాస్తా.. రూ.2 కోట్లకు పైగా చేరవచ్చని పేర్కొన్నారు. గర్భధారణ, డెలివరీ, మెడికల్ టెస్టులు, మందులు వంటి ఖర్చులకు సుమారు రూ.3 లక్షలు అవసరమవుతాయని విఖ్యాత్ సింగ్ చెప్పారు. పుట్టిన తర్వాత తొలి 2 ఏళ్లలో డైపర్లు, టీకాలు, ఫుడ్, ఇతర అవసరాల కోసం మరో రూ.6 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుందని చెప్పారు. 2 ఏళ్ల వయసు నుంచి 18 ఏళ్ల వరకు పిల్లల ఆహారానికి మొత్తంగా రూ.15 లక్షలు ఖర్చు పెట్టాలని విక్రాంత్ సింగ్ తెలిపారు. వారి విద్యకు ప్లే స్కూల్ నుంచి స్కూల్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫారాలు, ట్రిప్స్ కలిపి ఇంకో రూ.33 లక్షలు అవసరమవుతాయని లెక్కించారు. ఇక ట్యూషన్లకు రూ.9 లక్షలు.. ఆరోగ్య సంరక్షణకు రూ.5.4 లక్షలు.. ఎంటర్‌టైన్‌మెంట్ కోసం రూ.9 లక్షలు.. బట్టలకు రూ.7.2 లక్షలు.. ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లకు రూ.4 లక్షలు.. స్పోర్ట్స్, కల్చరల్ ఈవెంట్లకు రూ.8 లక్షలు.. రవాణాకు రూ.8 లక్షలు.. పిల్లలు పుడితే పెద్ద ఇంట్లో నివసించాల్సిన అవసరం వస్తుందని అందుకు అదనంగా అద్దెకు రూ.32.4 లక్షలు ఖర్చవుతుందని వివరించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# పాముకాటుకు సరైన చికిత్స ఆస్పత్రిలోనే

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 6:**పాము కాటుకు సరైన చికిత్స ఆస్పత్రిలోనే దొరుకుతుందని, మూఢనమ్మకాలను నమ్మి తమ ప్రాణాలను కోల్పోవద్దని గార్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ పార్వతి నాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలోని స్థానిక మేజర్ గ్రామపంచాయతీ ఆవరణంలో గురువారం మ్యాన్‌కైండ్ బీఎస్‌వీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పాము కాటుకు సంబంధించిన అపోహలను తొలగించి, సరైన సమయంలో వైద్య చికిత్స పొందాల్సిన అవసరంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పోస్టర్ల ద్వారా పాము కాటుకు గురైన వ్యక్తికి చేయాల్సిన ప్రథమ చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తలు చేయకూడని చర్యలపై అవగాహన కల్పించి ఓచర్లను అందజేశారు. అనంతరం సర్పంచ్ బానోత్ పార్వతి నాయక్ మాట్లాడుతూ పాము కాటుకు గురైన వెంటనే బాధితుడిని ప్రశాంతంగా ఉంచి సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని, మంత్రాలు,



పాము కాటు అవగాహనలో మాట్లాడుతున్న సర్పంచ్ పార్వతి నాయక్

మూఢనమ్మకాలను ఆశ్రయించకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అలాగే గాయాన్ని కోయడం, విషాన్ని నోటితో పీల్చడం, బిగిగా కట్లు కట్టడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కార్మికులు తగిన జాగ్రత్తలు పాటించాలని, పాదరక్షలు ధరించడం, రాత్రి వేళల్లో టార్చ్‌లైట్లు ఉపయోగించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పాము కాటు సంభవించినప్పుడు ప్రతి ఒక్కరికి ప్రథమ చికిత్స పై అవగాహన ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తాళ్లపల్లి కృష్ణ గౌడ్, ఇల్లందు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భుక్యా నాగేశ్వరరావు, హాతీరాం, వార్డు సభ్యులు ఇమ్రాన్, కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు ఎస్ కే యాకుబ్ పాషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు దీకొండ రాము, గులగట్టు బాబు, కోల కుమార్ గౌడ్, రాజశేఖర్, మ్యాన్‌కైండ్ బి ఎస్ వి ప్రైవేట్ లిమిటెడ్ నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్ ఆశయాలే తెలంగాణకు దిక్సూచి..

- డాక్టర్ డోలి సత్యనారాయణ, జిల్లా జేఏసీ కన్వీనర్..
- మహబూబాబాద్‌లో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు..
- జేఏసి, కళాకారుల ఆధ్వర్యంలో ఘన నివాళులు..



**మహబూబాబాద్, పెన్ పవర్,ఆగష్టు 6:** తెలంగాణ జేఏసీ, కళాకారుల ఆధ్వర్యంలో తెలంగాణ సిద్ధాంతకర్త, తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.. ఈ సందర్భంగా జిల్లా టీజేఏసీ కన్వీనర్ డాక్టర్ డోలి సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నీళ్లు–నిధులు– నియామకాలు అనే నినాదంతో అలుపెరుగని పోరాటం సాగించిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. 1996 నుంచి తెలంగాణ రాష్ట్ర సాధనకు బలమైన సిద్ధాంతపరమైన పునాది వేసి, తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి, పౌర సమాజాన్ని ఏకం చేసి రాష్ట్ర సాధనకు కీలక భూమిక పోషించారని అన్నారు.. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని పూర్తిగా చూడకముందే ఆయన మరణించడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. జయశంకర్ ఇచ్చిన పిలుపు మేరకు పార్టీలకు, సిద్ధాంతాలకు, భావజాలాలకు అతీతంగా తెలంగాణ సమాజం ఒక్కటై రాష్ట్రాన్ని సాధించుకుందని తెలిపారు. ఆయన వేసిన ఒక్క అడుగు లక్షలాది మందిని తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములను చేసిందని, నేడు తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి ప్రధాన కారణం ప్రొఫెసర్ జయశంకర్ సారేనని అన్నారు..

**ఆయన సేవలను విస్మరించడం బాధాకరం..**

ప్రస్తుతం కొందరు తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ సార్ సేవలను విస్మరిస్తున్నారని, ఇది బాధాకరమని పేర్కొంటూ, భావితరాలకు ఆయన ఆశయాలు, సేవలను పరిచయం చేసి స్మరించుకోవాల్సిన బాధ్యత తెలంగాణ సమాజంపై ఉందని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో కళాకారుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి సత్యనారాయణ, కోమేరె వెంకన్న, నలంద కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపాల్ రెడ్డి, ఐలేష్, బుర్ర గోవర్ధన్, శంకర్, పుల్లయ్య, ముత్తయ్యతో పాటు కళాశాల విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# బోనాల పండుగ సందర్భంగా నల్ల పోచమ్మ అమ్మవారి ఘటం ఊరేగింపు



కుత్బుల్లాపూర్ సూరారం కాలనీలో అమ్మవారి ఘటం ఊరేగింపు..



వీధులలో అమ్మవారి ఊరేగింపు.. భక్తజన సందోహం..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఆగస్టు 6:** ఆదివారం జరగనున్న బోనాల మహోత్సవాన్ని పురస్కరించుకొని సూరారం కాలనీలోని నల్ల పోచమ్మ దేవాలయం కమిటి సభ్యుల ఆధ్వర్యంలో గురువారం ఘటం ఊరేగింపును అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంప్రదాయ వాయిద్యాలు, డప్పు చప్పుళ్లు, భక్తుల జైజైధ్వానాల మధ్య అమ్మవారి ఘటాన్ని ఆలయం నుంచి ప్రారంభించి పరిసర ప్రాంతాల వీధి వీధికి ఊరేగించారు.



కాలనీలోని, వాడవాడలా, ఇంటింటికి అమ్మవారికి ప్రత్యేకపూజలు..

ఈ సందర్భంగా మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఘటం తమ ఇంటి వద్దకు చేరుకున్న ప్రతి కుటుంబం భక్తిపూర్వకంగా స్వాగతం పలికి అమ్మవారి ఆశీర్వాదాలను పొందింది. భక్తులు కొబ్బరికాయలు కొట్టి, కుంకుమార్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఇంటిపై శ్రీ నల్ల పోచమ్మ తల్లి కరుణాకటాక్షాలు ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, సుఖశాంతులతో వర్ధిల్లాలని సంకల్పంతో ఈ ఘటం ఊరేగింపును నిర్వహించినట్లు ఆలయ కార్యవర్గ సభ్యులు తెలిపారు. బోనాల పండుగను పురస్కరించుకొని రాబోయే ప్రధాన ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు. ఘటం ఊరేగింపు సందర్భంగా స్థానికులు స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేసి, ప్రశాంత వాతావరణంలో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# చింతలపూడిలో కుంకుమపువ్వు సాగు



**ఏలూరు, ఆగస్టు 6 పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కుంకుమ పువ్వు సాగు చేయాలని నిర్ణయించింది. కుంకుమ పువ్వు సాగుకు సంబంధించి చేసిన ప్రయోగాలు విజయవంతం కావడంతో సాగు దిశగా చర్యలు తీసుకుంటోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో 30 ఎకరాల్లో కుంకుమ పువ్వు సాగు చేయాలని ప్లాన్ చేశారు. అనుమతులన్నీ రాగానే కుంకుమ పువ్వును సాగు చేసేందుకు 30 ఎకరాల భూమిని కేటాయించనున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో కుంకుమ పువ్వు సాగు దిశగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గతంలో ప్రయోగాత్మకంగా సాగు చేయగా మంచి ఫలితాలు రావడంతో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి కేంద్రంగా కుంకుమ పువ్వు సాగు చేయనున్నారు. ఏపీ ప్రభుత్వం 30 ఎకరాల్లో కుంకుమ పువ్వు సాగుకు కేటాయించాలని భావిస్తోంది. వాస్తవానికి ముందు లంగసింగి ప్రాంతంలో కుంకుమ పువ్వు సాగు చేద్దామని భావించారు.. కానీ అక్కడ అనువైన భూమి లేకపోవడంతో చింతపల్లిలో సాగు చేయాలని నిర్ణయించారు.చింతపల్లిలో కుంకు పువ్వు సాగుకు సంబంధించి శాస్త్రవేత్తలు రెండేళ్లుగా చేస్తున్న ప్రయోగాలు విజయవంతం అయ్యాయి. ఈ ప్రాంతంలో ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలలో మూడు వేర్వేరు వాతావరణ పరిస్థితుల్లో సాగు చేయగా మంచి ఫలితాలు వచ్చాయి. చింతపల్లిలో కుంకుమ పువ్వు సాగుకు.. కృష్ణా జిల్లాకు చెందిన 'స్నాప్ గ్రీన్‌మ్యాన్స్ ప్రైవేట్ లిమిటెడ్' కంపెనీ ముందుకు వచ్చింది. విశాఖపట్నంలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో ఒప్పందం కూడా చేసుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా గిరిజన మహిళలకు ఉపాధి అవకాశాలు దక్కుతాయంటున్నారు. ఏపీ ప్రభుత్వం కుంకుమ పువ్వు సాగు కోసం కేటాయించే 30 ఎకరాల్లో.. 18 ఎకరాల్లో సాగు ఉంటుంది, 3 ఎకరాల్లో ఇండోర్ పర్యావరణ పరిరక్షణ, మిగిలిన 9 ఎకరాల్లో ప్రాసెసింగ్, పరిశోధన, శిక్షణ, పరిపాలనా భవనాలు వంటి వాటి కోసం కేటాయించారు.కుంకుమ పువ్వు సాగు పరిశ్రమ ఏర్పాటు కోసం దరఖాస్తు చేసిన వారికి కూడా మంచి అనుభవం ఉంది అంటున్నారు. ఏపీ ప్రభుత్వం ఈ అంశాలన్నీ పరిగణలోకి తీసుకుని చింతపల్లిలో కుంకుమపువ్వు సాగుకు అడుగులు వేస్తోంది. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, సుగంధ ద్రవ్య బోర్డు, సేంద్రీయ ధృవీకరణ, ఉద్యానవన శాఖ నుంచి అనుమతులు రాగానే భూమిని అధికారికంగా కేటాయిస్తారు. దేశవ్యాప్తంగా కాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ వంటి చల్లని ప్రాంతాల్లో ఎక్కువగా కుంకుమ పువ్వు సాగు చేస్తున్నారు. మనకు 100 టన్నుల డిమాండ్ ఉంటే.. దేశీయంగా కేవలం 3.46 టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తి 300 టన్నులు ఉంటే.. ఇరాన్, స్పెయిన్ దేశాలు ఒకటి, రెండు స్థానాల్లో ఉన్నాయి.

# వారసుడిగా విమర్శలు - లోకేష్ పనితీరుపై పొగడ్తలు

**విజయనగరం, ఆగస్టు 6 పెన్ పవర్:**
విజయనగరం జిల్లా భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం ముగించుకుని తిరుగుపయనమైన సందర్భంలో.. దేశ ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ భుజం తట్టి "శభాష్ లోకేశ్! చాలా బాగా పనిచేస్తున్నావు.. ఇదే వేగం, స్ఫూర్తితో ముందడుగు వేయి" అని అభినందించడం కేవలం ఒక సాధారణ వీడ్కోలు మర్యాద మాత్రమే కాదు. భారత రాజకీయాల్లో సీనియర్ నేతల గుర్తింపు పొందడం అంత సులభం కాని తరుణంలో, ప్రధాని స్థాయిలో లభించిన ఈ ఆత్మీయ ప్రశంసా వాక్యాలు నారా లోకేశ్ పాలనా నైపుణ్యానికి, క్రమశిక్షణతో కూడిన పట్టుదలకు దక్కిన జాతీయ స్థాయి ముద్రగా చెప్పుకోవచ్చు. తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారసుడిగా రాజకీయ అరంగేట్రం చేసిన ప్రారంభంలో లోకేశ్ తీవ్ర ప్రతికూల విమర్శలను, సోషల్ మీడియా ట్రోలింగ్‌ను ఎదుర్కొన్నారు. వారసత్వం అనే నైతిక బరువుతో ప్రయాణం ప్రారంభించిన ఆయన, విమర్శలను ఎదురుదాడికి సాకుగా మార్చుకోకుండా పరిపాలనా సామర్థ్యం, పక్కా కార్పొరేట్ మేనేజ్‌మెంట్ స్కిల్స్‌తో తనను తాను మలచుకున్నారు. పాదయాత్ర ద్వారా ప్రజల్లోకి చొచ్చుకెళ్లడం, మంగళగిరి నియోజకవర్గంలో రికార్డు విజయం సాధించడమే కాకుండా.. కార్నెగీ మెల్లన్, స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయాల విద్యాభ్యాసం అందించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని పాలనలో సమర్థవంతంగా వినియోగిస్తూ ఒక ప్రొఫెషనల్ లీడర్‌గా ఎదిగారు.విజయనగరం భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం, యోగాంధ్ర ప్రపంచ రికార్డు కార్యక్రమాల నిర్వహణ, లేదా గతంలో ప్రధాని మోదీ ఏపీ పర్యటనల సమన్వయం ఇలా ప్రతి ఈవెంట్‌లోనూ లోకేశ్ చూపించిన ఆర్గనైజింగ్ స్కిల్స్ ప్రధానిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ గవర్నెన్స్, గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్‌తో పాటు విద్యాశాఖలో తెచ్చిన సంస్కరణలపై ప్రధాని మోదీ ముందే సమాచారం పొంది ఉండటంతోనే.. వేదికపై పబ్లిక్‌గా లోకేశ్‌ను ప్రశంసించారని స్పష్టమవుతోంది. ఇది ఒక యువ నాయకుడి కష్టానికి, పారదర్శక కార్యాచరణకు దక్కిన ప్రతిఫలం అనుకోవచ్చు. వారసత్వ రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకించే ప్రధాని మోదీ గతంలో లోకేష్ ను కూడా విమర్శించారు. కానీ ఇప్పుడు అభినందిస్తున్నారు. ప్రధాని శభాష్ అని అనడం వెనుక లోకేశ్ సొంతంగా సంపాదించుకున్న గుర్తింపే ప్రధాన కారణం. ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల వికాస శాఖల మంత్రిగా గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆంధ్రప్రదేశ్ వైపు ఆకర్షించడంలో లోకేశ్ నిరంతరం విదేశీ ప్రతినిధులతో సమావేశమవుతూ చురుగ్గా పనిచేస్తున్నారు. పెట్టుబడుల సేకరణ, నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పనలో ఆయన చూపుతున్న వేగం జాతీయ స్థాయిలో కూడా చర్చనీయాంశమైంది. మరోవైపు విపక్షాలు చేసే రాజకీయ విమర్శలకు సైతం లోకేశ్ ఇప్పుడు సంయమనంతో, సమాచార ఆధారిత సమాధానాలు ఇస్తూ ఒక సీనియర్ స్టేట్స్‌మన్‌లా వ్యవహరిస్తున్నారు. పార్టీలో తండ్రి చంద్రబాబు నాయుడి పక్కన ఒక బలమైన రెండో శ్రేణి నాయకత్వంగా నిలబడటమే కాకుండా, ఎన్డీయే కూటమి సమన్వయంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. పవన్ కల్యాణ్ వంటి జనసేన అధినేతతో, బిజెపి కేంద్ర నాయకత్వంతో సౌహార్దపూర్వక సంబంధాలను నిర్వహిస్తూ కూటమికి బలమైన ఆధారంగా నిలిచారు.సొంత ప్రయాణంలో తండ్రి నీడ నుంచి బయటకు వచ్చి, తనదైన శైలిలో పాలన సాగిస్తూ, శభాష్ అని ప్రధాని చేత పటించుకోవడం ఒక యువ నేతకు అతిపెద్ద పొలిటికల్ మైలురాయి. దేశంలోనే అత్యంత ప్రామిసింగ్ యంగ్ పొలిటీషియన్లలో ఒకరిగా ఎదిగిన లోకేశ్‌కు ప్రధాని ఇచ్చిన ఈ బూస్ట్, రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, విద్యా వికాసంలో మరింత వేగాన్ని నింపడమే కాక.. జాతీయ స్థాయిలో ఆయన ప్రాధాన్యతను మరింత పెంచనుందనడంలో సందేహం లేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



# ఐఎన్ఎస్ డేగ ఇక జ్ఞాపకమేనా !!

**విశాఖపట్టణం, ఆగస్టు 6 పెన్ పవర్:**
ఆరు దశాబ్దాలకు పైగా విశాఖపట్నానికి విమానంలో వచ్చిన ప్రతి ప్రయాణికుడూ సాధారణ విమానాశ్రయంలో దిగలేదు... భారత నౌకాదళ వైమానిక స్థావరంలోనే అడుగుపెట్టాడు. మీ విమానం ల్యాండ్ అయిన అదే రన్‌వేపై ప్రతి ఉదయం హాక్ జెట్ శిక్షణ విమానాలు గర్జిస్తూ ఆకాశంలోకి దూసుకెళ్లేవి. టెర్మినల్ పక్కనే జలాంతర్గాములను వేటాడే హెలికాప్టర్లు నిలిపిన హ్యాంగర్లు కనిపించేవి. పౌర విమానాలు, యుద్ధ విమానాలు... రెండూ ఒకే రన్‌వేను పంచుకోవడం విశాఖకు మాత్రమే ప్రత్యేకమైన దృశ్యం. "విశాఖ అంటే అంతే" అన్నట్టే వైజాగ్ ఎయిర్పోర్ట్ ఆపరేషన్స్ సాగాయి.ఆగస్టు 1, 2026న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భోగాపురంలోని "అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని" ప్రారంభించారు. ఆగస్టు 17నుంచి అన్ని కమర్షియల్ విమాన సర్వీసులు అక్కడికి మారనున్నాయి. దీంతో ఆరు దశాబ్దాలుగా ప్రయాణికులను ఆహ్వానించిన ఐఎన్ఎస్ డేగా ఇకపై పూర్తిగా నావికాదళ విమాన స్థావరంగానే కొనసాగనుంది.ఈ సందర్భంగా ఒక ప్రశ్న సహజంగానే వస్తుంది. ఐఎన్ఎస్ డేగా కథ ఎక్కడ మొదలైంది? ఇప్పుడు దాని భవిష్యత్తు ఎలా ఉండబోతోంది?యుద్ధ అవసరాల కోసం నిర్మించిన రన్‌వే... తర్వాత నౌకాదళ గూటిగా మారింది×చీూ డేగా చరిత్ర భారత నౌకాదళంతో కాదు... రెండో ప్రపంచ యుద్ధంతో ప్రారంభమవుతుంది. ఆ సమయంలో భారత తూర్పు తీరంలో సైనిక కార్యకలాపాలకు మద్దతుగా రాయల్ ఎయిర్ ఫోర్స్ నావల్ ఆర్మమెంట్ డిపో సమీపంలో ఒక ఎయిర్‌స్ట్రిప్ నిర్మించింది. యుద్ధం ముగిసిన తర్వాత ఆ రన్‌వే దాదాపు నిరుపయోగంగా మారిపోయింది. 1962లో పౌర విమానాల కోసం మళ్లీ తెరిచినా ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉండటంతో సేవలు పలుమార్లు నిలిచిపోయాయి.భారత నౌకాదళం తన వైమానిక విభాగాన్ని విస్తరించే క్రమంలో 1972 డిసెంబరులో విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించింది. తొలుత ×చీూ సర్కార్స్ నుంచి హెలికాప్టర్ యూనిట్‌ను నడిపింది. నాలుగేళ్లలో పౌర విమానాశ్రయం పక్కనే హెలిప్యాడ్లు, హ్యాంగర్లు ఏర్పడ్డాయి. 1986లో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా విశాఖ విమానాశ్రయాన్ని అధికారికంగా భారత నౌకాదళానికి అప్పగించింది.భారత పౌర విమానయాన చరిత్రలో ఇది అత్యంత అరుదైన నమూనా. సాధారణంగా సైనిక స్థావరాల్లో పౌర విమానాల కోసం చిన్న ఎన్‌క్లేవ్ ఉంటుంది. విశాఖలో మాత్రం పూర్తిస్థాయి పౌర విమానాశ్రయం నావికాదళ స్థావరం లోపలే నడిచింది. 1991 అక్టోబర్ 21న వైస్ అడ్మిరల్ లక్ష్మీనారాయణ రామ్‌దాస్ దీనిని అధికారికంగా "ఐఎన్ఎస్ డేగా" గా ప్రారంభించారు.డేగా" అంటే మనకు తెలిసిన గద్ద జాతి పక్షే. శక్తి, వేగానికి ప్రతీకగా నిలిచే ఆ పేరు... తర్వాతి కాలంలో హాక్ జెట్లు, కామోవ్ హెలికాప్టర్లు, నిఘా విమానాలకు కేంద్రంగా ఎదిగి ఈ స్థావరానికి సరిగ్గా సరిపోయింది.2000ల దశకం ఐఎన్ఎస్ డేగా రూపురేఖలనే మార్చేసింది. 2007లో 10 వేల అడుగుల కొత్త రన్‌వే అందుబాటులోకి వచ్చింది. వెంటనే రాత్రి వేళల్లో కూడా విమాన కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. గోవా నుంచి కామోవ్ హెలికాప్టర్లతో కూడిన ఐఎన్ఏఎస్-333 "ఈగిల్స్", తర్వాత హాక్ జెట్ శిక్షణ విమానాలతో ×చీూా-551 "ది ఫాంటమ్స్" ఇక్కడికి వచ్చాయి. 2009 నాటికి ఐదు నౌకాదళ స్క్వాడ్రన్లు, యుద్ధ నౌకల విమాన యూనిట్లు, నెలకు 550కుపైగా కమర్షియల్ విమానాలు... అన్నీ ఒకే రన్‌వేను పంచుకునే స్థాయికి ఐఎన్ఎస్ డేగా చేరుకుంది.విశాఖ ప్రజలకు ఇది రోజువారీ జీవితంలో భాగమైపోయింది. పైన హాక్ జెట్ గర్జిస్తే అది సాధారణ దృశ్యమే. కానీ ×చీూ డేగా కేవలం విమానాశ్రయం మాత్రమే కాదు. ప్రతి ఏడాది బంగాళాఖాతంలో విరుచుకుపడే తుపాన్లు, వరదల సమయంలో సహాయక చర్యల్లో ముందుండేది. తూర్పు నౌకాదళ కమాండ్ అడ్వెంచర్, స్కైడైవింగ్ కార్యక్రమాలకు కూడా ఇదే కేంద్రంగా నిలిచింది.ఈ ద్వంద్వ వినియోగ వ్యవస్థ విశాఖకు ప్రత్యేక గుర్తింపునిచ్చింది. అయితే అదే కాలక్రమంలో దాని బలహీనతగా కూడా మారింది. మూడు వైపులా కొండలు ఉండటంతో విమానాలు ఒకే దిశలో టేకాఫ్, ల్యాండింగ్ చేయాల్సి వచ్చేది. గంటకు దాదాపు పది విమానాలకే పరిమితి. అదీ కాక పౌర విమానాల షెడ్యూల్ మొత్తం నౌకాదళ శిక్షణ సమయాలకు అనుగుణంగానే ఉండేది. ఇంతలో విశాఖ నగరం విస్తరించింది. ఉక్కు పరిశ్రమలు, ఫార్మా కంపెనీలు, పోర్టు ఆధారిత పెట్టుబడులతో దేశంలో వేగంగా ఎదుగుతున్న నగరంగా మారింది. 1990ల అవసరాలకు సరిపోయే విమానాశ్రయం... 2020ల విశాఖ అవసరాలకు సరిపోలేని పరిస్థితి ఏర్పడింది.ఎన్నో సంవత్సరాలుగా ప్రతిపాదనలకే పరిమితమైన భోగాపురం విమానాశ్రయం చివరకు సాకారమైంది. సుమారు ?4,700 నుంచి ?5,600 కోట్ల వ్యయంతో పీపీపీ విధానంలో జీఎంఆర్ నిర్మించిన "అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం", విశాఖకు ఈశాన్యంగా విజయనగరం జిల్లా భోగాపురం సమీపంలో సిద్ధమైంది. 3,800 మీటర్ల రన్‌వేతో భారీ వైడ్‌బాడీ విమానాలు దిగే సామర్థ్యం దీనికి ఉంది. మొదటి దశలో ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించేలా, భవిష్యత్తులో నాలుగు కోట్ల వరకు విస్తరించేలా దీన్ని రూపకల్పన చేశారు. డీజీసీఏ లైసెన్స్, బీసీఏఎస్ భద్రతా అనుమతులు, అంతర్జాతీయ ఇమ్మిగ్రేషన్ హోదా... అన్నీ పూర్తయ్యాయి. ఆగస్టు 17 నుంచి దేశీయ, అంతర్జాతీయ కమర్షియల్ విమానాలన్నీ భోగాపురం నుంచే నడవనున్నాయి. విశాఖకు చిరునామాగా ఉన్న"ఝ్గ" ఐఏటీఏ కోడ్ కూడా అక్కడికే మారుతుంది.ఈ మార్పుతో మూతపడేది పౌర ప్రయాణికుల టెర్మినల్ మాత్రమే. నావికాదళ స్థావరం మాత్రం యథావిధిగా కొనసాగుతుంది. సైనిక విమానాలు, నౌకాదళ కార్యకలాపాలు, విపత్తు సహాయక చర్యలు, ప్రభుత్వ ప్రత్యేక విమానాలు, వీఐపీ రాకపోకలు... అన్నింటికీ ఐఎన్ఎస్ డేగా సేవలందిస్తూనే ఉంటుంది. అంతేకాదు, కమర్షియల్ విమానాల ఒత్తిడి తొలగిపోవడంతో విశాఖ గగనతలంపై భారత నౌకాదళానికి పూర్తి నియంత్రణ లభిస్తుంది. ఇప్పటి వరకు పౌర విమానాల షెడ్యూల్‌ను దృష్టిలో పెట్టుకుని చేయాల్సి వచ్చిన అడ్జస్ట్మెంట్లు ఇక అవసరం ఉండవు. శిక్షణ విమానాలు పెంచడం, నౌకాదళ కార్యకలాపాలను విస్తరించడం, అత్యవసర పరిస్థితుల్లో మరింత వేగంగా స్పందించడం... ఇవన్నీ మరింత సులభమవుతాయి.ఐఎన్ఎస్ డేగా ఎప్పుడూ శాశ్వత పౌర విమానాశ్రయంగా లేదు.

# తిరుపతి, నెల్లూరు జిల్లాల్లోనే ఓట్లు మిస్

**విజయవాడ, ఆగస్టు 6 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ సంచలనం సృష్టిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4.16 కోట్ల ఓటర్లలో ఏకంగా 44.89 లక్షల ఓటర్లు అంటే సుమారు 10.8 శాతం ఓటర్ల పేర్లను అధికారులు ముసాయిదా జాబితాలో అన్ కలెక్టబుల్ కేటగిరీ కింద తొలగించేందుకు సిద్ధం చేశారు. జులై 31న విడుదలైన ఈ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం.. రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 3.71 కోట్లకు పడిపోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర అలజడి రేపుతోంది.ఈ భారీ ఓట్ల గల్లంతు వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే.. 15.22 లక్షల మంది మరణించిన వారు కాగా, 22.99 లక్షల మంది శాశ్వతంగా నివాసం మారినవారు లేదా ఫారమ్‌లు సమర్పించని అన్ కలెక్టబుల్ కేటగిరీలో ఉన్నారు. మరో 7.37 లక్షల ఓట్లను ఒకే వ్యక్తికి వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న డూప్లికేట్ ఓట్లుగా అధికారులు వర్గీకరించారు. ముఖ్యంగా రాయలసీమ , కోస్తా జిల్లాల్లో ఓట్ల రద్దు అత్యధికంగా నమోదైంది. నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 2.91 లక్షల ఓట్లు, తిరుపతి జిల్లాలో 2.88 లక్షలు, కర్నూలులో 2.74 లక్షలు, అనంతపురంలో 2.48 లక్షలు, వైఎస్సార్ కడపలో 2.45 లక్షలు, విశాఖపట్నంలో 2.39 లక్షల ఓట్లు తొలగింపు లిస్టులోకి వెళ్లాయి.ఈ భారీ ప్రక్రియ వెనుక అసలేం జరుగుతోంది.. వీరంతా ఎటు పోయారనే ప్రశ్న అందరిలోనూ ఆసక్తి రేపుతోంది. ఉపాధి, విద్య, వ్యాపార రీత్యా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లేదా ఇతర నగరాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారు క్షేత్రస్థాయి రీ-వెరిఫికేషన్ సమయంలో లభించకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని అధికారులు చెబుతున్నారు. రాజకీయ నష్ట కోణంలో చూస్తే, ఈ ఓట్ల గల్లంతు ప్రభావం రెండు ప్రధాన పార్టీలపై పడే అవకాశం ఉంది. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తూ సొంత ఊళ్లకు వచ్చి ఓటేసే మైగ్రెంట్ ఓటర్లు వైఎస్సార్‌సీపీ లేదా టీడీపీ మద్దతుదారులనే లెక్కలు పార్టీల వద్ద ఉన్నాయి. క్షేత్రస్థాయిలో తమ మద్దతుదారుల పేర్లు పొరపాటున ఈ 44 లక్షల జాబితాలో చేరాయేమోనని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమితో పాటు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, ఉప ఎన్నికల వేళ ఈ ఓట్ల వ్యత్యాసం గెలుపోటములను శాసించే స్థాయిలో ఉంది.ఎన్నికల సంఘం, సీఈఓ వివేక్ యాదవ్ స్పష్టం చేసిన దాని ప్రకారం, ఇది కేవలం ముసాయిదా మాత్రమే. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు హక్కునూ నోటీసు, విచారణ లేకుండా తొలగించబోమని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం ఆగస్టు నెల అంతా క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ నడుస్తోంది. తమ పేరు పొరపాటున గల్లంతైతే ఫారమ్-6 సమర్పించి, సరైన ఆధారాలు చూపిస్తే అక్టోబర్ 3న విడుదలయ్యే తుది ఓటర్ల జాబితాలో మళ్లీ పేరు చేరుతుందని ఈసీ వెల్లడించింది. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో గ్రామీణ మరియు పట్టణ పరిధిలో బూత్ లెవెల్ ఏజెంట్లను అలర్ట్ చేసిన కూటమి, వైఎస్సార్‌సీపీ నేతలు ప్రతి నియోజకవర్గంలో రద్దయిన ఓట్ల జాబితాను రీ-వెరిఫై చేసే పనిలో పడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటూ విలువైనదే అయినందున, అసలైన ఓటర్లు తమ హక్కును కోల్పోకుండా చూసేందుకు పొలిటికల్ పార్టీలు డిజిటల్ క్యాంపెయిన్లు, డోర్-టు-డోర్ వెరిఫికేషన్లను ముమ్మరం చేశాయి.

## అనగానికి రాజకీయ ఇబ్బందులు

**గుంటూరు, ఆగస్టు 6, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్ రాజకీయంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయన ప్రధాన అనుచరుడు గూడపాటి శ్రీనివాసరావు పార్టీకి రాజీనామా చేసి వైసీపీలో చేరడం ఒకరకంగా సాక్ అని చెప్పాలి. మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రాతినిధ్యం వహిస్తున్న రేపల్లె నియోజకవర్గంలో స్థానిక రాజకీయ పరిణామాల నేపథ్యంలో రేపల్లెకు చెందిన టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో ఆయన పార్టీని వీడుతూ, వైసీపీ కాంగ్రెస్ పార్టీ అధినేతను కలిసి త్వరలోనే ఆ పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. రేపల్లె టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు పార్టీ వీడటం కేవలం తన వ్యక్తిగత కారణాలరీత్యా రాజీనామా చేశానని చెప్పారు. అనగాని సత్యప్రసాద్ వరసగా మూడు సార్లు రేపల్లె నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. 2014లో తొలిసారి గెలిచిన అనగాని సత్యప్రసాద్ తర్వాత 2019, 2024 ఎన్నికల్లోనూ విజయం సాధించి హ్యాట్రిక్ విక్టరీని కొట్టారు. ఈ విజయం వెనక గూడపాటి కష్టం ఉందని ఆయన అనుచరులు చెబుతున్నారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత చంద్రబాబు మంత్రివర్గంలో రెవెన్యూ శాఖ మంత్రిగా బాధ్యతలను చేపట్టారు. రేపల్లె నియోజకవర్గంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ కుటుంబ సభ్యుల జోక్యం ఎక్కువయిందని, పార్టీ కోసం, ఆయన గెలుపు కోసం పనిచేసిన వారిని మంత్రి అయిన తర్వాత పట్టించుకోవడం లేదని గూడపాటి శ్రీనివాసరావు అనుచరులు చెబుతున్నారు. కానీ వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేసినట్లు గూడపాటి హుందాగా చెప్పడం విశేషం. ఇక రంజుగా రాజకీయం వైసీపీ కండువా కప్పుకుని... తాజాగా రేపల్లె నియోజకవర్గం టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు వైసీపీలో చేరారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ సమక్షంలో రేపల్లె నియోజకవర్గ టీడీపీ నేత, కాపు నాయకుడు గూడపాటి శ్రీనివాసరావు, అనుచరులు టీడీపీలో చేరారు. జగన్ గూడపాటి శ్రీనివాసరావును పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గతంలో గూడపాటి శ్రీనివాసరావు రేపల్లె నియోజకవర్గంలో కీలక నేతగా ఉన్నారు. రేపల్లెలో పార్టీ విజయం కోసం గూడపాటి శ్రీనివాసరావు పనిచేస్తారని, వచ్చే ఎన్నికల్లో మోహన్ కు మద్దతుగా ప్రకటిస్తారని తెలిపారు. దీంతో రేపల్లె నియోజకవర్గంలోని వైసీపీలో జోష్ పెరిగింది. వచ్చే ఎన్నికల్లో రేపల్లెలో విజయం సాధించడానికి తన వంతు కృషి చేస్తానని, గూడపాటి శ్రీనివాసరావు చెప్పారు. కాపు సామాజికవర్గం నేత వైసీపీలోకి రావడంతో ఆ పార్టీ నేతల్లో ఒకింత సంతోషం వ్యక్తమవుతుంది.

## ఎలా ఎదిగాడో...దానికి డబుల్ స్పీడ్ లో...
## దిగజారిన ఉదయ్ కృష్ణారెడ్డి

**ఒంగోలు, ఆగస్టు 6, పెన్ పవర్:** ట్రెయినీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కష్టపడి పైకి వచ్చారు. ఎంత వేగంగా ఎదిగారో.. అంతే స్పీడ్ గా పతనమయ్యారు. ఒక బలహీనత ఆయన కెరీర్ ను ప్రమాదంలోకి నెట్టేసింది. మహిళలతో సంబంధాల కోసం ఉదయ్ కృష్ణారెడ్డి ఐపీఎస్ ఉద్యోగానికే ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నారు. ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కేసులో ట్విస్ట్ ల మీద ట్విస్ట్ లు పోలీసుల విచారణతో వెదలయింది. ట్రెయినీ మహిళ ఐపీఎస్ తో మాత్రమే కాకుండా మరో మహిళతోనూ వివాహేతర సంబంధం ఉన్నట్లు పోలీసులు దర్యాప్తులో వెల్లడయింది. తమ ప్రాంతానికి చెందిన మహిళ హైదరాబాద్ లో ఉండటం, ఆమెను లోబర్చుకున్నారన్న ఆరోపణలు ఉదయ్ కృష్ణారెడ్డిపై వినిపిస్తున్నాయి.... ట్రయినీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు దర్యాప్తులో కీలక పురోగతి కనిపిస్తుంది. ఉదయ్ కృష్ణారెడ్డి గదిలో కత్తి, రెండు ప్రేమలేఖలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ కు చెందిన వివాహితతో సంబంధం ఉన్నట్లు గుర్తించారు. బాధితురాలిని కలిసిన తర్వాత ఉదయ్‌కు వివాహిత దూరమైనట్లు కూడా కనుగొన్నారు. తోటి ట్రైనీ మహిళా ఐపీఎస్ అధికారిణిపై వేధింపుల కేసులో అరెస్టయిన ట్రెయినీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి సంబంధించి దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నగర మహిళా భద్రతా విభాగం డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ నేతృత్వంలో సాగుతున్న విచారణలో నిందితుడి విపరీత ప్రవర్తన, ఇతర సంబంధాలపై కీలక ఆధారాలు లభ్యమయ్యాయి... కేసులో భాగంగా సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం పోలీసులు అశోక్‌నగర్‌లోని ఉదయ్ కృష్ణారెడ్డి గదిలో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒక ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్‌తో పాటు ఒక కత్తి, వేర్వేరు చేతిరాతలతో ఉన్న రెండు ప్రేమలేఖలను స్వాధీనం చేసుకున్నారు. ఈ లేఖల ఆధారంగా ఆరా తీయగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ వివాహితతో ఉదయ్‌కు సన్నిహిత సంబంధం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. 2014లో వివాహమైన సదరు మహిళ, 2023 నుంచి భర్తకు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలోనే ఆమెకు ఉదయ్‌తో పరిచయం ఏర్పడినట్లు తెలిసింది. ఉదయ్ సూచన మేరకే ఆ మహిళ తన పాత ఉద్యోగాన్ని వదిలేసి, అశోక్‌నగర్‌లోని ఓ ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో చేరినట్లు దర్యాప్తులో వెల్లడైంది. వీరిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగాక, లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉందామని ఉదయ్ ప్రతిపాదించగా, చట్టబద్ధంగా విడాకులు రాకపోవడంతో ఆమె నిరాకరించినట్లు సమాచారం. ఈ కేసులో మరో కీలకమైన విషయం ఏమిటంటే.. ఈ ఏడాది ఫిబ్రవరిలో బాధితురాలైన ట్రెయినీ ఐపీఎస్ అధికారిణిఆ వివాహితను కలిసి ఉదయ్ కృష్ణారెడ్డి విపరీత ప్రవర్తన, తనపై జరిపిన దాడుల గురించి వివరించారు. దీంతో అతడి నిజస్వరూపం తెలుసుకున్న ఆ మహిళ, అప్పటి నుంచి ఉదయ్‌కు దూరంగా ఉంటున్నట్లు పోలీసుల విచారణలో స్పష్టమైంది. బాధితురాలి గదిలోకి ఉదయ్ బలవంతంగా ప్రవేశించి ఆమె ఫోన్‌ను లాక్కున్నట్లు కూడా పోలీసులకు బలమైన ఆధారాలు లభించాయి. శిక్షణ సమయంలోనూ ఉదయ్ కృష్ణారెడ్డి అతి కోపం, ప్రవర్తన కారణంగా తోటి అధికారులు మానసికంగా ఇబ్బంది పడినట్లు తెలుస్తోంది.ఈ కేసులో భాగంగా పోలీసులు ఇప్పటివరకు దాదాపు 20 మంది నుంచి వాంగ్మూలాలు సేకరించారు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# మొదటిసారి కేంద్రం కాళ్లబేరం.. కీలక బిల్లుల కోసం రాహుల్ తో చర్చలు



దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదం పొందేలా కేంద్ర ప్రభుత్వం పావులు కదుపుతోంది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఈ నెల 13తో ముగియనుండటంతో, ఆ లోపే రెండు కీలక బిల్లులను నెగ్గించుకునే దిశగా సర్కారు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ అంశంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో సమావేశం కావడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కీలక బిల్లుల విషయంలో విపక్షం మద్దతు లేకుండా నెగ్గించుకునే పరిస్థితి లేకపోవడంతో కేంద్రం తొలిసారిగా ఓ మెట్టు దిగేందుకు సిద్ధమైందని ఈ ఘటన రుజువు చేసిందని అంటున్నారు.కీలక బిల్లుల ఆమోదంపై చర్చించేందుకు కేంద్రమంత్రి స్వయంగా రాహుల్ చాంబర్ కు వెళ్లడం ఆసక్తికరంగా మారింది. రాహుల్‌తో పాటు కాంగ్రెస్ నేతలు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, గౌరవ్ గొగోయ్ సుమారు 50 నిమిషాలపాటు కేంద్ర మంత్రి కిరణ్ రిజుజుతో భేటీ అయ్యారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లుల ఆమోదానికి సహకరించాలని రాహుల్‌ను మంత్రి కోరారు. అయితే, కేంద్రం విజ్ఞప్తులను రాహుల్ గాంధీ సున్నితంగా తిరస్కరించినట్లు ప్రచారం జరుగుతోంది. అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ ఉదంతంపై ఉభయసభల్లో తక్షణమే చర్చ చేపట్టాలని, గత నెల 20న ఢిల్లీలో విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీచార్జి ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో అధికారికంగా ప్రకటన చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ డిమాండ్లను అంగీకరించే వరకు ప్రభుత్వానికి ఎలాంటి సహకారమూ అందించేది లేదమని రాహుల్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

గత పది రోజుల్లో రాహుల్‌తో రిజిజు భేటీ కావడం ఇది రెండోసారి కావడం గమనార్హం. ఈ భేటీ అనంతరం కిరణ్ రిజిజు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, హోంమంత్రి అమిత్ షాలను కలిసి రాహుల్ వైఖరిని వివరించారు. మరోవైపు సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, డీఎంకే అధినేత స్టాలిన్‌తో కూడా సంప్రదింపులు జరిపేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ముఖ్యంగా డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోతుందనే ఆందోళనలను తొలగించేందుకు కేంద్రం ఒక అడుగు ముందుకు వేయనుంది. జనాభాతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రంలోనూ లోక్‌సభ సీట్ల సంఖ్యను కనీసం 50 శాతం పెంచేలా ప్రత్యేక క్లాజును ఈ బిల్లులో చేర్చనున్నట్లు సమాచారం.

**సంఖ్యాబలం సవాల్.. డీఎంకే పాత్ర కీలకం**

రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదించుకోవాలంటే లోక్‌సభలో 360 మంది, రాజ్యసభలో 164 మంది ఎంపీల మద్దతు (2/3 మెజారిటీ) అత్యంత కీలకంగా చెబుతున్నారు. గతంలో ఈ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు 298 మంది మాత్రమే అనుకూలంగా ఓటేశారు. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ ఎన్నికల తర్వాత తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) చీలికలు వచ్చి కొందరు ఎంపీలు ఎన్డీఏ వైపు మొగ్గుచూపారు. అలాగే శివసేన (ఉద్ధవ్) పార్టీకి చెందిన ఏడుగురు ఎంపీలు ఏక్‌నాథ్ షిండే వర్గంలో చేరడంతో ఎన్డీఏ బలం సుమారు 320కి చేరింది. అయినప్పటికీ 360 అనే మ్యాజిక్ ఫిగర్‌కు ఇంకా దూరం ఉండటంతో కేంద్రం విపక్ష పార్టీలపై ఆధారపడాల్సి వస్తోంది. ఇటీవలి కాలంలో తమిళనాడు రాజకీయ సమీకరణాల కారణంగా 'ఇండియా' కూటమి నుంచి డీఎంకే వైదొలిగింది. ఆ పార్టీకి చెందిన 22 మంది ఎంపీల మద్దతును కూడగట్టుకోవడం ద్వారా సంఖ్యాబల కొరతను తీర్చుకోవాలని కేంద్రం భావిస్తోంది. అయితే, కూటమికి దూరమైనంత మాత్రాన డీఎంకే పూర్తిగా ఎన్డీఏకు మద్దతిస్తుందా? లేదా? అనేది ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**ప్రత్యేక సమావేశాలు.. ఊహాగానాలే**

ప్రస్తుత వర్షాకాల సమావేశాల్లో ఈ బిల్లులు ఆమోదం పొందకపోతే, ఈ నెల 16 నుంచి 18 మధ్య పార్లమెంటును ప్రత్యేకంగా సమావేశపరచాలని ప్రభుత్వం యోచిస్తోందనే ఊహాగానాలు వచ్చాయి. అయితే దీనిపై స్వయంగా కిరణ్ రిజిజు స్పష్టతనిచ్చారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ బిల్లుల కోసం ప్రత్యేకంగా పార్లమెంట్ సమావేశాలను నిర్వహించే ఎలాంటి ప్రతిపాదన ప్రస్తుతం ప్రభుత్వం వద్ద లేదని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, ప్రస్తుత సమావేశాలు మరో వారం రోజుల పాటు కొనసాగనున్నందున, ఈ లోపే బిల్లులను సభ ముందుకు తెచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

# రాజమహేంద్రవరంలో దారుణ ఘటన.. మద్యం మత్తులో విద్యార్థుల దుశ్చర్య, మెడికో బ్రెయిన్ డెడ్

ప్రశాంతమైన గోదావరి తీరంలో దారుణం చోటుచేసుకుంది. రాజమహేంద్రవరంలో మెడికల్ పీజీ చదువుతున్న విద్యార్థినిపై హత్యాయత్నం పెను సంచలనం సృష్టిస్తోంది. ఇందుకు సంబంధించిన సీసీ కెమెరా దృశ్యాలు వైరల్ అవుతున్నాయి. మూడు రోజుల క్రితం నాటి ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారని చెబుతున్నారు. మద్యం మత్తులో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు తమ కారు ముందు స్కూటీతో వెళుతున్న వైద్య విద్యార్థిని ఢీకొట్టడంతోపాటు ఆమె తలపై నుంచి కారు ఎక్కించడంతో బ్రెయిన్ డెడ్ కు గురైందని పోలీసులకు ఫిర్యాదు అందింది. నిందితులు ఉద్దేశపూర్వకంగానే వైద్య విద్యార్థినిపై కారు ఎక్కించారని పోలీసుల విచారణలో బయటపడిందని చెబుతున్నారు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్టు చేసినట్లు పోలీసులు ప్రకటించారు. రాజమహేంద్రవరంలో చోటుచేసుకున్న ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశం అవుతోంది. మెడికల్ విద్యార్థినిని వెనుక నుంచి కారుతో ఢీకొట్టడమే కాకుండా రెండు మూడు సార్లు కారుతో ఢీకొట్టేందుకు ప్రయత్నించడం, చివరికి దిచక్రవాహనంపై నుంచి ఆమె పడిపోగా, కారు విద్యార్థిని తలపై నుంచి వెళ్లిపోవడం సీసీ కెమెరాల్లో స్పష్టంగా నమోదైందని పోలీసులు తెలిపారు. ఘటనపై తమకు అందిన ఫిర్యాదు మేరకు నిందితులు ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులుగా గుర్తించామని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనను చూసిన ప్రతి ఒక్కరూ చలించిపోతున్నారు. మానవత్వం లేకుండా విద్యార్థినిపై కారును ఎలా ఎక్కించారంటూ మండిపడుతున్నారు. రాజమహేంద్రవరంలో జీఎస్ఎల్ మెడికల్ కాలేజీలో డెర్మటాలజీ పీజీ చదువుతున్న ప్రియాంక (28) స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులోని ప్రసాద్ ఆదిత్య మాల్‌కు ఈ నెల 3న రాత్రి వెళ్లారని చెబుతున్నారు. అదే సమయంలో మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు మాల్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. సెక్యూరిటీ సిబ్బంది ఆ యువకులను లోపలికి అనుమతించలేదని చెబుతున్నారు. సిబ్బంది తమను అడ్డుకోవడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఆ యువకులు, మాల్ వద్ద నానా హంగామా సృష్టించడమే కాకుండా, కోపంతో వెనుదిరిగి వెళ్లే ప్రయత్నంలో మాల్ నుంచి స్కూటీపై బయటకు వస్తున్న మెడికో ప్రియాంకను ఢీకొట్టినట్లు చెబుతున్నారు. మాల్ ప్రధాన గేటు వద్ద ఒకసారి కారుతో ఢీకొట్టడమే కాకుండా, ఆమె ముందుకు వెళుతుండగా రెండుమూడు సార్లు ఢీకొట్టి ఆమె కిందపడిపోయిన తర్వాత తలపై నుంచి కారు వేగంగా నడపడంతో తీవ్రంగా గాయపడ్డారని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘోర ప్రమాదంలో ప్రియాంక తలకు తీవ్రమైన బలమైన గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి హుటాహుటిన ఆమెను స్థానిక ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఆమెను హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా, అక్కడ ఆమె పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. తలకు తీవ్ర గాయమవడంతో ఆమె బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ సేకరించారు. అత్యంత పాశవికంగా ఉన్న ఆ దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఘటనపై కేసు నమోదు చేసిన ప్రకాష్ నగర్ పోలీసులు, నిందితులు రాజమండ్రి పరిసర ప్రాంతమైన నామవరానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులుగా గుర్తించారు. నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు, ఈ ఘటనపై దర్యాప్తును మరింత తీవ్రతరం చేశారు.

# బొండా ఎందుకలా..? చంద్రబాబు భేటీ, వెంటనే వైసీపీతో ఫైటింగ్!



విజయవాడ సెంట్రల్ టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమా తీరు పొలిటికల్ గా హాట్ టాపిక్ అవుతోంది. ఇటీవల తన చుట్టూ చెలరేగిన వివాదంతో కొంతవరకు ఆత్మరక్షణకు లోనైన ఎమ్మెల్యే తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. ఇందులో ఇటీవల కాపు నేత ముద్రగడ సంస్మరణ సభకు వెళ్లిన సందర్భంలో వైసీపీ నేత అంబటి రాంబాబుతో కలవడంతోపాటు ఆ తర్వాత చోటుచేసుకున్న వివాదంపై వివరణ ఇచ్చినట్లు చెబుతున్నారు. ఇక ఎమ్మెల్యే వివరణతో సీఎం సంతృప్తి చెందినట్లు వార్తలు వెలువడగా, ఆ వెంటనే ఎమ్మెల్యే మరో వివాదంలో చిక్కుకోవడం చర్చనీయాంశం అవుతోంది. ముఖ్యమంత్రి కార్యాలయం సూచనల మేరకు బుధవారం మధ్యాహ్నం చంద్రబాబుతో ఎమ్మెల్యే బొండా భేటీ అయ్యారు. తన ఇద్దరు పిల్లలతో కలిసి చంద్రబాబు వద్దకు వెళ్లిన ఎమ్మెల్యే ముందుగా వన్ టు వన్ మాట్లాడారని, అనంతరం తన ఇద్దరు కుమారులను సీఎంకు పరిచయం చేశారని చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల తలెత్తిన వివాదాలపై వివరణ ఇచ్చారని అంటున్నారు. ఇక బొండాతో సరదాగా మాట్లాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గంలో ఇంతకు ముందులా పనిచేయాలని మార్గనిర్దేశం చేశారని చెబుతున్నారు. దీంతో తన విషయంలో అధినేత సానుకూలంగా ఉన్నట్లు భావించిన ఎమ్మెల్యే రెట్టించిన ఉత్సాహంతో బయటకు వచ్చారని చెబుతున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో గురువారం ఎమ్మెల్యే బొండా మరో వివాదంలో చిక్కుకోవడం రాజకీయంగా హీట్ పుట్టిస్తోంది. పార్టీ అంతర్గత సమస్యను చాకచక్యంగా పరిష్కరించుకున్న ఎమ్మెల్యే.. విపక్షం వైసీపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడటమే అంతుచిక్కడం లేదని అంటున్నారు. డీఎస్సీలో అక్రమాలు జరిగాయని వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేస్తుండగా, సెంట్రల్ నియోజకవర్గంలోనూ యథాతథంగా రిలే దీక్ష శిబిరం నిర్వహించింది. అయితే ఈ విషయంలో ఎమ్మెల్యే బొండా ఉమా తీవ్రంగా స్పందించడమే వివాదానికి దారితీసిందని అంటున్నారు.

వందల మంది అనుచరులను వెంట బెట్టుకుని వైసీపీ నిరసన దీక్ష శిబిరం వద్దకు వెళ్లిన ఎమ్మెల్యే బొండా ఉమా మంత్రి లోకేశ్ ను తిడుతున్నారంటూ వాదులాటకు దిగడమే హాట్ టాపిక్ అవుతోంది. విపక్షంపై ఆయన దూకుడుకు కారణం ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశం తర్వాత వచ్చిన ఉత్సాహమే అంటున్నారు. తమపై ఉమా అనుచరులు దాడి చేయడంపై మీడియాతో మాట్లాడిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు కూడా ఇదే విషయాన్ని ఎత్తిచూపడాన్ని పరిశీలకులు ప్రస్తావిస్తున్నారు. సహజంగా ఇలాంటి సంస్కృతికి వ్యతిరేకం అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెబుతుంటారని, కానీ ఇప్పుడు తమ ఎమ్మెల్యే చేసిన పనికి ఏం చెబుతారంటూ విపక్ష నేతలు ప్రశ్నించడాన్ని ఎత్తిచూపుతున్నారు.

# విమానాల్లోనూ ఈ20.. కేంద్రంపై బాంబు పేల్చిన కేజ్రీవాల్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇథనాల్ మిశ్రమ ఇంధన విధానం దేశవ్యాప్తంగా మరోసారి తీవ్ర రాజకీయ దుమారాన్ని రేపుతోంది. ఇప్పటికే సాధారణ పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ (ఈ20) కలిపి విక్రయించడంపై వాహనదారులు, ఆటోమొబైల్ నిపుణుల నుంచి అనేక సందేహాలు, విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చేసిన సంచలన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. తన అధికారిక సోషల్ మీడియా ఖాతా ద్వారా స్పందించిన అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వంపై విమర్శల దాడిని పెంచారు. తన వద్ద ఉన్న సమాచారం ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు విమానాల్లో ఉపయోగించే ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) లో కూడా ఇథనాల్ కలపడానికి సన్నాహాలు చేస్తోందని ఆయన ఆరోపించారు. విమాన ఇంధనంలో ఇథనాల్ కలపడం వల్ల విమానాల భద్రతపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడే ప్రమాదముందని విమానయాన రంగానికి చెందిన నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తన వ్యాఖ్యల్లో పేర్కొన్నారు. ప్రయాణికుల ప్రాణాలకు సంబంధించిన అత్యంత సున్నితమైన అంశంలో ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సరైంది కాదని ఆయన విమర్శించారు. సాధారణంగా ముడి చమురు దిగుమతి భారాన్ని తగ్గించుకోవడం, రైతులకు అదనపు ఆదాయం సమకూర్చడం, పర్యావరణ కాలుష్యాన్ని అదుపు చేయడం అనే సదుద్దేశాలతో కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ బ్లెండింగ్ విధానాన్ని ప్రోత్సహిస్తోంది. అయితే పెట్రోల్‌లో ఇథనాల్ శాతం పెంచడం వల్ల పాత వాహనాల ఇంజిన్లు దెబ్బతింటున్నాయని, మైలేజ్ తగ్గుతోందని ఇప్పటికే వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఇదే విధానాన్ని అత్యంత సున్నితమైన



విమానయాన రంగానికి కూడా విస్తరిస్తున్నారనే ఆరోపణలు రావడంతో ప్రయాణికుల్లో భయాందోళనలు రేకెత్తుతున్నాయి. విమానాల ఇంజిన్ భద్రత, గాలిలో ఉష్ణోగ్రతల వ్యత్యాసాలను తట్టుకునే సామర్థ్యంపై ఇథనాల్ ఎటువంటి ప్రభావం చూపుతుందోనన్న చర్చలు మొదలయ్యాయి.

ఈ ఆరోపణలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైనప్పటికీ కేంద్ర ప్రభుత్వం గానీ పౌర విమానయాన మంత్రిత్వ శాఖ గానీ ఇప్పటివరకు దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యలలో ఎంతవరకు నిజముందనే దానికి సంబంధించి తగిన ఆధారాలు లేదా ప్రభుత్వ ధృవీకరణ ఇంకా బయటకు రాలేదు. ప్రస్తుతానికి ఈ అంశం కేవలం రాజకీయ ఆరోపణలకే పరిమితమా లేక నిజంగానే ప్రభుత్వం విమాన ఇంధనంలో మార్పులపై పరిశీలన చేస్తోందా అనేది స్పష్టమవ్వాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం లేదా విమానయాన శాఖ నుంచి అధికారిక వివరణ వస్తే తప్ప ఈ గందరగోళానికి తెరపడే అవకాశం లేదు.

# రెస్టారెంట్లలో దోపిడీకి బ్రేక్.. ఫ్రీ వాటర్ రూల్ వైరల్!



మనం ఏదైనా రెస్టారెంట్‌కు వెళ్లినప్పుడు 'మినరల్ వాటరా? రెగ్యులర్ వాటరా?' అంటూ వెయిటర్లు అడగడం, చాలామంది సంకోచించి ఖరీదైన వాటర్ బాటిళ్లు కొని జేబులు ఖాళీ చేసుకోవడం నిత్యం చూస్తూనే ఉంటాం. అయితే ఈ వ్యాపార ధోరణికి చెక్ పెడుతూ మహారాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. కస్టమర్లకు ఉచితంగా, సురక్షితమైన నీటిని అందించడం వారి ప్రాథమిక హక్కు అని ప్రకటించింది. మన రాష్ట్రాల్లోనూ ఇలాంటి రూల్స్ తక్షణమే అమలు చేయాలంటూ నెటిజన్లు కోరుతున్నారు..

**బాటిల్ వాటర్ కొనాలని బలవంతం చేయకూడదు:**

ఆహార భద్రతా ప్రమాణాల చట్టం ప్రకారం ప్రతి హోటల్ మరియు రెస్టారెంట్ కస్టమర్లకు ఉచితంగా శుభ్రమైన తాగునీటిని అందించడం వారి ప్రాథమిక బాధ్యత. ఇక ఏ హోటల్ యాజమాన్యం కూడా కస్టమర్లను ఖరీదైన ప్యాకేజ్డ్ వాటర్ బాటిళ్లు కొనమని బలవంతం చేయకూడదని మహారాష్ట్ర ఎఫ్‌డీఏ కమిషనర్ తుకారాం ముండే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రెస్టారెంట్‌కు రాగానే అడగకుండానే ముందుగా ఉచిత తాగునీటిని టేబుల్‌పై ఉంచాలని సూచించారు.

**ఫ్రీ వాటర్ బోర్డులు తప్పనిసరి:**

వినియోగదారులకు తమ హక్కుల గురించి తెలియజేసేలా "ఉచిత తాగునీరు అందుబాటులో ఉంది" అనే సమాచారాన్ని ప్రతి రెస్టారెంట్ ప్రవేశ ద్వారంలో లేదా అందరికీ కనిపించేలా బోర్డుల రూపంలో ప్రదర్శించాలని మహారాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు విధించింది. ఇక దీనివల్ల కస్టమర్లు సంకోచించకుండా ఉచిత నీటిని అడిగి తీసుకునే అవకాశం ఏర్పడుతుంది.

**ఆహార భద్రతపై కఠినమైన నిబంధనలు:**

కేవలం తాగునీరే కాకుండా ఇతర ఆహార భద్రతా ప్రమాణాలపై కూడా ఎఫ్‌డీఏ ఉక్కుపాదం మోపింది. నూనె పదార్థాలను వార్తాపత్రికలలో పెట్టి ఇవ్వడాన్ని పూర్తిగా నిషేధించారు. ఇక ఫుడ్-గ్రేడ్ ప్యాకేజింగ్ మాత్రమే వాడాలని ఆదేశించారు. వంటనూనెలను పదే పదే వాడటంపై ఆంక్షలు విధించడంతో పాటు, హోటల్ సిబ్బందికి వైద్య పరీక్షలు, ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రత్యేక శిక్షణను తప్పనిసరి చేశారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు:**

ఈ కొత్త నిబంధనలను పాటించని హోటళ్లు, రెస్టారెంట్లపై వినియోగదారుల ం హక్కుల చట్టం ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని ప్రభుత్వం హెచ్చరించింది. ఆదేశాలను ఉల్లంఘించే సంస్థలకు భారీ జరిమానాలు విధించడంతో పాటు, వారి వ్యాపార లైసెన్సులు కూడా రద్దు చేస్తామని ఎఫ్‌డీఏ స్పష్టం చేసింది.

**మన దగ్గరా అమలు కావాలి:**

మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెస్టారెంట్ల దోపిడీకి అడ్డుకట్ట వేసే ఇలాంటి నిబంధనలను మన తెలుగు రాష్ట్రాల్లోనూ సమర్థవంతంగా అమలు చేయాలని, కస్టమర్లు కూడా తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని కోరుతున్నారు

ఈ ఏడాది భారత్‌లో ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలు ఆలస్యంగా ప్రవేశించాయి. అయితే వర్షాలు కురిసినప్పుడు మాత్రం అత్యంత తీవ్రస్థాయిలో కురిశాయి. ముంబయి, సూరత్‌వంటి నగరాల్లో కొద్దిరోజుల వ్యవధిలోనే నెల మొత్తానికి సరిపడా వర్షపాతం నమోదైంది. అస్సాం, ఒడిశా రాష్ట్రాల్లో తీవ్రమైన వరదలు సంభవించి, ప్రాణనష్టంతోపాటు మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇలాంటి పరిస్థితులే చైనాలోని గ్వాంగ్జీ, షాన్‌షీ, గన్సువంటి పలు ప్రావిన్సుల్లోనూ ఇటీవల కనిపించాయి. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన ఈ రెండు దేశాల్లో, ఇలాంటి తీవ్ర వాతావరణ పరిణామాలు రోజురోజుకూ సాధారణమైపోతూ, ఆర్థిక వృద్ధిని, ఆహార భద్రతను, ప్రజా సంక్షేమాన్ని ప్రమాదంలో పడేస్తున్నాయి.

వాతావరణ మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు పెరగడం, సముద్రాలు వేగంగా వేడెక్కడంవల్లే ఇలాంటి స్వల్పకాలిక, తీవ్రస్థాయి వర్షపాత ఘటనలు చోటుచేసుకుంటున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ సవాలు స్థాయిని చూస్తే, వాతావరణ స్థితిస్థాపకత అనే అంశం భారత్–చైనా సహకారానికి కొత్త వేదికగా మారే అవకాశం ఉందా? అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. వేగవంతమైన పట్టణీకరణ, చిత్తడి నేలలు, అడవులు, నీటిని ఇంకించుకునే భూతలాలు కాంక్రీటుగా మారిపోవడం –ఈ రెండు దేశాలూ దాదాపు ఒకే రకమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. మారుతున్న వాతావరణ సరళి, పాతబడిన డ్రైనేజీ వ్యవస్థలు, సరైన వ్యర్థాల నిర్వహణ లేకపోవడం, పచ్చదనం కొరత వంటివి కలిసి, నీటి నిల్వ, వరదల సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. తీరప్రాంత మహా నగరాలు తీవ్ర వర్షపాతం, తుపాను ఉప్పెనలు, సముద్ర మట్టం పెరుగుదల వంటి కలగలిపిన ముప్పులను ఎదుర్కొంటుండగా, లోతట్టు నగరాలు వేడిగాలులు, కరవు, ఆకస్మిక వరదలను వరుసగా ఎదుర్కొంటున్నాయి.

ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు శాస్త్రీయ సహకారం, సాంకేతిక ఆవిష్కరణలు, బలమైన స్థానిక పాలన, ప్రజల భాగస్వామ్యం అవసరం. ఏమీ చేయకుండా ఉంటే సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు, ఆర్థిక నష్టాలు, ఉత్పాదకత క్షీణత, ప్రజారోగ్య ప్రమాదాలు పెరిగే అవకాశం ఉంది. ఏళ్లుగా దెబ్బతిన్న సంబంధాల నేపథ్యంలో, భారత్–చైనా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు ఇప్పుడు నెమ్మదిగానైనా మెరుగుపడుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. 2026 ఏప్రిల్‌లో చైనా వాతావరణ మార్పులపై ప్రత్యేక రాయబారి నేతృత్వంలోని బృందం న్యూఢిల్లీని సందర్శించడం, వాతావరణ సహకారం ఇప్పటికీ ప్రాధాన్యతా అంశంగా ఉందని సూచిస్తోంది. హరిత సాంకేతికత, క్లిష్టమైన ఖనిజాలవంటి రంగాల్లో సహకారం ఆర్థిక పోటీ, భౌగోళిక–రాజకీయ ఉద్రిక్తతల కారణంగా సవాలుగానే మిగిలింది. అయితే, విపత్తు నివారణ, పట్టణ స్థితిస్థాపకత వంటి రంగాలు, నమ్మకాన్ని పునర్నిర్మించుకునేందుకు తక్కువ ప్రమాదకరమైన మార్గాన్ని అందించగలవు. సెంటర్ ఫర్ సోషల్ అండ్ ఎకనామిక్ ప్రోగ్రెస్ (సీఎస్ఈపీ) ఇటీవల విడుదల చేసిన ఒక పత్రం ప్రకారం, భారత్–చైనా వాతావరణ సహకారానికి గత చరిత్రలో పూర్వాపరాలు ఉన్నాయి. 1990ల ప్రారంభం నుంచి 2020 వరకూ, వాతావరణ మార్పులపై ఆచరణాత్మక సహకారం కోరుతూ అనేక

## వాతావరణ వారధి!

శిఖరాగ్ర స్థాయి ఉమ్మడి ప్రకటనలు, ఒప్పందాలు, అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) కుదిరాయి. వరదలు, భూకంపాలు, కరవువంటి వాతావరణ ప్రేరిత విపత్తులపై ఉమ్మడి పరిశోధన, జల, సముద్ర, భూకంప సంబంధిత డేటా పంచుకోవడం, పాలనా విధానాల మార్పిడి వంటివి ఈ ఒప్పందాల్లో భాగంగా ఉన్నాయి. ఢిల్లీ–బీజింగ్, ముంబై–షాంఘై, చెన్నై–చాంగ్‌కింగ్ నగరాల మధ్య కుదిరిన సోదర నగరాల ఒప్పందాల ద్వారా, ఈ రంగాల్లో ఉమ్మడి ప్రాజెక్టుల ఆచరణాత్మక అమలుకు అధికారికంగా అంగీకారం కుదిరింది. అయితే, దౌత్యపరమైన సంబంధాల్లో ఏర్పడిన అంతరాయాల కారణంగా, క్షేత్రస్థాయిలో ఆచరణ మాత్రం స్వల్పంగానే మిగిలింది.

పట్టణ, గ్రామీణ ప్రణాళిక, పెట్టుబడి నిర్ణయాల్లో స్థితిస్థాపకతను ప్రధాన అంశంగా చేర్చడం ఎంత ముఖ్యమో చైనా అనుభవం చూపిస్తోంది. రవాణా, గృహనిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థల్లో డేటా ఆధారిత విధానాలను వినియోగించడం ఇందులో భాగం. మరోవైపు, భారత్ బలం అనుకూల పాలనలో ఉంది. బలహీన వర్గాలకు లక్షిత జోక్యాల కోసం సమాజ–నేతృత్వ వ్యూహాలను ముందుండి నడిపించడంలో భారత్ ముందంజలో ఉంది. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, హీట్ యాక్షన్ ప్లాన్లు, కూల్ రూఫ్‌లు, ప్రకృతి ఆధారిత పరిష్కారాల్లో భారత్ విజయాలు సాధించింది. అహ్మదాబాద్ హీట్ యాక్షన్ ప్లాన్, చెన్నై వాటర్ రెసిలియెన్స్ స్ట్రాటజీ, ముంబయి క్లైమేట్ యాక్షన్ ప్లాన్ వంటివి ఇందుకు నిదర్శనం. మున్సిపల్ ప్రభుత్వాల అధికారులు, స్పాంజ్ సిటీలు, డ్రైనేజీ ఆధునికీకరణ, వ్యర్థాల నిర్వహణ వంటి పట్టణ డిజైన్ అంశాలపై విజ్ఞాన, విధాన మార్పిడికి దోహదపడగలరు. పట్టణ సమస్యలకే పరిమితం కాకుండా, గ్రామీణ జీవనోపాధి, ఆహార భద్రత కోసం స్థితిస్థాపక వ్యవసాయ పద్ధతులు కూడా పరస్పర అభ్యసనానికి కీలక అంశాలుగా మారనున్నాయి. ఇరు దేశాలు పంచుకుంటున్న హిమాలయ పర్యావరణ వ్యవస్థలో మంచు కరుగుతున్న సమస్యను పరిష్కరించడం అత్యంత కీలకమైన అంశంగా మిగిలింది. నీటి వనరుల విషయంలో గతంలో ఒప్పందాలు కుదిరినా, 2022లో అవి నిలిచిపోయాయి. వాతావరణ అనుకూలనకు ప్రధాన అడ్డంకిగా నిధుల కొరత మిగిలిపోయింది. రెండు దేశాలూ తమ విధానాల అమలుకు ప్రధానంగా ప్రభుత్వ నిధులపైనే ఆధారపడుతున్నాయి. ఈ అంతరాన్ని పూడ్చేందుకు, బ్లెండెడ్ ఫైనాన్స్, మున్సిపల్ బాండ్లు, క్రెడిట్ ఎన్‌హాన్స్‌మెంట్ వంటి సాధనాల ద్వారా ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. ఇలాంటి సహకారం ఇరు దేశాలకే కాకుండా, గ్లోబల్ సౌత్ దేశాలకు కూడా బలమైన ప్రమాణాలు, కొలమానాలు, ఆర్థిక వ్యవస్థల ద్వారా వాతావరణ స్థితిస్థాపక నిబంధనలను రూపొందించే అవకాశాన్ని కల్పిస్తుంది. వాతావరణ మార్పు ప్రభావం జాతీయ సరిహద్దులను దాటి విస్తరిస్తోంది. ఐరోపా వేడిగాలుల నుంచి ఆసియా భారీ రుతుపవన వరదల వరకూ ఇది కనిపిస్తోంది. మరింత సమన్వయం, సహకారం, భారత్–చైనాలకు తక్కువ ప్రమాదంతో కూడిన, ఇరు దేశాలకూ లబ్ధి చేకూర్చే సహకార మార్గాన్ని అందించగలవు!

# కమలానికి మింగుడుపడని కథ!



బిహార్‌లోని బంకిపూర్ అసెంబ్లీ స్థానంలో బీజేపీ చవిచూసిన అనూహ్య ఓటమి; మధ్యప్రదేశ్‌లోని దహియాలో పార్టీ కోల్పోయిన సీటు; గుజరాత్‌లోని మంజల్‌పూర్‌లో బాగా తగ్గిన మెజారిటీతో దక్కించుకున్న గెలుపు –ఇటీవలి ఉప ఎన్నికల ఫలితాలను చూస్తే, యువ ఓటర్లలో బీజేపీపై నమ్మకం సన్నగిల్లుతున్న సంకేతాలు స్పష్టం. అయితే ఈ హెచ్చరిక కేవలం బీజేపీకే పరిమితం కాదు.. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకూ ఓటర్లు స్పష్టమైన సందేశాన్నే పంపారు. దేశ యువత రాజకీయాల పట్ల భ్రమలు వీడుతోంది, ఇక వారి ముందు రెండే మార్గాలు మిగిలాయి –రాణించడం లేదా కనుమరుగవడం. అయితే, ప్రస్తుతం కేంద్రంలో, చాలా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీకి ఈ సంకేతాలు మరింత ఆందోళనకరం. ఎందుకంటే అధికారంలో ఉన్న పార్టీపైనే ప్రజావ్యతిరేకత ఎక్కువగా ప్రతిబింబిస్తుంది. బంకిపూర్‌లో బీజేపీ ఓటమి అనేక కారణాల రీత్యా ప్రాధాన్యం సంతరించుకుంది. ఆ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న నితిన్ నబిన్, బీజేపీ జాతీయ అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు రాజీనామా చేయడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఒకప్పుడు బీజేపీకి పోల్ వ్యూహకర్తగా పనిచేసిన ప్రశాంత్ కిషోర్, ఇప్పుడు తన సొంత జన్ సురాజ్ పార్టీ తరఫున బరిలో దిగడంతో, ఈ ప్రతిష్ఠాత్మక పోరులో గెలుపు కోసం బీజేపీ తన వనరులన్నింటినీ రంగంలోకి దించింది. మూడు దశాబ్దాలకు పైగా, అత్యంత ప్రతికూల పరిస్థితుల్లో కూడా బీజేపీ అభ్యర్థినే ఎన్నుకున్న ఈ పట్టణ ప్రధాన నియోజకవర్గంలో, ఇది ఒక చారిత్రక ఓటమిగా నిలిచింది. దీర్ఘకాల మిత్రపక్షం జేడీ(యూ) నుంచి ముఖ్యమంత్రి పదవిని దక్కించుకుని, నితీశ్ కుమార్‌ను రాష్ట్ర రాజకీయాల నుంచి పక్కకు నెట్టిన తర్వాత జరిగిన తొలి ఎన్నిక కూడా ఇదే కావడం విశేషం. గణాంకాలే ఈ ఓటమి తీవ్రతను చెబుతున్నాయి.

2025లో 51,936 ఓట్ల మెజారిటీతో గెలిచిన ఈ స్థానంలో, ఈసారి బీజేపీ దాదాపు 19,000 ఓట్ల తేడాతో పరాజయం పాలైంది. కేవలం 34 శాతం మాత్రమే నమోదైన ఓటింగ్ శాతం, గత అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన 41 శాతం కంటే గణనీయంగా తక్కువ కావడం కూడా గమనార్హం. తక్కువ ఓటింగ్ శాతం సాధారణంగా అధికార పార్టీకి ప్రతికూలంగా మారే అవకాశం ఉంటుందని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. పోలింగ్‌కు ముందు తమ పార్టీ మద్దతుదారులను పోలీసులు అక్రమంగా నిర్బంధించారని ప్రశాంత్ కిషోర్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం కూడా వివాదాస్పదమైంది. ఏదేమైనా, ప్రతి కారణం కూడా కాషాయ పార్టీకి తగిలిన ఈ దెబ్బను మరింత తీవ్రతరం చేసింది.

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ చేతిలో బీజేపీ ఓటమి, ఆ రాష్ట్రంలో మోహన్ యాదవ్ ప్రభుత్వంపై తగ్గుతున్న ప్రజాదరణకు సంకేతంగా నిలిచింది. అయితే ఇది గతంలో బీజేపీ ప్రాతినిధ్యం వహించిన స్థానం కాదు. ఈ ఉప ఎన్నికలో బీజేపీ, కాంగ్రెస్ రెండూ అంతర్గత విభేదాలను ఎదుర్కొన్నా, చివరికి ఫలితాలు మాత్రం ప్రతిపక్షానికే అనుకూలంగా వచ్చాయి. అభ్యర్థుల ఎంపికలో స్థానిక నాయకత్వం మధ్య తలెత్తిన విభేదాలు ఫలితాలపై కొంతమేర ప్రభావం చూపినా, అంతిమంగా ఓటర్లు అధికార పార్టీపైనే తమ అసంతృప్తిని ప్రదర్శించారన్నది వాస్తవం. ముఖ్యమంత్రి అభ్యర్థుల విషయంలో బీజేపీ కొత్త ముఖాలతో ప్రయోగాలు చేస్తున్నా, "డబుల్ ఇంజిన్" అభివృద్ధి నినాదం ఆ రాష్ట్రంలో కనీసం తన ప్రభావాన్ని కోల్పోయినట్టు కనిపిస్తోంది. రాష్ట్రంలో తాను ఇంకా పోరాట శక్తిగా నిలిచి ఉన్నామన్న సంకేతం కాంగ్రెస్‌కు ఒక ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. 2028లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధమయ్యేందుకు కొంత సమయాన్నీ కల్పిస్తుంది. ఈ చిన్న విజయం కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపే అవకాశం ఉంది, అయితే దీర్ఘకాలిక వ్యూహం లేకుండా ఈ ఊపును కొనసాగించడం సాధ్యం కాదని పార్టీ నేతలు గుర్తుంచుకోవాలి. అయితే, బీజేపీకి అత్యంత నిరుత్సాహకరమైన ఫలితం వచ్చే ఏడాది జరగనున్న గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు, మంజల్‌పూర్ ఉప ఎన్నికలో నమోదైంది. ఆ స్థానాన్ని బీజేపీ నిలబెట్టుకున్నప్పటికీ, గెలుపు మార్జిన్ మాత్రం భయపెట్టే సంకేతాన్నే ఇస్తోంది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో 1,00,754 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచిన ఈ స్థానంలో, ఇప్పుడు ఆ మెజారిటీ కేవలం 30,630కి పడిపోయింది. అంటే మెజారిటీ మూడో వంతు కంటే తక్కువకు కుంచించుకుపోయింది. గుజరాత్ వంటి బీజేపీ కంచుకోటలో సైతం ఇలాంటి క్షీణత కనిపించడం పార్టీ నాయకత్వానికి ఆందోళన కలిగించే అంశమే. క్షేత్రస్థాయిలో గట్టిగా శ్రమించకపోతే, వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ఓట్ల క్షీణతను భర్తీ చేసుకోవడం బీజేపీకి కష్టతరమే!

జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన ఉద్యమం సాధించిన విజయం, అన్ని రాజకీయ పార్టీలకూ ఒక స్పష్టమైన సందేశాన్నే పంపింది. నేటి యువ తరం రాజకీయ నేతల హామీలపైనే ఆధారపడి జీవించేందుకు సిద్ధంగా లేదు; తమ జీవితాలపై సానుకూల ప్రభావం చూపే వాస్తవ చర్యలను వారు కోరుకుంటున్నారు. ఇటీవలి బై పోల్ ఫలితాలు ఈ మార్పును మరింత స్పష్టం చేస్తున్నాయి. ఓటర్లు, ముఖ్యంగా యువత, పార్టీల నినాదాలకు, వాగ్దానాలకు అతీతంగా ఆలోచిస్తున్నారని రుజువవుతోంది. బంకిపూర్‌లో వచ్చిన ఓటమి కేవలం ఒక స్థానిక సమస్యగా కొట్టిపారేయలేనిది. మూడు దశాబ్దాలుగా తిరుగులేని కంచుకోటగా నిలిచిన స్థానంలో ఇలాంటి ఫలితం రావడం, పార్టీ అంతర్గత వ్యూహాన్ని పునఃసమీక్షించుకోవాల్సిన అవసరాన్ని చాటుతోంది. మధ్యప్రదేశ్, గుజరాత్ ఫలితాలు కూడా ఇదే కథను వేర్వేరు కోణాల్లో చెబుతున్నాయి. అభివృద్ధి నినాదాలు, డబుల్ ఇంజిన్ వాగ్దానాలు ఇకపై ఓటర్లను ఆకట్టుకోలేకపోతున్నాయని స్పష్టమవుతోంది. ఉపాధి కల్పన, విద్యా వ్యవస్థ మెరుగుదల, యువత వలసలను నివారించడం వంటి వాస్తవ సమస్యలపై దృష్టి సారించాలని ఓటర్లు కోరుకుంటున్నారని ఈ ఫలితాలు స్పష్టంగా చాటుతున్నాయి. రాబోయే గుజరాత్, మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ హెచ్చరిక సంకేతాలు బీజేపీకి ఒక కీలక పాఠంగా నిలవాలి. క్షేత్రస్థాయి పనితీరు, వాస్తవిక అభివృద్ధి ఫలితాలు లేకుండా, కేవలం నినాదాలతో ఓటర్లను ఆకట్టుకోలేమని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీలు కూడా ఈ ఫలితాల నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. కేవలం అధికార పార్టీ వైఫల్యాలపైనే ఆధారపడకుండా, తమదైన సానుకూల ఎజెండాతో ఓటర్లను ఆకట్టుకోవాల్సిన సవాలు వారి ముందు కూడా ఉంది. చివరిగా, మార్పు కోసమో, పర్యవసానాలు ఎదుర్కోవడం కోసమో నిర్ణయం తీసుకోవాల్సింది రాజకీయ పార్టీలే. రాణించడం లేదా కనుమరుగవడం అనే రెండు మార్గాల మధ్య ఎంపిక చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైనట్టే!! ■

### పనికొచ్చే పలుకు



## ఆ భ్రమలనుంచి బయటపడితేనే..

మన గెలుపు, ఓటముల గురించి ఆలోచించే తీరిక చుట్టూ ఉన్న ప్రపంచానికి ఏమాత్రం లేదు. ప్రతి ఒక్కరూ తమ తమ జీవితాల్లో, తమ సమస్యల్లో నిమగ్నమై ఉంటారు. మనం చేసే తప్పులను, మనం అనుభవించే వైఫల్యాలను ఎవరో నిశితంగా గమనిస్తున్నారన్న భావన, వాస్తవానికి మన మనసు సృష్టించుకున్న ఒక భ్రమ మాత్రమే. ఈ నిజాన్ని గుర్తించినప్పుడే, మనిషి తనలోని అసలైన శక్తిని బయటకు తీసుకురాగలడు.

"ప్రజలు ఏమనుకుంటారో" అనే భయం మనిషిని అడుగడుగునా వెనక్కి లాగుతుంది. కొత్త ప్రయత్నం చేయాలన్నా, భిన్నమైన మార్గంలో నడవాలన్నా, "విఫలమైతే అందరూ నవ్వుతారు" అనే ఆలోచనే మొదటి అడ్డంకిగా నిలుస్తుంది. కానీ వాస్తవం ఏమిటంటే, ఎవరూ మన వైఫల్యాన్ని అంతగా పట్టించుకోరు, ఎందుకంటే ప్రతి ఒక్కరూ తమ సొంత జీవితపు పోరాటాల్లో మునిగి ఉంటారు. ఈ సత్యాన్ని అర్థం చేసుకున్న క్షణం నుంచే, మనిషి స్వేచ్ఛగా, ధైర్యంగా ముందడుగు వేయగలుగుతాడు.

ఈ మార్పు జీవనశైలిపై అద్భుతమైన ప్రభావం చూపుతుంది. ప్రపంచం చూస్తోందన్న భయం తగ్గినప్పుడు, కొత్త విషయాలు నేర్చుకోవడానికి, కొత్త రంగాల్లోకి అడుగుపెట్టడానికి మనసు సిద్ధమవుతుంది. వైఫల్యాన్ని ఒక ముగింపుగా కాకుండా, ఒక పాఠంగా చూసే దృక్పథం అలవడుతుంది. ఒక ప్రాజెక్టు విఫలమైనా, ఒక పరీక్షలో తప్పినా, ఒక వ్యాపారం నష్టపోయినా – అవన్నీ చివరి అధ్యాయాలు కావు, కొత్త ప్రయాణానికి పునాదులు మాత్రమే. ఈ అవగాహన కలిగినప్పుడు, ప్రతి పతనం తర్వాత లేచి నిలబడే శక్తి దానంతట అదే వస్తుంది. పని పట్ల నిమగ్నత పెరుగుతుంది, ఎందుకంటే బయటి అభిప్రాయాలపై దృష్టి పెట్టే బదులు, తన లక్ష్యంపైనే శక్తినంతా కేంద్రీకరించగలుగుతారు.

ప్రఖ్యాత రచయిత థియోడర్ రూజ్‌వెల్ట్ చెప్పిన మాటలు ఈ సందర్భంలో గుర్తుచేసుకోదగినవి – వాస్తవంగా బరిలో దిగి పోరాడేవాడి గురించే గుర్తుంచుకోవాలని, పక్కన నిలబడి విమర్శించేవారి మాటలకు విలువ లేదని ఆయన అభిప్రాయపడ్డారు. అంటే, నిజమైన గౌరవం దక్కేది ప్రయత్నించే వారికే తప్ప, పక్కనుంచి విమర్శించే వారికి కాదు. ఇదే భావననే తెలుగు నీతి పద్యాలు కూడా చాటిచెప్పాయి. వేమన శతకంలో "ఓడిన వాడు మరల ప్రయత్నించునే గాని, జారిపడిన చోటనే కూర్చుండడు" అనే భావన పలుమార్లు ప్రస్తావితమవుతుంది – పడిన ప్రతిసారీ లేచి నిలబడటమే నిజమైన ధైర్యమని ఈ పద్యాలు బోధిస్తాయి. "లోకుల మాటలు విని తన పని మానుకొనువాడు, తన బతుకు తానే చెరచుకొనును" అనే నీతి వాక్యం కూడా, పరుల మాటలకు భయపడి తన లక్ష్యాన్ని విడిచిపెట్టే వారి గురించి హెచ్చరిస్తుంది. కాబట్టి, ఏదైనా కొత్త ప్రయత్నం చేయాలనుకున్నప్పుడు, "నలుగురూ ఏమనుకుంటారో" అనే ఆలోచనను పక్కనపెట్టాలి. ప్రపంచం మన గెలుపు ఓటములను లెక్కపెట్టుకుంటూ కూర్చోదు – అది తన పనిలో నిమగ్నమై ఉంటుంది. ఈ వాస్తవాన్ని గుర్తుంచుకుని, వైఫల్యం నుంచే విజయం వైపు ధైర్యంగా అడుగులు వేయడం అలవాటు చేసుకోవాలి. ప్రతి పతనం ఒక ముగింపు కాదు, అది విజయానికి దారితీసే మలుపు మాత్రమే. ఈ దృక్పథమే జీవితంలో నిజమైన స్వేచ్ఛను, నిజమైన శక్తిని అందిస్తుంది.



నొప్పి కలిగించేది ఎదుటివారి తప్పు కాదు, ఆ తప్పు చుట్టూ మనం అల్లుకునే ఊహల వల. అదే మనసును మరింత గాయపరుస్తుంది. కథలల్లడం మాని, జరిగిందేమిటో నిజాయితీగా చూడగలిగినప్పుడే మనసుకు నిజమైన నిశ్శబ్దం లభిస్తుంది. అలజడిలో తీసుకునే నిర్ణయం ఎప్పుడూ అసంపూర్ణమే, నిదానంలో పుట్టిన ఆలోచనే స్పష్టతనిస్తుంది. కెరటం చెలరేగినప్పుడే సముద్రాన్ని అంచనా వేయకూడదు, అది సద్దుమణిగాకే లోతు తెలుస్తుంది. అలాగే మనసుకు కూడా - ఆవేశం తగ్గాకే అసలు సత్యం కనిపిస్తుంది, సరైన దారి తడుతుంది.

-మహాదేవ

### వింతల్లో వింతలు

## చెస్ట్ ఫెయిరింగ్ వివాదం



మహిళల టూర్ డి ఫ్రాన్స్ సైక్లింగ్ పోటీలో వింత వివాదం చెలరేగింది. వేగం పెంచుకునేందుకు కొందరు సైక్లిస్టులు బ్రాలలో ప్యాడింగ్ వాడుతున్నారని ఆరోపణలు వచ్చాయి. "చెస్ట్ ఫెయిరింగ్" అని పిలిచే ఈ పద్ధతి వల్ల శరీరం చుట్టూ గాలి ప్రవాహం మారి, గాలి నిరోధకత తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. హెరియట్–వాట్ యూనివర్సిటీ ఏరోడైనమిక్స్ ప్రొఫెసర్ బర్ట్ బ్లోకెన్ ప్రకారం, ఈ టెక్నిక్ డ్రాగ్‌ను 3.6 శాతం వరకూ తగ్గించగలదు. చిన్న శాతంగా అనిపించినా, క్షణాల తేడాతో విజేతలు నిర్ణయమయ్యే ఈ క్రీడలో ఇది అనుచిత లాభంగా పరిగణిస్తున్నారు. దీంతో నిర్వాహకులు ఆగస్టు 4న అదనపు దుస్తుల తనిఖీలు చేపట్టారు, నిబంధనలను మరింత కఠినతరం చేశారు.

# చికెన్‌లో నిమ్మరసం పిండుకుంటే..



చికెన్‌లో నిమ్మరసం పిండుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై చాలామందికి అనుమానాలున్నాయి. అయితే నిపుణుల అభిప్రాయం ప్రకారం.. చికెన్‌లో నిమ్మరసం కలుపుకోవడం ఆరోగ్యానికి మంచిది. నిమ్మలోని ఆమ్లత్వం చికెన్‌లోని ప్రొటీన్లను విచ్ఛిన్నం చేసి మాంసాన్ని మరింత మృదువుగా చేస్తుంది. సిట్రిక్ యాసిడ్ వల్ల ప్రొటీన్లు చిన్న కణాలుగా విడిపోయి, చికెన్ త్వరగా జీర్ణం అవ్వడానికి తోడ్పడుతుంది. చికెన్.. అనగానే.. నాన్‌వెజ్ ప్రియులు లొట్టలేసుకుంటూ మరి తింటారు.. చికెన్ లో ప్రొటీన్ తోపాటు ఎన్నో పోషకాలు దాగున్నాయి. అయితే.. చికెన్ కాంబినేషన్ విషయంలో జాగ్రత్తగా ఉండాలంటూ డైటీషియన్లు తరచూ హెచ్చరిస్తుంటారు. కోడి మాంసంతో కలిపి కొన్ని పదార్థాలను తినకూడదని.. దీనివల్ల అనారోగ్య సమస్యలు తలెత్తవచ్చని పేర్కొంటున్నారు. అయితే.. చికెన్‌లో నిమ్మకాయ రసం పిండుకోవచ్చా లేదా అనే అనుమానం చాలామందిలో ఉంటుంది. చికెన్‌ను వండే ముందు మసాలాలు కలిపేటప్పుడు లేదా వండిన తర్వాత తినే సమయంలో నిమ్మరసాన్ని తరచుగా వాడుతుంటారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, చికెన్‌లో నిమ్మరసం పిండుకోవడం ఆరోగ్యానికి మంచిదే కాకుండా, అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ముఖ్యంగా, చికెన్‌లో నిమ్మరసం కలుపుకోవడం వల్ల అందులోని ఆమ్లత్వం ప్రొటీన్లను విచ్ఛిన్నం చేస్తుంది. నిమ్మలోని సిట్రిక్ యాసిడ్ కారణంగా ప్రొటీన్లు చిన్న చిన్న కణాలుగా విడిపోవడంతో, చికెన్ మరింత మృదువుగా తయారవుతుంది. ఇది ఆహారం తీసుకున్న తర్వాత చికెన్ త్వరగా జీర్ణం అవ్వడానికి గణనీయంగా ఉపయోగపడుతుంది. చికెన్ తినేటప్పుడు కొందరు జీర్ణ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటుంటారు. నిమ్మరసం పిండుకొని తినడం వల్ల ఈ సమస్యల నుంచి బయటపడవచ్చు. కొంతమంది చికెన్‌ను స్కిన్‌తో సహా తినడానికి ఇష్టపడతారు. అలాంటి వారికి కూడా నిమ్మరసం ప్రయోజనకరంగా ఉంటుంది. చికెన్ స్కిన్ నుంచి వచ్చే కొవ్వును సమతుల్యం చేయడంలో నిమ్మరసం సహాయపడుతుంది, తద్వారా శరీరంలో కొలెస్ట్రాల్ పెరగకుండా నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అదనంగా, చికెన్‌ను వండే ముందు మేరినేట్ చేసేటప్పుడు నిమ్మరసం కలుపుతారు. ఇది చికెన్ సరిగ్గా ఉడకడానికి దోహదపడుతుంది. నిమ్మలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుందనే విషయం అందరికీ తెలిసిందే. ఈ విటమిన్ సి, ఆహారం నుండి ఐరన్‌ను గ్రహించడానికి శరీరానికి అత్యవసరం. చికెన్‌లో లీన్ ప్రొటీన్, విటమిన్స్ బీ6, బీ12, ఐరన్ వంటి ఖనిజాలు ఉంటాయి. కాల్షియం కూడా చికెన్‌లో ఉంటుంది. వీటిని శరీరం సమర్థవంతంగా గ్రహించడానికి విటమిన్ సి అవసరం. అందువల్ల, చికెన్‌లో నిమ్మరసం కలుపుకోవడం వల్ల పోషక విలువలు మరింత పెరుగుతాయి. మొత్తంగా చూస్తే, చికెన్‌లో నిమ్మరసం కలుపుకోవడం వల్ల ఎలాంటి ప్రతికూల ప్రభావాలు ఉండవని, బదులుగా మాంసం మృదువుగా మారడం, జీర్ణక్రియ మెరుగుపడటం, కొలెస్ట్రాల్ నియంత్రణ, పోషకాల శోషణ పెరగడం వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలే కలుగుతాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# సవాళ్లను ఎదుర్కొంటేనే విజయం?



ప్రతిరోజూ ఉదయం నిద్రలేవగానే ఆ రోజు పూర్తి చేయాల్సిన పనుల గురించి మన మెదడు ఒక ప్రణాళికను సిద్ధం చేసుకుంటుంది. లక్ష్యం చిన్నదైనా పెద్దదైనా ఒకసారి నిర్ణయం తీసుకున్న తర్వాత విజయం లభించే వరకు అదే ఉత్సాహాన్ని, పట్టుదలను కొనసాగించడం చాలా ముఖ్యం. అప్పుడే మనం అనుకున్న గమ్యాన్ని చేరుకోగలం. జీవితంలో అడ్డంకులు ఎదురవ్వడం సహజం, మనం ఒకటి తలిస్తే దైవం మరొకటి తలచినట్లు పరిస్థితులు తారుమారు కావచ్చు. అటువంటి సమయాల్లో నిరాశ చెందకుండా పట్టుదలతో పోరాడి చిన్న అవకాశాన్ని కూడా వదులుకోకుండా ముందుకు సాగాలి. ఓటమి అంచుల్లో ఉన్నప్పుడు కూడా ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే విజయం మన సొంతం అవుతుంది. జీవితంలో విజయం సాధించాలంటే కేవలం కలలు కనడం సరిపోదు, వాటిని నిజం చేసుకునే క్రమంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి. ఒక్కోసారి పరిస్థితులు అనుకూలించక అలసట కలగవచ్చు, కానీ ఆ సమయంలోనే మనలోని అంతర్గత శక్తిని బయటకు తీయాలి. గోమతి అనే మహిళ జీవితంలో జరిగిన సంఘటన దీనికి చక్కని ఉదాహరణగా నిలుస్తుంది.

ఆమె 1979లో మదురై కామరాజ్ యూనివర్సిటీలో డిగ్రీలో చేరారు. ఉత్సాహంగా చదువు మొదలుపెట్టిన కొద్ది రోజులకే అనారోగ్య సమస్యల వల్ల చదువు ఆపేయాల్సి వచ్చింది. ఒక ఏడాది వృథా అయిందని బాధపడుతున్న సమయంలో, యూనివర్సిటీ నుండి పొరపాటున వచ్చిన ఒక పరీక్షా దరఖాస్తు ఆమె జీవితాన్ని మార్చేసింది. ఆ అవకాశాన్ని వదులుకోకుండా భర్త అనుమతితో కేవలం మూడు నెలల కఠోర శ్రమతో పరీక్షలు రాసి విజయం సాధించారు. ఫలితంగా ఆమె అనుకున్నట్లుగానే పట్టభద్రురాలిగా గుర్తింపు పొందారు. మనకు ఎటువంటి ప్రతిభ లేదని చాలామంది ఫిర్యాదు చేస్తుంటారు, కానీ ప్రతి మనిషిలోనూ ఒక ప్రత్యేకమైన ప్రతిభ దాగి ఉంటుంది. దానిని గుర్తించి అంకితభావంతో కృషి చేస్తే లక్ష్యం మన చెంతకు చేరుతుంది. ఏదైనా పనిని ప్రారంభంలో కష్టంగా అనిపించినా ఇష్టంతో చేయడం మొదలుపెడితే అందులో వేగంగా పురోగతి సాధించవచ్చు. లక్ష్య సాధనలో సమయం చాలా విలువైనది, అన్ని పనులను మనమే చేయాలని అనుకోకుండా బాధ్యతలను పంచుకోవడం వల్ల సమయం ఆదా అవుతుంది. జీవిత ప్రయాణంలో మనం తప్పుడు మార్గంలో వెళ్తున్నామని తెలిసిన వెంటనే సరిదిద్దుకోవాలి. తప్పుడు బస్సు ఎక్కామని తెలిసినప్పుడు తదుపరి స్టాప్‌లోనే దిగిపోవడం తెలివైన పని, లేదంటే మరింత సమయం వృథా అవుతుంది. అలాగే శారీరక దృఢత్వం కోరుకునే వారు బ్రహ్మ ముహూర్తంలో నిద్రలేచి నడకను అలవాటు చేసుకోవాలి. అది ఇంటిని శుభ్రం చేయడం వంటి చిన్న పని అయినా, ఇల్లు కట్టడం వంటి పెద్ద పని అయినా ఏకాగ్రతతో చేస్తే విజయం లభిస్తుంది. మీ లక్ష్యంపై దృష్టి సారించి ప్రపంచాన్ని జయించండి. నిరంతర కృషి, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడమే మిమ్మల్ని ఉన్నత స్థానంలో నిలబెడతాయి. మీ ప్రతిభను నమ్మి ఇష్టంతో పని చేయండి, విజయం మీ ముంగిట ఉంటుంది.

# జీన్స్‌ను ఎన్ని రోజులకోసారి ఉతకాలి



జీన్స్ ఒక స్టైలిష్, సౌకర్యవంతమైన వస్త్రం. పురుషులు, మహిళలూ.. చిన్నా పెద్దా అంతా జీన్స్ ను ఇష్టంగా ధరిస్తారు.. అయితే, వాటిని ఎప్పుడు ఉతకాలో చాలా మందికి గందరగోళంగా ఉంటుంది. జీన్స్.. జీన్స్.. జీన్స్.. చిన్నా పెద్దా అందరూ ఇష్టపడే.. స్టైలిష్, సౌకర్యవంతమైన వస్త్రం.. ఈ రోజుల్లో జీన్స్ కేవలం ఒక దుస్తువు మాత్రమే కాకుండా.. అవి ప్రతి ఒక్కరి దైనందిన జీవనశైలిలో ఒక అంతర్భాగంగా మారాయి. కాలేజీ అయినా, ఆఫీసు అయినా, లేదా సాధారణంగా బయటకు వెళ్ళినా, సరిగ్గా సరిపోయే ఒక జీన్స్ ప్యాంటు ప్రతి సందర్భంలోనూ స్టైల్, సౌకర్యం రెండింటినీ అందిస్తుంది. కానీ వాటిని తరచుగా లేదా తప్పుగా ఉతకడం అందరూ చేసే సాధారణ పొరపాటు.. ఇలా చేయడం వల్ల జీన్స్ దుస్తులు ముందుగానే చినిగిపోతాయి.. లేదా రంగు మారి పాలిపోయి కనిపిస్తుంది. చాలా మంది జీన్స్ వేసుకున్న ప్రతిసారీ ఉతకాలని అనుకుంటారు.. మరికొందరు వారాలు లేదా నెలల తరబడి వాటిని ఉతకకుండా ఉంటారు. నిజం ఏమిటంటే, జీన్స్ మన్నిక, ఫిట్, రంగును కాపాడుకోవడానికి వాటిని సరైన పద్ధతిలో జాగ్రత్తగా చూసుకోవడం, సరైన సమయంలో ఉతకడం చాలా కీలకం.. జీన్స్ ఇతర దుస్తుల కంటే చాలా దృఢంగా ఉంటాయి.. కానీ అంతమాత్రాన వాటిని ఎలా పడితే అలా ఉతకకూడదు. పదేపదే ఉతకడం వల్ల రంగు వెలిసిపోవడం, బట్ట వదులుగా మారడం, సరిగ్గా సరిపోకపోవడం జరగవచ్చు. నిజానికి, జీన్స్‌ను ఎప్పుడు ఉతకాలి అనేది.. మీరు వాటిని ఎంత తరచుగా ధరిస్తారు, వాతావరణం, మీరు వాటిని ఎంతగా వాడుతున్నారు వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఈ విషయంలో చాలా మంది ఫ్యాషన్ నిపుణులకు భిన్నమైన అభిప్రాయాలు ఉన్నప్పటికీ, బ్రిటిష్ ఫ్యాషన్ డిజైనర్, వ్యాపారవేత్త టామ్ ఫ్రాన్స్ ఒక ఇంటర్వ్యూలో తాను తన జీన్స్‌ను 20 సార్లు ధరించిన తర్వాత ఉతుకుతానని పేర్కొన్నారు. సాధారణంగా, జీన్స్‌ను 10 నుండి 12 సార్లు ధరించిన తర్వాత ఉతకాలి. అయితే, మేము ఇప్పటికే చెప్పినట్లుగా, మీరు జీన్స్ ధరించే కాలం కూడా ముఖ్యమైనదే. మీరు చాలా వేడిగా లేదా చెమట ఎక్కువగాఉండే

ఉండే ప్రాంతంలో ఉన్నట్లయితే, వాటిని 2 నుండి 3 సార్లు ధరించిన తర్వాత ఉతకడం ఉత్తమం. శీతాకాలంలో, మీరు జీన్స్‌ను 7 నుండి 8 సార్లు ధరించిన తర్వాత ఉతకవచ్చు. తరచుగా ఉతకడం వల్ల రంగు వెలిసిపోవడానికి, బట్ట వదులుగా మారడానికి కారణమవుతుందని గుర్తుంచుకోండి.. కాబట్టి అవసరమైనప్పుడు మాత్రమే వాటిని ఉతకడం ఉత్తమం.



# మంచి జీవనశైలితో పూడికలకు కళ్లెం

గుండెపోటు, పక్షవాతం బారినపడకూడదని అనుకుంటున్నారా? అయితే కంటి నిండా నిద్రపోయేలా చూసుకోండి. అలాగే తగినంత శారీరక శ్రమ, వ్యాయామం కూడా చేయండి. ఇవి రక్తనాళాల్లో పూడికలకు దారితీసే వాపుప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) అదుపులో ఉండటానికి గణనీయంగా తోడ్పడుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు.

కణాలు విభజన చెందేటప్పుడు, కొన్నిసార్లు వాటి డీఎన్‌ఏలో మార్పులు జరుగుతుంటాయి. ఇవి కణాలను వేగంగా వృద్ధి చెందేలా, మామూలు కణాల కన్నా మార్పులతో కూడిన కణాల సంఖ్య పెరిగేలా చేస్తుంటాయి. వయసు మీద పడుతున్నకొద్దీ రక్త, రోగనిరోధక కణాలు పుట్టుకొచ్చే మూలకణాల్లో ఇది తరచూ జరుగుతుంటుంది. ఇలా రక్తకణాల్లో కొనసాగుతూ వచ్చిన జన్యుమార్పులు (క్లోనల్ హిమటోపోయెసిస్) వాపుప్రక్రియకు దారితీస్తాయి. ఇది రక్తనాళాల్లో పూడికలకు బీజం వేస్తుంది. దీంతో రక్తనాళాల లోపలి మార్గం సన్నబడి గుండెపోటు, పక్షవాతం ముప్పులు పెరుగుతాయి.ఆరోగ్యకరమైన జీవనశైలితో వాపుప్రక్రియకు కళ్లెం వేయొచ్చు. అయితే క్లోనల్ హిమటోపోయెసిస్, దీని ప్రభావాలను ఆరోగ్యకరమైన జీవనశైలి ఎలా ప్రభావితం చేస్తుందన్నది స్పష్టంగా తెలియదు. ఈ నేపథ్యంలో ఇక్వాన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకులు దీనిపై దృష్టి సారించారు. శారీరకంగా చురుకుగా ఉండి, రక్తకణాల్లో జన్యుమార్పులు గలవారిని ఎంచుకొని పరిశోధించారు. అలాగే ఎలుకల మీదా అధ్యయనం నిర్వహించారు. ఒక మాదిరి నుంచి తీవ్ర శారీరక శ్రమ చేసేవారిలో జాక్2, టెట్2, టీఆర్‌పీ3 జన్యువుల్లో ఒకదాంతో తలెత్తే క్లోనల్ హిమటోపోయెసిస్ తక్కువగా ఉంటున్నట్టు గుర్తించారు. అయితే డీఎన్‌ఎంటీ3ఏ అనే జన్యుమార్పులతో తలెత్తే క్లోనల్ హిమటోపోయెసిస్ మీద ఎలాంటి ప్రభావం కనిపించలేదు.

జాక్2, టెట్2లో మార్పులు గల ఎలుకల్లో నిద్రలేమి మూలంగా క్లోనల్ హిమటోపోయెసిస్ ఎక్కువైంది. అయితే వ్యాయామంతో తగ్గింది.

జన్యుమార్పులపై ఒక్కో రకమైన జీవనశైలి ఒక్కోలా ప్రభావం చూపుతున్నట్టు ఇవి తెలియజేస్తున్నాయి.

క్లోనల్ హిమటోపోయెసిస్ మూలంగా ఎలుకల రక్తనాళాల్లో పూడికలు తీవ్రమయ్యాయి కూడా. నిద్రలేమితో రక్తకణాల్లో ఈ జన్యుమార్పులు ఎక్కువ కాగా.. వ్యాయామంతో తగ్గటం గమనార్హం. కాబట్టి రాత్రిపూట కంటి నిండా నిద్ర పోవటం, తగినంత శారీరక శ్రమ వ్యాయామం చేయటం మంచిది. ఇవి మూలం నుంచే గుండె రక్తనాళాల జబ్బుల నివారణకు తోడ్పడుతుండటం విశేషం.

## జ్వరం వచ్చినా స్నానం చేయొచ్చు



జ్వరం తీవ్రంగా ఉన్నప్పుడు శక్తి తగ్గుతుంది. మరోవైపు చలి పెడుతుంటుంది. ఇలాంటప్పుడు బాత్రూమ్‌లో నిల్చొని స్నానం చేస్తున్నప్పుడు కళ్లు తిరిగి పడిపోవచ్చు. ఈ ఉద్దేశంతో స్నానం చేయొద్దని అంటారు గానీ శక్తి ఉన్నవారు చేస్తే ఎలాంటి ఇబ్బందీ ఉండదు. స్నానం చేస్తే జ్వరం ఎక్కువవుతుందని అనుకోవటం అపోహ. నిజానికి జ్వరం వచ్చినవారికి ఆసుపత్రిలో రోజూ స్పాంజితో ఒళ్లంతా తుడుస్తారు. జ్వరం తీవ్రంగా ఉన్నప్పుడు చల్లటి నీటితో తుడిస్తే త్వరగా ఉష్ణోగ్రత తగ్గుతుంది కూడా. అందువల్ల జ్వరం వస్తే స్నానం చేయకూడదనేమీ లేదు.

**ఆటలమ్మ వస్తే మందులు అవసరం**

ఒకప్పుడు ఆటలమ్మ (చికెన్‌పాక్స్) ఎందుకొస్తుందో తెలియని రోజుల్లో పడక చుట్టూ వేపాకులు పెట్టేవారు. ఒంటికి పసుపు రాసేవారు. వీటితో పొక్కులు చీము పట్టటం తగ్గుతుందని భావించేవారు. ఇప్పుడు ఆటలమ్మకు వైరస్ కారణమనే సంగతి తెలుసు. యాంటీవైరల్ మందులూ అందుబాటులో ఉన్నాయి. కాబట్టి పూర్వకాలంలో మాదిరిగా కాకుండా డాక్టర్‌ను సంప్రదించి, తగు చికిత్స తీసుకోవటం మంచిది. మందులు వాడకపోతే సమస్య తీవ్రం కావొచ్చు. దీంతో న్యుమోనియా, మెదడు వంటి భాగాలు దెబ్బతినటం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదముంది.

**పసర్లలో పస లేదు**

కామెర్లకు పసర్లు పనిచేయవు. నిజానికి కామెర్లు ఒక జబ్బు కాదు. ఇదొక లక్షణం. వైరస్, పిత్తాశయ రాళ్లు, క్యాన్సర్లు, రక్తకణాలు విచ్ఛిన్నం కావటం వంటి రకరకాల అంశాలు కామెర్లకు దారితీస్తుంటాయి. కారణాన్ని బట్టి చికిత్స చేయాల్సి ఉంటుంది. అంతేతప్ప పసర్లతో ఉపయోగం లేదు. ఆలస్యం చేస్తే అనర్థం తప్పదు.

**మంత్రాలకు విషం దిగదు**

పాముకాటుకు మంత్రాలు పనిచేయవు. మనదేశంలో నాలుగురకాల విషపూరిత పాములున్నాయి. వీటన్నింటి విషానికి ఒకేరకం ఇంజెక్షన్ మందు అందుబాటులో ఉంది. విషం పాము కరిచినప్పుడు దీన్ని ఇస్తే ప్రాణాలు నిలుస్తాయి. కానీ మంత్రాల పేరుతో తాత్సారం చేస్తే మొదటికే మోసం వస్తుంది.

# భారత మహిళల దక్షిణాఫ్రికా పర్యటనలో మార్పులు.. కొత్తగా టీ20 సిరీస్ ఖరారు

- భారత మహిళల జట్టు దక్షిణాఫ్రికా పర్యటనలో మార్పులు
- టూర్‌కు కొత్తగా మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను జోడింపు
- 2027 ఛాంపియన్స్ ట్రోఫీ సన్నద్ధతలో భాగంగా ఈ నిర్ణయం
- డిసెంబర్ 9 నుంచి 30 వరకు టెస్ట్, వన్డే, టీ20 సిరీస్‌లు
- గత పర్యటనలో ఓటమికి బదులు తీర్చుకునే అవకాశం



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత మహిళల క్రికెట్ జట్టు డిసెంబర్ 2026లో చేపట్టనున్న దక్షిణాఫ్రికా పర్యటనకు సంబంధించి కీలకమైన మార్పు చోటుచేసుకుంది. ముందుగా ఖరారైన షెడ్యూల్‌కు అదనంగా మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను జోడించినట్లు క్రికెట్ సౌతాఫ్రికా (సీఎస్ఏ) అధికారికంగా ప్రకటించింది. 2027 ఫిబ్రవరిలో శ్రీలంక వేదికగా జరగనున్న తొలి ఐసీసీ ఉమెన్స్ ఛాంపియన్స్ ట్రోఫీకి జట్లను సన్నద్ధం చేసే లక్ష్యంతో ఈ టీ20 సిరీస్‌ను చేర్చినట్లు సీఎస్ఏ స్పష్టం చేసింది. ఈ పర్యటన డిసెంబర్ 9 నుంచి 30 వరకు జరగనుంది. ఈ మార్పుతో, పర్యటన చివర్లో టీ20 సిరీస్ నిర్వహించనున్నారు. డిసెంబర్ 26న బెనోనిలోని విల్లోమూర్ పార్క్‌లో పండుగ వాతావరణంలో 'బాక్సింగ్ డే' టీ20 మ్యాచ్ జరగనుంది. మిగిలిన రెండు టీ20 మ్యాచ్‌లు డిసెంబర్ 29, 30 తేదీలలో పోచెఫ్‌స్ట్రూమ్‌లోని ఎన్‌డబ్ల్యూసీ ఓవల్‌లో జరుగుతాయి. ఈ పర్యటన తొలుత డిసెంబర్ 9 నుంచి 12 వరకు గెబెర్హాలోని సెయింట్ జార్జ్ పార్క్‌లో ఏకైక టెస్టు మ్యాచ్‌తో ప్రారంభమవుతుంది. ఈ టెస్టు అనంతరం ఇరు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ జరగనుంది. ఈ వన్డేలు ఐసీసీ ఉమెన్స్ ఛాంపియన్‌షిప్ (×ఔజ)లో భాగం. డిసెంబర్ 16 నుంచి 22 వరకు పార్ల్, కేప్ టౌన్, బ్లూమ్‌ఫోంటెయిన్ నగరాలు ఈ వన్డే మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తాయి.

ఈ సవరించిన షెడ్యూల్‌పై క్రికెట్ సౌతాఫ్రికా సీఈఓ ఫోలెట్సీ మొసెకీ హర్షం వ్యక్తం చేశారు. "భారత పర్యటనకు టీ20 సిరీస్‌ను జోడించడం సంతోషంగా ఉంది. పండుగ సీజన్‌లో జరిగే ఈ మ్యాచ్‌లు, వచ్చే ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీకి మా ప్రోటీస్ మహిళల జట్టు సన్నద్ధతకు ఎంతగానో ఉపయోగపడతాయి. ప్రపంచ క్రికెట్‌లో భారత్ అత్యంత బలమైన జట్లలో ఒకటి. అలాంటి జట్టుతో మూడు ఫార్మాట్లలో తలపడటం మాకు విలువైన అనుభవాన్ని ఇస్తుంది," అని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో టీ20 ప్రపంచకప్ సన్నాహాల్లో భాగంగా భారత మహిళల జట్టు దక్షిణాఫ్రికాలో ఐదు టీ20ల సిరీస్‌లో పాల్గొంది. అయితే, ఆ సిరీస్‌ను 1-4 తేడాతో కోల్పోయింది. ఇప్పుడు ఈ కొత్త సిరీస్‌తో ఆ ఓటమికి బదులు తీర్చుకునే అవకాశం భారత జట్టుకు లభించింది.

## ఆ సమయంలో అమ్మాయిలతో జాగ్రత్త వైభవ్.. కాంబ్లీ, పృథ్వీ షాలలా అవ్వకూడదు: భారత మాజీ క్రికెటర్



**హైదరాబాద్ పెన్ పవర్:** కేవలం 15 ఏళ్లకే జాతీయ జట్టులో చోటు సంపాదించి, దిగ్గజ ఆటగాడు సచిన్ టెండూల్కర్ రికార్డును బద్దలు కొట్టాడు వైభవ్ సూర్యవంశీ. అద్భుతమైన ప్రతిభతో అతి పిన్న వయసులోనే అసాధారణ విజయాలు సాధిస్తున్న ఈ యువ కెరటంపై ప్రశంసలతో పాటు, అతడి భవిష్యత్తుపై ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప ఈ యువ ఆటగాడిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతపై కీలక వ్యాఖ్యలు చేశాడు. 2026 ఐపీఎల్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచి అందరి దృష్టిని ఆకర్షించిన వైభవ్ సూర్యవంశీ, ఆ తర్వాత భారత జట్టులోకి అడుగుపెట్టాడు. పురుషుల క్రికెట్‌లో అత్యంత పిన్న వయసులో అరంగేట్రం చేసిన భారత ఆటగాడిగా సచిన్ పేరిట ఉన్న రికార్డును సూర్యవంశీ తిరగరాశాడు. ఇటీవలి జింబాబ్వే పర్యటనలో తన నాలుగో మ్యాచ్‌లోనే తొలి అంతర్జాతీయ అర్ధశతకం నమోదు చేసి తన ప్రతిభను చాటుకున్నాడు. ఈ వేగవంతమైన ఎదుగుదలపై రాబిన్ ఊతప్ప ఒక యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ.. "వైట్ బాల్ క్రికెట్‌లో సచిన్ కంటే పెద్ద ప్రభావం చూపగల సామర్థ్యం అతడికి ఉంది. కానీ, అతడిని ఎలా ముందుకు నడిపిస్తామన్నదే ముఖ్యం. గతంలో ఎంతో మంది ప్రతిభావంతులైన ఆటగాళ్లు భారత క్రికెట్‌లోకి వచ్చారు. వినోద్ కాంబ్లీ, పృథ్వీ షా లాంటి వాళ్లను చూశాం. 17-18 ఏళ్ల వయసులో వారు ఏమవుతారని అందరూ అంచనాలు వేశారు. కానీ, అకస్మాత్తుగా వారు దారి తప్పారు" అని గుర్తుచేశాడు. "వైభవ్‌కు ఇదే మొదటి పరీక్ష. ఇప్పుడు అతడికి 15 ఏళ్లు. మరో ఐదేళ్ల పాటు అంటే 20 ఏళ్లు వచ్చే వరకు ఆటపైనే పూర్తి ఏకాగ్రతతో ఉండగలడా? అతడిని చూసుకోవడానికి చాలా మంది ఉన్నారు. కానీ, అతను ఆటపైనే దృష్టి పెట్టాలి. అతను అన్ని రకాల ప్రకటనలు, డీల్స్‌ను తిరస్కరించడం అభినందనీయం. 18 ఏళ్లు వచ్చాక అతడిని ఓ పురుషుడిగా చూడటం మొదలుపెడతారు. అమ్మాయిల నుంచి వచ్చే అటెన్షన్ కూడా పెరగొచ్చు. అది ఆటగాళ్లను దారి మళ్లించగలదు" అని ఊతప్ప హెచ్చరించాడు. అంతేకాకుండా వైభవ్‌ను ప్రస్తుతానికి సోషల్ మీడియాకు దూరంగా ఉంచడం ఉత్తమమని ఊతప్ప సూచించాడు. "ఈ కుర్రాడు క్రికెట్ కోసమే పుట్టాడు. విరాట్ కోహ్లీ విషయంలోనూ మనకు అలాగే అనిపించింది. అతడిని ఆ బబుల్‌లోనే బతకనివ్వండి" అని చెప్పుకొచ్చాడు. కాగా, సెప్టెంబర్ 19న ప్రారంభమయ్యే ఆసియా క్రీడల్లో వైభవ్ సూర్యవంశీ తదుపరి మ్యాచ్ ఆడనున్నాడు.

## ధోనీ గది ఎప్పుడూ తెరిచే ఉంటుంది.. కానీ ఒక కండిషన్: ఆసక్తికర విషయాలు చెప్పిన రహానే

- ధోనీ అందరిలాంటి సాధారణ వ్యక్తి అని చెప్పిన రహానే
- అతని గది తలుపులు సహచరుల కోసం ఎప్పుడూ తెరిచే ఉంటాయని వెల్లడి
- కానీ తలుపు మూసి ఉంటే మాత్రం లోపలికి ఎవరికీ అనుమతి ఉండదని స్పష్టీకరణ
- సిరీస్‌ల సమయంలో సోషల్ మీడియా యాప్‌లను డిలీట్ చేస్తానని వెల్లడి
- బెన్ స్టోక్స్ సలహాతోనే ఈ అలవాటు చేసుకున్నానని తెలిపిన రహానే





**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ చాలా ప్రశాంతమైన, సాధారణ వ్యక్తి అని, సహచర ఆటగాళ్ల కోసం అతని గది తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని సీనియర్ క్రికెటర్ అజింక్యా రహానే అన్నాడు. ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రహానే, ధోనీతో తనకున్న అనుబంధాన్ని ఓ పాడ్‌కాస్ట్‌లో పంచుకున్నాడు.

రహానే మాట్లాడుతూ.. "ధోనీ చాలా కూల్, అందరిలాగే ఓ సాధారణ మనిషి. అతని గది తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. చాలాసార్లు మేం 10 నుంచి 15 మంది, కొన్నిసార్లు జట్టు మొత్తం ఆయన గదిలోనే ఉండేవాళ్లం. అయితే, అతని గది తలుపు మూసి ఉంటే మాత్రం ఎవరూ లోపలికి వెళ్లే సాహసం చేసేవారు కాదు" అని గుర్తుచేసుకున్నాడు. రహానే తన అంతర్జాతీయ అరంగేట్రం (టెస్టు, వన్డే, టీ20) ధోనీ కెప్టెన్సీలోనే చేయడం, ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున కూడా కలిసి ఆడటం గమనార్హం.

ఇదే సందర్భంగా తాను సిరీస్‌ల సమయంలో మానసిక ప్రశాంతత కోసం సోషల్ మీడియాకు పూర్తిగా దూరంగా ఉండేవాడినని రహానే వెల్లడించాడు.

"సిరీస్ జరుగుతున్నప్పుడు నేను అన్ని సోషల్ మీడియా యాప్‌లను డిలీట్ చేస్తాను. 2017లో ఐపీఎల్‌లో కలిసి ఆడినప్పుడు ఇంగ్లండ్ ఆటగాడు బెన్ స్టోక్స్ ఈ సలహా ఇచ్చాడు. అప్పటినుంచి దీన్ని పాటిస్తున్నా" అని చెప్పాడు. గదిలో ఉన్నప్పుడు నెట్‌ఫ్లిక్స్‌లో ఏదైనా చూడటం, పుస్తకాలు చదవడం, కుటుంబంతో మాట్లాడటం వంటివి చేయడం ద్వారా మానసికంగా ఉల్లాసంగా ఉండేవాడినని రహానే వివరించాడు.

## నెగెటివిటీపై తీవ్రంగా కలత చెందిన డిజిటల్ ప్రిన్సెస్



రోజ్-గోల్డ్ సీక్విన్ దుస్తుల్లో మెరిసిపోతున్న రూహి సింగ్





డేటా -డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లు వెండితెరపై అడుగుపెట్టడం ఒక కొత్త ట్రెండ్‌గా మారింది. లక్షలాది మంది ఫాలోవర్లు ఉన్న డిజిటల్ తారలు సినిమాలో నటించడం వల్ల ప్రాజెక్ట్‌లకు తక్షణ ప్రచారం దక్కుతుందనేది నిజమే అయినా... ఆ ఫాలోయింగ్ థియేటర్లలో టికెట్లు తెగే మంత్రంగా మారుతుందా? లేదా? అనే అంశంపై తీవ్రమైన విశ్లేషణ మొదలైంది. సోషల్ మీడియాలో వచ్చే విమర్శలు, ట్రోలింగ్‌ను తట్టుకుంటూ ముందుకు సాగడం ఒక ఎత్తైతే, నటన ద్వారా ప్రేక్షకులను మెప్పించడం మరొక ప్రధాన సవాలుగా నిలుస్తోంది. ఇటీవల నటుడు రాఘవ్ జుయల్, ప్రముఖ కంటెంట్ క్రియేటర్ నిహారిక ఎన్‌ఎమ్ సోషల్ మీడియాలో వచ్చే ప్రతికూలతలపై స్పందిస్తూ --కుచ్ తో లోగ్ కహేంగే, లోగో కా కామ్ హై కెహ్నా-- అంటూ స్పష్టం చేశారు. నెగెటివిటీని పట్టించుకోకుండా తమ పనిపై మాత్రమే దృష్టి పెడతామని చెప్పిన విధానం ప్రతికూలతలను ఎదుర్కొనే నైజానికి అద్దం పడుతోంది. అయితే సోషల్ మీడియాలో మిలియన్ల కొద్దీ ఫాలోవర్లు ఉన్నా అది బాక్సాఫీస్ విజయానికి గ్యారెంటీ కాదని ఇటీవలి పరిణామాలు రుజువు చేస్తున్నాయి. ఇన్‌స్టాలో 34లక్షల మంది పైగా ఫాలోవర్లు ఉన్న నిహారిక ఎన్‌ఎమ్ కథానాయికగా నటించిన -భాయ్ తేరా స్టార్ హై- చిత్రం మొదటి రోజు పాతిక లక్షల స్వల్ప వసూళ్లను మాత్రమే సాధించింది. డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో ఫ్రీగా చూసే కంటెంట్‌కి ఉత్సాహం చూపే నెటిజన్లు, థియేటర్‌కి వచ్చి టికెట్ కొని సినిమా చూడటానికి కేవలం ఫాలోయింగ్ ఒక్కటే సరిపోదని ఈ ఫలితం స్పష్టం చేసింది. డిజిటల్ పాపులారిటీ వల్ల సినిమాకి ఆరంభంలో కొంత పబ్లిసిటీ లభించినా థియేటర్ రన్ అనేది పూర్తిగా నటన, కథాబలంతో పాటు ఇంకా చాలా చాలా అంశాలపై ఆధారపడి ఉంటుంది. అదే సమయంలో డిజిటల్ మీడియా నుండి వచ్చి నటన ద్వారా నిరూపించుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. క్రియేటర్ ధర్నా దుర్గా ఓటీటీ చిత్రం -మా బహెన్-లో కనబరిచిన నటనకు ప్రేక్షకుల నుండి మంచి ప్రశంసలు దక్కాయి. సోషల్ మీడియా ఇమేజ్‌ను పక్కన పెట్టి.. పాత్రకు తగ్గట్టుగా ప్రాణం పోస్తే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని ఆమె నిరూపించారు. అలాగే 20 మిలియన్ల కంటే ఎక్కువ ఫాలోవర్లు ఉన్న భువన్ బామ్ -కుకూ కీ కుండలి- చిత్రంతో వెండితెరకు పరిచయం అవుతుండగా... ఎల్విష్ యాదవ్ కూడా టైగర్ ష్రాఫ్‌తో కలిసి నటించేందుకు సిద్ధమవుతున్నారు. ముగింపుగా... సోషల్ మీడియా నెట్‌వర్కింగ్ క్రియేటర్లకు సినీ పరిశ్రమ తలుపులు సులువుగా తెరుచుకునేలా తోడ్పడవచ్చు కానీ... పరిశ్రమలో నిలదొక్కుకోవడానికి మాత్రం నిజమైన ప్రతిభ, స్క్రీన్ ప్రెజెన్స్.. నటన మాత్రమే ప్రామాణికం. ట్రోలింగ్‌ను దాటుకుని రావడం ఎంత ముఖ్యమో.. కంటెంట్ క్రియేటర్ అనే ముద్ర నుంచి బయటపడి నిజమైన నటుడిగా గుర్తింపు తెచ్చుకోవడం అంతకంటే ప్రధానం. నటనలోని నాణ్యత, బలమైన కథనం ఉన్నప్పుడే డిజిటల్ స్టార్ల సినీ ప్రయాణం సుదీర్ఘంగా సాగుతుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965